సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 317

శుక్రవారం 7-2-2020




'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'




**మారని రేట్లు.. వృద్ధికి చర్యలు**

రెపో, రివర్స్ రెపో రేట్లలో యథాతథ స్థితికి ఆర్‌బీఐ మొగ్గు -బిజినెస్‌లో



**ఇప్పటికీ అవే అసైన్‌మెంట్‌లు**

అప్పటి తరానికి, ఇప్పటి తరానికి పెద్దగా తేడాలేదంటున్న బర్ఖాదత్ –ఫ్యామిలీలో



SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


# హైదరాబాద్‌లో ఇద్దరికి కరోనా?

**గాంధీ ఆస్పత్రి ప్రత్యేక గదుల్లో చైనీయులకు చికిత్స**

- మొదటి పరీక్షలో 'పాజిటివ్'.. దీంతో మరోసారి పరీక్షలు
- ఆ రిపోర్టులు నేడు వస్తాయంటున్న గాంధీ ఆసుపత్రి వర్గాలు
- గత నెల 31నే హైదరాబాద్‌కి చేరుకున్న ఇద్దరు చైనా టెకీలు
- వారెక్కడెక్కడ తిరిగారోనన్న దానిపై ఆందోళన..
- తాజాగా 20 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోకి కరోనా వైరస్ ప్రవేశించిందా..? హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేసే ఇద్దరు చైనీయులకు కరోనా లక్షణాలున్నాయా అంటే..? గాంధీ ఆసుపత్రిలో పరిస్థితి చూస్తుంటే ఔనని అంటున్నాయి అక్కడి వర్గాలు. కానీ అధికారికంగా ధ్రువీకరించడంలేదు. దేశంలో ఇప్పటివరకు కేరళలో ముగ్గురికి కరోనా వైరస్ సోకగా, ఇప్పుడు హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో ఇద్దరు చైనీయులకు లక్షణాలు ఉన్నాయన్న ప్రచారంతో ఒక్కసారిగా రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ఉలిక్కిపడింది. అయితే గాంధీ ఆసుపత్రి అధికారులు మాత్రం ప్రస్తుతానికి ఎటువంటి పాజిటివ్

మిగతా 2వ పేజీలో ▶



## గాంధీకి వైద్య బృందం

గాంధీ ఆస్పత్రికి వచ్చే బాధితులకు సత్వర వైద్య సేవలు అందించేందుకు ఇతర ఆస్పత్రులకు చెందిన సుమారు వంద మంది వైద్య సిబ్బందిని డిప్యుటేషన్‌పై గాంధీకి పంపారు. వీరిలో 29 మంది నర్సులు, ఏడుగురు వైద్య నిపుణులు, పది మంది ల్యాబ్ టెక్నీషియన్లు, మరో 9 మంది జనరల్ మెడిసిన్ వైద్యులు సహా ఇతర సిబ్బంది ఉన్నారు. అంతేకాదు కరోనా అనుమానంతో వచ్చే రోగులను నేరుగా ఐసోలేషన్ వార్డుకు తరలించేందుకు ప్రత్యేక లిఫ్ట్‌తో పాటు హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు.



సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద బారులు తీరిన భక్తులు

# గద్దెనెక్కిన వరాల తల్లి

**గురువారం రాత్రి 9:09 గంటలకు గద్దెకు చేరిన సమ్మక్క**

చిలకలగుట్ట నుంచి గద్దెల వరకు ఎదురేగిన భక్తులు

దారి పొడవునా నృత్యాలు, శివసత్తుల పూనకాలు

పసుపు, కుంకుమ ముగ్గులు, యాట బలులు

గౌరవ సూచకంగా తుపాకీని పేల్చి స్వాగతం పలికిన ఎస్పీ

మేడారం గద్దెలపై నలుగురు వన దేవతలు



మేడారంలో గురువారం రాత్రి 9.09 గంటలకు సమ్మక్కను గద్దెపై ప్రతిష్టిస్తున్న పూజారులు

మేడారం నుంచి సాక్షి ప్రతినిధి, వరంగల్:

మేడారం సమ్మక్క నామస్మరణతో మార్మోగింది. అడవి అంతా జనాలతో నిండిపోయింది. ఆదివాసీ జాతరలో అతిముఖ్యమైన ఘట్టం ఆవిష్కృతమైంది. లక్షల మంది భక్తుల పారవశ్యం, గిరిజన యువతుల నృత్యాలు, కోయదొరల డోలు వాయిద్యాలు, శివసత్తుల పూనకాలు, హిజ్రాల మొక్కులు, అధికారుల లాంఛనాలు, పోలీసు ఉన్నతాధికారుల తుపాకీ కాల్పుల స్వాగతం, భారీ బందోబస్తు మధ్య ఆదివాసీలు, సమ్మక్క పూజారులు, వడ్డెలు వన దేవత సమ్మక్కను మేడారం గద్దెలపైకి చేర్చారు. ఆదివాసీ జాతరలో పతాక ఘట్టాన్ని చూసేందుకు లక్షల మంది భక్తులు తరలివచ్చారు. సమ్మక్క ఉండే చిలకలగుట్ట జనంతో కిటకిటలాడింది. అక్కడి నుంచి మేడారం వరకు కిలోమీటరున్నర దారి ఇరువైపులా జనంతో నిండిపోయింది. చిలకలగుట్ట నుంచి మేడారానికి సమ్మక్కను తీసుకువచ్చే ఆదివాసీ జాతర ప్రధాన ఘట్టం గురువారం సాయంత్రం 6:29 గంటల నుంచి రాత్రి 9:09 గంటల వరకు ఉద్విఘ్నంగా సాగింది.

**వేకువజాము నుంచే.....**

వనదేవత సమ్మక్కను మేడారం గద్దెలపైకి చేర్చే ప్రక్రియ గురువారం వేకువజామునే మొదలైంది. సమ్మక్క పూజారులు, వడ్డెలు ఉదయం 5.30 గంటలకు మేడారం సమీపంలోని వనంలోకి వెళ్లి వనం (వెదురు కర్రలు) తెచ్చి గద్దెలపై ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. సమీపంలోని సమ్మక్క పూజా మందిరం నుంచి వడరాల (కొత్త కుండలు)ను కూడా గద్దెలపైకి చేర్చారు. అనంతరం కుంకుమ భరిణె రూపంలో ఉన్న సమ్మక్కను గద్దెపైకి తెచ్చేందుకు పూజారులు, వడ్డెల బృందం సాయంత్రం 4 గంటలకు చిలకలగుట్టపైకి బయలు దేరింది. అప్పటికే చిలకలగుట్ట ప్రాంతం మొత్తం భక్తులతో నిండిపోయింది. సమ్మక్క రాక సందర్భంగా చిలకలగుట్ట నుంచి గద్దెల వరకు ఉన్న

మిగతా 2వ పేజీలో ▶

# సైకోకు ఉరి..

**హాజీపూర్ కేసుల్లో శ్రీనివాస్‌రెడ్డికి మరణశిక్ష**



- తీర్పునిచ్చిన నల్లగొండలోని పోక్సో కోర్టు
- అత్యాచారం, హత్య కేసుల్లో సైకో కిల్లర్‌పై నిరూపితమైన నేరం
- రెండు కేసుల్లో ఉరిశిక్ష
- మరో కేసులో యావజ్జీవం
- ఎగువ కోర్టుకు అప్పీలు చేసుకునే అవకాశం
- బాధితుల కుటుంబ సభ్యుల హర్షం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన యాదాద్రి భువనగిరి జిల్లా హాజీపూర్ కేసుల్లో మర్రి శ్రీనివాస్ రెడ్డికి ఉరిశిక్ష పడింది. నల్లగొండలోని పోక్సో న్యాయస్థానం ఉరిశిక్ష ఖరారు చేస్తూ తీర్పునిచ్చింది. హాజీపూర్‌లో ముగ్గురు బాలికలను అత్యాచారం, హత్య చేసి తన వ్యవసాయ బావిలోనే పూడ్చిపెట్టిన ప్రధాన నిందితుడు శ్రీనివాస్‌రెడ్డిపై ఎట్టకేలకు పోలీసులు నేర నిరూపణ చేశారు. ఇద్దరు బాలికల కేసుల్లో ఉరిశిక్ష, మరో బాలిక కేసులో యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ పోక్సో న్యాయస్థానం జడ్జి సిద్ధ వేద విద్యానాథరెడ్డి గురువారం సాయంత్రం 6.24 గంటలకు తుదితీర్పు ఇచ్చారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఎగువ కోర్టుకు అప్పీలు చేసుకునే అవకాశం కల్పించారు. ఈ కేసులో ప్రభుత్వం ప్రత్యేకంగా స్పెషల్ ప్రాసిక్యూటర్‌గా చంద్రశేఖర్‌ను నియమించగా, ఆయన రాచకొండ కమిషనరేట్ పోలీసుల తరఫున వాదించారు. నిందితుడు శ్రీనివాస్‌రెడ్డి తరఫున కేసును వాదించడానికి ఏ న్యాయవాది కూడా ముందుకు రాకపోవడంతో ఆయనకు న్యాయసహాయం అందించేందుకు లీగల్ సెల్ అథారిటీ ఎస్.ఆర్.ఠాగూర్‌ను

మిగతా 3వ పేజీలో ▶













# నిరసనలతో అరాచకం

- సీఏఏ, ఎన్‌పీఆర్ ప్రమాదకరమైనవి కావు.. విపక్షాలే లేనిపోని భయాలు సృష్టిస్తున్నాయి
- ఉభయ సభల్లో విపక్షాలపై నరేంద్ర మోదీ విమర్శలు
- రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు ప్రధాని సమాధానం

- వివరాలు 13లో

# కొత్తపేటలో బస్ టవర్స్

- పండ్ల మార్కెట్‌లో ఇంటర్ స్టేట్ బస్ టెర్మినల్!
- 21.78 ఎకరాల్లో మూడు టవర్లు.. సకల సౌకర్యాలు
- రాకపోకలతో పాటు రెస్టారెంట్లు, షాపింగ్ ఒకేచోట
- దిల్‌సుఖ్‌నగర్ డిపోలో సిటీ బస్ టెర్మినల్ నిర్మాణం
- హెచ్‌ఎండీఏ అధ్యయనం, ప్రభుత్వానికి నివేదిక

14లో

**నేడు జేబీఎస్ - ఎంజీబీఎస్**

# మెట్రో ప్రారంభం

- లాంఛనంగా ప్రారంభించనున్న ముఖ్యమంత్రి కేసీఆర్

- 2లో

epaper.sakshi.com



నేడు జేబీఎస్ - ఎంజీబీఎస్

# మెట్రో ప్రారంభం

## ప్రారంభించనున్న సీఎం కేసీఆర్

**సాక్షి, హైదరాబాద్:** జేబీఎస్ – ఎంజీబీఎస్ మార్గంలో (11 కి.మీ) ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా నేడు మెట్రో రైళ్లు లాంఛనంగా ప్రారంభం కానున్నాయి. సాయంత్రం 4 గంటలకు జేబీఎస్ వద్ద ఏర్పాటు చేయనున్న ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి కేసీఆర్, పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొననున్నారు. ఈ మార్గం పూర్తితో గ్రేటర్ నగరంలో 69 కి.మీ మెట్రోమార్గం అందుబాటులోకి వచ్చింది. నేడు ప్రారంభం కానున్న మెట్రోరైలు మార్గంలో జేబీఎస్ – పరేడ్ గ్రౌండ్స్, సికింద్రాబాద్ వెస్ట్, న్యూ గాంధీ హాస్పిటల్, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, చిక్కడపల్లి, నారాయణగూడ, సుల్తాన్ బజార్, ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్లు ఉన్నాయి. ఈ రూట్‌లో ఒక చివర నుంచి మరో చివరకు చేరుకునేందుకు 16 నిమిషాల సమయం పట్టనుంది. నిత్యం సుమారు లక్షమంది ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తారని మెట్రో అధికారులు అంచనా వేస్తున్నారు.

కవిత కృషి వల్లే

# పసుపు బోర్డు

## రాజ్యసభ సభ్యుడు బండ ప్రకాశ్

**సాక్షి, న్యూఢిల్లీ:** నిజామాబాద్‌లో పసుపు బోర్డు తన కృషి వల్లనే ఏర్పాటైనట్లు నిజామాబాద్ ఎంపీ అరవింద్ కుమార్ చెప్పుకుంటున్నారని.. కానీ దాని ఏర్పాటు వెనుక మాజీ ఎంపీ కవిత కృషి ఉందని రాజ్యసభ సభ్యుడు బండ ప్రకాశ్ తెలిపారు. పసుపు బోర్డు ఏర్పాటు కోసం తెలంగాణ ప్రభుత్వం స్థలం కూడా కేటాయించిందని ఆయన చెప్పారు. ప్రాంతీయ స్పైసెస్ బోర్డును వరంగల్ నుంచి తరలించరాదన్న సీఎం కేసీఆర్ విజ్ఞప్తికి అంగీకరిస్తూ కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అక్టోబర్‌లో లేఖ రాసినట్లు పేర్కొన్నారు. నిజామాబాద్‌లో ప్రస్తుతమున్న స్పైసెస్ బోర్డు డివిజన్ కార్యాలయాన్నే ప్రాంతీయ కార్యాలయంగా అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. పసుపు బోర్డు ఏర్పాటుకు తానే కారణమని గొప్పలు చెప్పుకోవడానికి బదులు రైతుల నుంచి పసుపు కొనుగోలు కోసం కేంద్రం రూ.100 కోట్లు కేటాయించేలా చూడాలని అరవింద్ కుమార్‌కు సూచించారు. అలాగే పసుపు పంటకు కనీస మద్దతు ధర ప్రకటించేలా చూడాలని కోరారు.





'సాగర్' కింద

# ఫుల్ జోష్

**సాక్షి, హైదరాబాద్:** నాగార్జునసాగర్ ప్రాజెక్టు కింద ప్రస్తుత యాసంగిలో గరిష్టనీటి వినియోగం జరుగుతోంది. ఈ ఏడాది నీటిలభ్యత ఎక్కువగా ఉండటంతో యాసంగిలో పూర్తి ఆయకట్టుకు నీరందుతోంది. ఇప్పటికే ఈ సీజన్‌లో రెండు తడుల ద్వారానే ఎడమ కాల్వ కింది అవసరాలకు 24 టీఎంసీల మేర వినియోగం జరగనుండగా, ఏప్రిల్ రెండో వారం వరకు మరో నాలుగు విడతల ద్వారా నీటి విడుదల కొనసాగనుంది. నిజానికి నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కింద 6.40 లక్షల ఎకరాల మేర ఆయకట్టు ఉన్నప్పటికీ యాసంగిలో ఎప్పుడూ పూర్తి స్థాయిలో నీరందింది లేదు. గతేడాది యాసంగిలో 27.39 టీఎంసీల నీటితో ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిన 4.15 లక్షల ఎకరాలకు నీరందించారు. అంతకుముందు 2017–18లో 46 టీఎంసీలతో 5.28 లక్షల ఎకరాలు, 2016–17లో 28.94 టీఎంసీలతో 4.14 లక్షల ఎకరాలు, 2015–16లో ఒక్క ఎకరాకు కూడా నీరందించలేదు. ఈ ఏడాది మాత్రం పుష్కలంగా నీటి లభ్యత ఉండటంతో 6 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టుకు నీరందిస్తున్నా రు. ఇప్పటికే ఆయకట్టు అవసరాల కోసం డిసెంబర్ రెండో వారం నుంచి ఇప్పటి వరకు రెండు తడుల ద్వారా 24 టీఎంసీల మేర నీటిని కాల్వలకు విడుదల చేశారు. గురువారం నుంచి వారం పాటు నీటి విడుదలను ఆపి, మళ్లీ తర్వాత కొనసాగించనున్నారు. అలాగే ఏప్రిల్ రెండో వారం వరకు మరో నాలుగు విడతలుగా నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. సాగర్‌లో ప్రస్తుతం 590 అడుగులకు గాను 551.30 అడుగుల మట్టం లో 212 టీఎంసీల నీటి లభ్యత ఉంది. కనీస నీటి మట్టాలకు ఎగువన ఉండే నీరు మరో 81 టీఎంసీల వరకు ఉంది. ఇందులో మరో 59 టీఎంసీలను తెలంగాణ వాటాగా వినియోగించుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో సాగర్ కింద పూర్తిస్థాయి ఆయకట్టుకు నీటిని అందిచవచ్చని నీటిపారుదల వర్గాలు చెబుతున్నాయి.



పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చిన భక్తులతో కిక్కిరిసిన జంపన్న వాగు, పరిసరాలు



జంపన్న వాగులో స్నానం చేస్తున్న యువతి

చంద్రబాబు సన్నిహితుల

# ఇళ్లల్లో ఐటీ సోదాలు

- బాబు మాజీ వ్యక్తిత కార్యదర్శి పెండ్యాల శ్రీనివాసరావు ఆస్తులపై గురి
- విజయవాడ, హైదరాబాద్‌లోని ఇళ్లలో ఏకకాలంలో సోదాలు
- కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి ఇళ్లు, కార్యాలయాల్లోనూ సోదాలు

**సాక్షి, అమరావతి/సాక్షి, హైదరాబాద్/కడప అర్బన్:** మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయన తనయుడు నారా లోకేశ్‌కు అత్యంత సన్నిహితులైన వారి ఇళ్లు, కార్యాలయాల్లో ఆదాయపు పన్ను(ఐటీ) శాఖ అధికారులు గురువారం సోదాలు చేపట్టారు. ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక బృందాలు ఈ సోదాల్లో పాల్గొన్నాయి. చంద్రబాబు మాజీ వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేసిన పెండ్యాల శ్రీనివాసరావుపై ఆదాయానికి మించిన ఆస్తులతో పాటు బినామీ ఆస్తులు కలిగి ఉన్నాడన్న ఆరోపణలు ఉన్నాయి. ఐటీ అధికారులు ఏకకాలంలో విజయవాడ, హైదరాబాద్‌లోని శ్రీనివాసరావు నివాసాల్లో సోదాలు నిర్వహించారు. 2019 ఎన్నికల వరకు చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేసిన శ్రీనివాసరావు ఎన్నికల తర్వాత సచివాలయంలోని జీఏడీలో పని చేస్తున్నారు. పదేళ్లుగా చంద్రబాబు వద్ద వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేసిన శ్రీనివాసరావు ఆ సమయంలో అధికారాన్ని అడ్డం పెట్టుకొని అక్రమ ఆస్తులు సంపాదించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. మాజీ మంత్రి నారా లోకేశ్‌కు అత్యంత సన్నిహితుడిగా ఈయనకు పేరుంది. గురువారం రాత్రి 9 గంటలు దాటిన తర్వాత తెలుగుదేశం పార్టీకి చెందిన ఇద్దరు న్యాయవాదులు విజయవాడలోని శ్రీనివాసరావు ఇంట్లోకి వెళ్లడానికి ప్రయత్నించగా సీఆర్‌ఎఫ్ సిబ్బంది అడ్డుకున్నారు. అలాగే లోకేశ్‌కు అత్యంత సన్నిహితుడైన రాజేశ్ ఇంటిలోనూ సోదాలు జరిగాయి.

**శ్రీనివాసులరెడ్డి ఇళ్లు, కార్యాలయాల్లోనూ..**

తెలుగుదేశం పార్టీ కడప జిల్లా అధ్యక్షుడు రెడ్డెప్పగారి శ్రీనివాసులరెడ్డి(వాసు) ఇళ్లు, కార్యాలయాల్లోనూ ఐటీ శాఖ అధికారులు గురువారం తెల్లవారుజాము నుంచి సోదాలు నిర్వహిస్తున్నారు. కడప ద్వారకానగర్‌లో ఉన్న ఇంటితో పాటు హైదరాబాద్‌లోని ఇల్లు, ఆఫీసుల్లో సోదాలు నిర్వహిస్తున్నారు. పూర్తిగా సీఆర్‌పీఎఫ్ పోలీసుల పహారాలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధం లేని అధికారులే ఈ సోదాల్లో పాల్గొనడం గమనార్హం.

**రూ.300 కోట్ల ఆన్‌లైన్ లావాదేవీలు**

మాజీ మంత్రి రెడ్డెప్పగారి రాజగోపాల్‌రెడ్డి తనయుడైన శ్రీనివాసులరెడ్డి ఆర్కే ఇన్‌ఫ్రా కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో రూ.కోట్ల విలువైన కాంట్రాక్ట్ పనులు నిర్వహిస్తున్నారు. ఏపీ, తెలంగాణతోపాటు కర్ణాటక, జార్ఖండ్, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లోనూ కాంట్రాక్ట్ పనులు చేసేవారు. ఆదాయానికి సంబంధించిన పన్నులు చెల్లించకుండా ఎగవేశారని పేర్కొంటూ ఐటీ అధికారులు రంగంలోకి దిగారు. పన్నుల ఎగవేతతోపాటు శ్రీనివాసులరెడ్డి కుమార్తె వివాహం నిశ్చయమైన సమయంలో దాదాపు రూ.300 కోట్ల ఆన్‌లైన్ లావాదేవీలు చేసినట్లు ఐటీ అధికారులు గుర్తించారు. ఈ సోదాల వివరాలను తెలియజేసేందుకు అధికారులు నిరాకరించారు. చంద్రబాబు మాజీ వ్యక్తిగత సహాయకుడు పెండ్యాల శ్రీనివాసరావు, కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి ఇళ్లు, కార్యాలయాల్లో ఐటీ శాఖ సోదాలు జరపడం తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**ఉత్తర తెలంగాణలోని నేతల ఇళ్లు, కార్యాలయాల్లో..**

తెలంగాణలోని కరీంనగర్‌లో గురువారం ఉదయం నుంచి ఐటీ సోదాలు కొనసాగుతున్నాయి. తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యభూమిక పోషిస్తున్న రెండు ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన నేతల ఇళ్లు, కార్యాలయాల్లో ఐటీ అధికారులు సోదాలు చేపట్టారు. పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. సదరు నేతలకు తెలంగాణవ్యాప్తంగా మల్టీప్లెక్స్‌లు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు ఉన్నాయి.

# గద్దెనెక్కిన వరాల తల్లి

▶ మొదటి పేజీ తరువాయి

కిలోమీటరు దారి మొత్తం రంగురంగుల ముగ్గులు వేసి భక్తులు యాటపోతులను బలిచ్చి మొక్కుకున్నారు. సమ్మక్కకు ఆడపడుచులు, ముత్తయిదవులు నీళ్ల బిందెలు, మంగళ హారతులతో స్వాగతం పలికారు.

**సాయంత్రం 6:29 గంటలకు...**

గురువారం సాయంత్రం 6:29 గంటలకు కుంకుమ భరిణి రూపంలో ఉన్న అడవితల్లి సమ్మక్కతో పూజారులు చిలకలగుట్ట దిగడం ప్రారంభించారు. వారు వస్తున్న విషయం తెలియడంతో ఒక్కసారిగా అక్కడున్న శివసత్తులు, మహిళలు పూనకాలతో ఊగిపోయారు. భక్తులు తన్మయత్వానికి లోనయ్యారు. ఈ ఉద్విఘ్నత కొనసాగుతుండగానే సమ్మక్కతో వడ్డే కొక్కెర కృష్ణయ్య చిలకలగుట్ట దిగారు. మిగిలిన పూజారులు, వడ్డెలు కృష్ణయ్యను తోడ్కొని వచ్చారు. సమ్మక్క రాకకు సూచికగా దేవతను ఆహ్వానిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున అధికారిక లాంఛనాల ప్రకారం ములుగు జిల్లా ఎస్పీ సంగ్రామ్‌సింగ్‌జీ పాటిల్ ఏకే 47 తుపాకీతో గాలిలోకి కాల్పులు జరిపారు. ఈ శబ్దం విన్నవెంటనే చిలకలగుట్ట ప్రాంతం భక్తిభావంతో ఉప్పొంగిపోయింది. సమ్మక్క నామస్మరణతో చిలుకలగుట్ట ప్రాంతం మార్మోగింది. ఆదివాసీ యువకుల రక్షణ వలయం, పోలీసు బలగాల రోప్ పార్టీ నడుమ పూజారులు, వడ్డెలు సమ్మక్క కుంకుమ భరిణె రూపంతో మేడారంవైపు బయలు దేరారు. చిలకలగుట్ట నుంచి ఫెన్సింగ్ వరకు సమ్మక్క చేరుకునేలోపు ఎస్పీ మొత్తం 3 సార్లు గాలిలో కాల్పులు జరిపారు. అక్కడి నుంచి భారీ పోలీ సు బందోబస్తు మధ్య పూజారులు, ఆదివాసీల మధ్య సమ్మక్కను మేడారం గద్దెలపైకి తరలించడం మొదలు పెట్టారు. చిలుకలగుట్ట నుంచి మేడారం వరకు లక్షల మంది భక్తులు సమ్మక్క రాకను చూసి తన్మయత్నం చెందారు. సమ్మక్కకు ఎదురుగా కోళ్లను, గొర్రెలను బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. శివసత్తులు పూనకాలతో ఊగారు. మొక్కుల కోసం తెచ్చుకున్న ఒడి బియ్యాన్ని దారిలో సమ్మక్క రూపంపై వెదజల్లారు. సమ్మక్కను తీసుకొస్తున్న పూజారులు అక్కడి నుంచి ఎదురుకోళ్ల పూజా మందిరం చేరుకున్నారు. పూజారులు 5 నిమిషాలు విశ్రాంతి తీసుకున్నారు. అనంతరం మేడారం గద్దెలకు బయలుదేరారు. మేడారం గద్దెల ముఖద్వారం వద్ద ఆ ఊరి ఆడబిడ్డలు సమ్మక్కను తీసుకొస్తున్న పూజారుల కాళ్లు కడిగి స్వాగతం పలికారు. అనంతరం పూజారులు సమ్మక్కను గద్దెలపైకి చేర్చారు. సమ్మక్కను గద్దెలపైకి ప్రతిష్టించిన రాత్రి 9:09 గంటలకు విద్యుత్ సరఫరా నిలిపివేసి తిరిగి రాత్రి 9:14 గంటల సమయంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. మొదట మేడారం వాసులు, జిల్లా అధికారులు మొక్కులు చెల్లించుకున్నారు.



**జనసందోహంగా మేడారం... ప్రముఖుల మొక్కులు**

నలుగురు వన దేవతలు... సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలపైకి చేరడంతో మొక్కులు సమర్పించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. గురువారం అర్ధరాత్రి వరకు మేడారం గద్దెల ప్రాంతం భారీగా వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. సమ్మక్క గద్దెలపైకి చేరే రోజు కావడంతో గురువారం ఒక్కరోజే ఏకంగా 30 లక్షల మంది వరకు మేడారానికి తరలివచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. వివిధ శాఖల నుంచి సేకరించిన సమాచారం మేరకు మేడారానికి వచ్చిన భక్తుల సంఖ్య శుక్రవారం కోటికి చేరనుందని భావిస్తున్నట్లు దేవాదాయ, సమాచార పౌరసంబంధాల శాఖల అధికారులు పేర్కొన్నారు. కాగా, మేడారంలో గురువారం పలువురు ప్రముఖులు వనదేవతలకు మొక్కులు సమర్పించుకున్నారు. తల్లులను దర్శించుకున్న వారిలో దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డితోపాటు మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్ సత్యవతి రాథోడ్, ఈటల రాజేందర్, ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్యే ధనసరి సీతక్క, కలెక్టర్ ఆర్.వి. కర్ణన్, ప్రత్యేకాధికారులు వి.పి. గౌతమ్, కృష్ణ ఆదిత్య, సీపీ డాక్టర్ రవీందర్, ఎస్పీ సంగ్రామ్‌సింగ్ పాటిల్, ఏఎస్పీ సాయిచైతన్య తదితరులు ఉన్నారు.

# హైదరాబాద్‌లో ఇద్దరికి కరోనా?

▶ మొదటి పేజీ తరువాయి

కేసులు లేవంటూనే, శుక్రవారం ఆ చైనీయులను వైద్య పరీక్ష ఫలితాలు వెల్లడిస్తామని చెబుతుండటం ఆందోళన కలిగిస్తోంది. అంతేకాదు కరోనా అనుమానితులు ఎవరైనా వస్తే వారిని ఒకే ఐసోలేషన్ వార్డుల్లో ఉంచి ఒకే చోట చికిత్స చేస్తుంటారు. కానీ ఈ ఇద్దరు చైనీయులను మాత్రం రెండు ప్రత్యేక గదుల్లో విడివిడిగా చికిత్స చేస్తుండటం కరోనా ప్రవేశించిందనే వాదనలకు బలం చేకూరుస్తోంది. అంతేకాదు వారికి ఒకసారి వైద్య పరీక్ష చేయగా, పాజిటివ్ లక్షణాలు, అనుమానాలు రావడంతో రెండోసారి పరీక్షలకు పంపించారు. ఫలితాలు శుక్రవారం వచ్చాక ప్రకటిస్తామని అంటున్నారు. అయితే ఈ విషయాన్ని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. అన్నీ నిర్ధారించుకున్నాకే ప్రకటిస్తారని అంటున్నారు.

**పెరుగుతున్న అనుమానిత కేసులు..**

కరోనా అనుమానిత కేసుల సంఖ్య రోజురోజుకు మరింత పెరుగుతోంది. చైనా దాని సమీప దేశాల నుంచి వచ్చిన వారు ఏ చిన్న అనుమానం వచ్చినా వెంటనే కరోనా నోడల్ కేంద్రాలకు చేరుకుని వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటున్నారు. ఇలా ఇప్పటికే 37 మందికి పరీక్షలు నిర్వహించగా, వీరందరికీ నెగిటివ్ రావడంతో ఆయా బాధితులందరినీ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. గురువారం గాంధీలో మరో 11 మంది.. ఫీవర్ ఆస్పత్రిలో 9 మంది చొప్పున కొత్తగా 20 మంది అనుమానితులు చేరారు. చైనా నుంచి ఇటీవల హైదరాబాద్‌కు చేరుకున్న వరంగల్ రూరల్ జిల్లాకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు సభ్యులు (తల్లి (37), తండ్రి (52), ముగ్గురు కుమారులు 20, 19, 17)తో పాటు షాంఘై నుంచి వచ్చిన ఇద్దరు వ్యక్తులు (35, 29), హాంకాంగ్ నుంచి వచ్చిన మరో ఇద్దరు అనుమానితులు గాంధీ ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారు. వీరి నుంచి నమూనాలు సేకరించి, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. బాధితుల రిపోర్ట్‌లు ఇంకా రావాల్సి ఉంది. ఇటు నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలోని కరోనా నోడల్ కేంద్రానికి గురువారం బంజారాహిల్స్ రోడ్ నంబర్ 2లోని ఓ సంస్థలో పనిచేస్తున్న ఇద్దరు మహిళలు సహా మరో ముగ్గురు యువకులు (మహిళలు (25), (31), పురుషులు (25), (30), (33)) నిర్ధారణ పరీక్షలకు వచ్చారు. వైద్యులు వీరి నుంచి నమూనాలు సేకరించి వ్యాధి నిర్ధారణ పరీక్షలకు పంపారు. ఇటీవల చైనా నుంచి వచ్చిన బడంగ్‌పేటకు చెందిన యువతి (27)తో పాటు టోలిచౌకికి చెందిన మరో ఇద్దరి నుంచి నమూనాలు సేకరించారు. అనుమానిత బాధితుల్లో బంజారాహిల్స్‌కు చెందిన వారు ఆస్పత్రిలో చేరేందుకు నిరాకరించడంతో వారి నుంచి నమూనాలు సేకరించి, హోమ్ ఐసోలేషన్‌కు పంపినట్లు తెలిసింది. ఇక ఎల్బీనగర్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేరిన ఆరు నెలల్లోపు శిశువుకు కరోనా లక్షణాలున్నాయంటూ ఆ ఆసుపత్రి యాజమాన్యం గాంధీ ఆసుపత్రికి రిఫర్ చేసింది. అయితే దీనిపై గాంధీ ఆస్పత్రి వర్గాలు మండిపడటంతో సంబంధిత యాజమాన్యం ఆ శిశువును డిశ్చార్జి చేసినట్లు తెలిసింది.



గాంధీ ఆస్పత్రిలోని ఐసోలేషన్ వార్డుకు తరలిస్తున్న కరోనా అనుమానిత విదేశీయులు

**గత నెల 31న చైనా నుంచి రాక...**

ఆ ఇద్దరు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. గత నెల 31న వారు చైనాలోని షాంఘై నగరం నుంచి ఇక్కడికి వచ్చినట్లు సమాచారం. కరోనా వైరస్ చైనాలో విజృంభించిన నేపథ్యంలో నిర్ధారణ పరీక్షలు చేయించుకుని వైరస్ లేదని నివేదిక తీసుకొస్తేనే విధుల్లో చేర్చుకుంటామని వారు పనిచేసే సాఫ్ట్‌వేర్ కార్యాలయ వర్గాలు ఆదేశించాయి. దీంతో ఆ ఇద్దరు చైనీయులు బుధవారం ఫీవర్ ఆస్పత్రికి వెళ్లి అవసరమైన శాంపిళ్లను ఇచ్చారు. అయితే వారు ఆసుపత్రిలో ఐసోలేషన్ వార్డులో అడ్మిట్ కాకుండా అక్కడి నుంచి వెళ్లిపోయారు. బుధవారం రాత్రి అందిన నివేదికలో ఇరువురికి కరోనా పాజిటివ్ లక్షణాలున్నట్లు ప్రాథమికంగా వైద్యులు గుర్తించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. దీంతో కేంద్ర ప్రభుత్వంతోపాటు రాష్ట్ర ఉన్నతాధికారులు అప్రమత్తమ య్యారు. ఆస్పత్రి నుంచి వెళ్లిపోయిన చైనీయుల కోసం ఆరా తీశారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ డిసీజెస్ సర్వైలెన్స్ ప్రోగ్రాం (ఐడీఎస్‌పీ) అధికారులకు సమాచారం అందించారు. ఐడీఎస్‌పీ అధికారి సదరు చైనీయులు ఉంటున్న అడ్రస్‌లకు వెళ్లి వారిని గురువారం ఉదయం గాంధీ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఐసోలేషన్ వార్డులో అడ్మిట్ చేసి మరోమారు రక్త నమూనాలు సేకరించి గాంధీ వైరాలజీ ల్యాబ్‌లో నిర్ధారణ చేస్తున్నట్లు తెలిసింది. ఇదిలావుంటే గాంధీ వైరాలజీ ల్యాబ్‌లో వీరికి కరోనా పాజిటివ్ వచ్చినా తక్షణమే ప్రకటించే అవకాశం లేదని తెలుస్తోంది. పాజిటివ్ వచ్చిన నివేదికతోపాటు మరోమారు రక్తనమూనాలు సేకరించి పుణేలోని వైరాలజీ ల్యాబొరేటరీకి పంపాల్సి ఉంటుందంటున్నారు. అక్కడ కూడా కరోనా పాజిటివ్ అని తేలితే ల్యాబ్ అధికారులు కేంద్ర ప్రభుత్వానికి సమాచారం అందిస్తారు. అప్పుడు మాత్రమే తెలంగాణలో కరోనా వైరస్ పాజిటివ్ కేసు నమోదైనట్లు కేంద్రం ప్రకటిస్తుందని వైద్యాధికారులు అంటున్నారు. ఇక గాంధీ ఆస్పత్రిలో ఇప్పటివరకు ఎటువంటి కరోనా వైరస్ పాజిటివ్ కేసు నమోదు కాలేదని ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రవణ్‌కుమార్ స్పష్టంచేశారు. నిర్ధారణ పరీక్ష నివేదికలు వచ్చాక ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు. మీడియా సంయమనం పాటించాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. గాంధీతోపాటు ఇతర ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి వచ్చిన 20 రక్త నమూనాలకు గురువారం కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామని, అర్ధరాత్రి దాటిన తర్వాత నివేదిక వెలువడే అవకాశం ఉందని మరో అధికారి తెలిపారు. అయితే గత నెలలో చైనా నుంచి వచ్చిన ఈ ఇద్దరు ఈ వారం రోజులపాటు హైదరాబాద్ నగరంలో ఎక్కడెక్కడ తిరిగారోనన్న భయాందోళనలు నెలకొన్నాయి.

**సీఎస్ సమీక్ష..**

కరోనా వైరస్ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ గురువారం వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షించారు. రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితి, కంట్రోల్ రూంకు వచ్చిన కాల్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంతమందికి ఇప్పటివరకు వైద్య పరీక్షలు చేశారో కూడా తెలుసుకున్నారు. కరోనా వైరస్ రాకుండా అన్ని రకాల కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. జిల్లాల్లోనూ కరోనా వైరస్ నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు.



శ్రీనివాస్‌రెడ్డిని గురువారం రాత్రి చర్లపల్లి జైలుకు తరలిస్తున్న పోలీసులు



నల్లగొండ కోర్టు బయట గుమిగూడిన జనం

# సైకోకు ఉరి..

▶ మొదటి పేజీ తరువాయి

న్యాయవాదిగా నియమించింది. అయితే ఈ కేసుల్లో నేర నిరూపణ జరిగిన మర్రి శ్రీనివాస్‌రెడ్డికి ఎగువ కోర్టులోనూ ఉచిత న్యాయ సహాయం అందించనున్నారు. వాస్తవానికి ఈ ఏడాది జనవరి 27నే తుది తీర్పు వెలువడాల్సి ఉన్నా వివిధ కారణాల వల్ల తీర్పు వాయిదా పడింది. గురువారం తీర్పు వెలువడిన వెంటనే కోర్టు ప్రాంగణంలోనే ఉన్న బాలిక తండ్రి నర్సింహా తీర్పు హర్షం వ్యక్తం చేశారు.. 'మా కడుపు కోత తీరదు. ముద్దాయికి ఉరి శిక్ష పడటంతో న్యాయం జరిగింది. శిక్ష వేయించడంలో పోలీసులు అన్న మాట నిలబెట్టుకున్నారు'అని వ్యాఖ్యానించారు. కాగా, శ్రీనివాస్‌రెడ్డిని గురువారం రాత్రి పోలీసులు హైదరాబాద్‌లోని చర్లపల్లి జైలుకు తరలించారు.

### ఇవీ.. శిక్షలు

- బాలిక–1 (కేసు నం.109): బాలికను కిడ్నాప్ చేసి, అత్యాచారం, హత్య చేసిన కేసులో నేరం నిరూపణ కావడంతో.. ఉరి శిక్ష, రూ.5 వేల జరిమానా విధించారు. కిడ్నాప్ కేసులో 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ.500 జరిమానా. అత్యాచారం కేసులో.. 20 సంవత్సరాల జైలు శిక్ష పడింది. ఈ నేరాలకు పోక్సో చట్టం కింద మరో 7 సంవత్సరాల జైలు శిక్ష విధించారు.
- బాలిక –2 (కేసు నం.110): బాలిక కిడ్నాప్, అత్యాచారం, హత్య కేసులోనూ ఉరి శిక్ష ఖరారైంది. మరో రూ.2 వేల జరిమానా విధించారు. కిడ్నాప్ చేసినందుకు 10 సంవత్సరాల జైలు, రూ.500 జరిమానా విధించారు. అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష పడింది. పోక్సో చట్టం కింద మరో 7 ఏళ్ల జైలు శిక్ష విధించారు.
- బాలిక–3 (కేసు నం.111): ఈ బాలిక కేసులో ముద్దాయికి యావజ్జీవ కారాగార శిక్ష (14 ఏళ్లు) పడింది. కిడ్నాప్ కేసులో 10 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధించారు. పోక్సో చట్టం కింద 7 ఏళ్ల జైలు, ఇదే చట్టంలోని సెక్షన్–12 కింద మరో 3 సంవత్సరాల జైలు శిక్ష విధించారు. ఈ శిక్షలన్నీ ఏకకాలంలో అమలవుతాయని జడ్జి తీర్పునిచ్చారు.

### సంచలనం సృష్టించిన కేసు..

యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మల రామారం మండలం హాజీపూర్ గ్రామానికి చెందిన మర్రి శ్రీనివాస్ రెడ్డి తన బైక్‌పై లిఫ్ట్ ఇస్తానని ముగ్గురు బాలికలను వేర్వేరు సందర్భాల్లో బైక్‌పై ఎక్కించుకొని తన వ్యవసాయ బావి వద్దకు తీసుకెళ్లి అత్యాచారం చేశాక, హత్య చేసి బావిలో పూడ్చిపెట్టాడు. అలా ఇప్పటివరకు శ్రావణి, మనీషా, కల్పనలు అతడి చేతిలో బలైనట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

- గతేడాది ఏప్రిల్ 25న హాజీపూర్ గ్రామానికి చెందిన బాలిక కనిపించట్లేదంటూ పోలీసులకు ఫిర్యాదు అందింది.
- 26న మర్రి శ్రీనివాస్‌రెడ్డి వ్యవసాయ బావి వద్ద ఆ బాలిక స్కూల్ బ్యాగ్‌ను గ్రామస్తులు గుర్తించారు.
- పోలీసులు ఏప్రిల్ 28న నిందితుడు శ్రీనివాస్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. గతంలో కనిపించకుండా పోయిన అదే గ్రామానికి చెందిన మరో బాలికతో పాటు మైసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఇంకో బాలికను కూడా ఇదే తరహాలో అత్యాచారం చేసి చంపినట్లుగా పోలీసులు విచారణలో గుర్తించారు.
- నిందితుడు శ్రీనివాస్‌రెడ్డి ఇచ్చిన సమాచారంతోనే బావిలో తవ్వకాలు జరిపి ఇద్దరు బాలికల అస్తికలు స్వాధీనం చేసుకున్నారు.
- రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును విచారించేందుకు నల్లగొండలో ప్రత్యేకంగా పోక్సో కోర్టును ఏర్పాటు చేసింది. జూలై 31 నుంచి ప్రత్యేక పోక్సో కోర్టులో విచారణ ప్రారంభమైంది.
- పోలీసులు ఈ కేసుల్లో ఫోరెన్సిక్, ఇతర సైంటిఫిక్ ఆధారాలను సేకరించి కోర్టుకు సాక్ష్యాధారాలుగా సమర్పించింది.
- మూడు కేసుల్లో 101 మంది సాక్ష్యులను కోర్టు విచారించింది.
- నమోదైన సాక్ష్యాలను సెక్షన్ 113 కింద నిందితుడికి తెలిపి, అతడి అభిప్రాయాన్ని కూడా కోర్టు తెలుసుకుంది.

### హాజీపూర్ కేసు డైరీ

**2019 ఏప్రిల్ 25:** హాజీపూర్‌కు చెందిన బాలిక మిస్సింగ్

**ఏప్రిల్ 26:** హాజీపూర్ మర్రిబావి పక్కన బాలిక స్కూల్ బ్యాగ్ గుర్తింపు. అదే రోజు పక్కనే గల తెట్టెబావిలో మృతదేహం వెలికితీత.

**ఏప్రిల్ 27:** బాలిక మృతదేహానికి భువనగిరిలో పోస్టుమార్టం.. అనంతరం గ్రామానికి తరలింపు. అదేరోజు బొమ్మలరామారం మండల కేంద్రంలో భారీ రాస్తారోకో. సంఘటనా స్థలాన్ని సందర్శించిన రాచకొండ సీపీ మహేశ్ భగవత్ బాధితులకు హామీ. సీపీ సమక్షంలో అంత్యక్రియలు.

**ఏప్రిల్ 29:** నెల రోజుల కింద తప్పిపోయిన మరో బాలిక మృతదేహం తెట్టెబావి నుంచి వెలికితీత

**ఏప్రిల్ 30:** మర్రిబావినుంచి ఇంకో బాలిక మృతదేహం వెలికితీత (అస్తికలు మాత్రమే మిగిలాయి)

**ఏప్రిల్ 30:** నిందితుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డి అరెస్టు. కోర్టులో హాజరు, జైలుకు తరలింపు

**మే 16, 17:** మర్రి శ్రీనివాస్‌రెడ్డికి ఉరిశిక్ష అమలు చేయాలని బొమ్మలరామారంలో బాధిత కుటుంబాల ఆమరణ దీక్ష

**జూలై 31:** నల్లగొండలో పోక్సో కోర్టు ఏర్పాటు

**అక్టోబర్ 14:** 111వ కేసులో సాక్షుల విచారణ ప్రారంభం

**అక్టోబర్ 28:** 109వ కేసులో సాక్షుల విచారణ ప్రారంభం

**నవంబర్ 4:** 110వ కేసులో సాక్షుల విచారణ

**2020 జనవరి 17:** కేసులో సాక్షుల విచారణ పూర్తి

**జనవరి 27:** వెలువరించాల్సిన తీర్పు వాయిదా

**ఫిబ్రవరి 06:** ఉరి, యావజ్జీవ శిక్ష ఖరారు చేస్తూ తుదితీర్పు

## అమ్మానాన్నలను చూసుకోవాలి..

### శిక్ష తగ్గించండి: శ్రీనివాస్‌రెడ్డి

**సాక్షిప్రతినిధి, నల్లగొండ:** హాజీపూర్ బాలికల హత్య కేసుల్లో పోక్సో కోర్టు జడ్జి సిద్ధవేద విద్యానాథరెడ్డి తీర్పు వెలువరించే ముందు ఒక్కో కేసు వివరాలను ప్రత్యేకంగా వివరించారు. నిందితుడు శ్రీనివాస్‌రెడ్డికి ఆ వివరాలు తెలియజేస్తూ.. అతడి అభిప్రాయాన్ని కోరారు. ఇదంతా మధ్యాహ్నం 2.04 గంటల నుంచి 2.17 గంటల వరకు కొనసాగింది.

- 'కేసు నంబర్ 109లో నువ్వు అత్యాచారం చేసి హత్య చేసినట్లుగా నేరం రుజువైంది. పోలీసులు సమర్పించిన సాక్ష్యాలన్నీ నువ్వే తప్పు చేసినట్లుగా రుజువు చేస్తున్నాయి. నువ్వు ఏమైనా చెప్పుకుంటావా'అని న్యాయమూర్తి.. శ్రీనివాస్ రెడ్డిని అడిగారు. 'నేను ఏ తప్పూ చేయలేదు. అంతా అబద్ధం. పోలీసులే నన్ను కొట్టి ఒప్పించారు'అని శ్రీనివాస్‌రెడ్డి న్యాయమూర్తికి విన్నవించుకున్నాడు.
- 'కేసు నంబర్ 110 విషయంలో.. లిఫ్ట్ ఇస్తానని తీసుకెళ్లి అమ్మాయిని అత్యాచారం చేసి, హత్య చేసి బావిలో పాతి పెట్టావు. ఈ నేరం కూడా నువ్వే చేసినట్లుగా రుజువైంది. నువ్వేమైనా చెప్పుకుంటావా..'అని న్యాయమూర్తి మరో బాలిక హత్య విషయంపై నిందితుడు శ్రీనివాస్‌రెడ్డిని అడిగారు. దీంతో నిందితుడు శ్రీనివాస్‌రెడ్డి.. 'నాకు ఏ సంబంధం లేదు, నేను చేయలేదు. మా భూములు లాక్కున్నారు. మా ఇల్లు కూలగొట్టారు. మా అమ్మ, నాన్నలను నేనే చూ సుకోవాలి. శిక్ష తగ్గించండి'అంటూ విలపించాడు.
- 'కేసు నంబర్ 111లో.. మరో బాలికను కిడ్నాప్ చేసి హత్య చేశావు. ఈ నేరం కూడా నువ్వే చేసినట్లుగా రుజువైంది. దీనికి నువ్వు ఏమైనా చెప్పుకుంటావా'అని న్యాయమూర్తి అడిగారు. దీంతో నిందితుడు శ్రీనివాస్‌రెడ్డి 'నాకేం తెలియదు. పోలీసులు కొట్టి ఒప్పించారు. మా అమ్మా నాన్నలను నేనే చూసుకోవాలి. మా భూములు లాక్కున్నారు. ఇల్లు కూలగొట్టారు' అంటూ మళ్లీ అదే సమాధానం చెప్పాడు.
- దీంతో 'మీ అమ్మానాన్నలు ఎక్కడున్నారో తెలుసా?'అని న్యాయమూర్తి అడిగారు. దీనికి తెలియదు అంటూ నిందితుడు సమాధానం చెప్పాడు. అసలు మీ అమ్మానాన్నలు బతికే ఉన్నారా అని జడ్జి అడగ్గా.. దానికి కూడా తెలియదు అంటూ శ్రీనివాస్‌రెడ్డి సమాధానం చెప్పాడు.

# శాస్త్రీయ ఆధారాలతో రుజువు..

- 'హాజీపూర్'కేసులను సవాల్‌గా తీసుకున్న పోలీస్ శాఖ
- శ్రీనివాస్‌రెడ్డికి ఉరిశిక్ష ఖరారు చేయడం వెనుక కసరత్తు

**సాక్షి, యాదాద్రి:** హాజీపూర్ కేసులో నిందితుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డి ఉరిశిక్ష ఖరారు చేయడం వెనుక తీవ్ర కసరత్తే జరిగింది. అత్యాచారాలు జరిగినప్పుడు ప్రత్యక్షంగా చూసిన వారు ఎవరూ లేకున్నా.. శాస్త్ర, సాంకేతికత, వైద్యరంగాన్ని ఉపయోగించుకుని కేసును ఛేదించి నిందితుడికి ఉరి శిక్షపడటంలో పోలీసులు సఫలీకృతులయ్యారు. పాఠశాలకు వెళ్తున్న బాలికలను టార్గెట్ చేసి లిఫ్ట్ ఇస్తానంటూ నమ్మించి బైక్‌పై ఎక్కించుకుని తన వ్యవసాయ బావి వద్దకు తీసుకెళ్లి అత్యాచారం, హత్య చేసిన వివరాలను పోలీసులు సమర్థంగా నిరూపించారు. నిందితుడి మొబైల్ కాల్‌డేటా, సాంకేతిక పరిజ్ఞానం, డీఎన్‌ఏ పరీక్షలు, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ నివేదిక సాయంతో ఈ మూడు కేసుల్లో చార్జ్‌షీటు దాఖలు చేశారు. హాజీపూర్ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, హత్యకు గురైన బాలికకు సంబంధించిన పుస్తకాల బ్యాగ్ ద్వారా నిందితుడిని గుర్తించారు.

### సవాలుగా తీసుకున్న పోలీసులు

హాజీపూర్ బాలికల కేసును సవాలుగా తీసుకున్న పోలీసులు నిందితుడిని వెంటనే పట్టుకోవడంలో సఫలీకృతులయ్యారు. ముగ్గురు బాలికలను అత్యాచారం, హత్య చేసి వ్యవసాయ బావుల్లో పూడ్చిపెట్టిన మర్రి శ్రీనివాస్‌రెడ్డి అరెస్టు విషయంలో ప్రభుత్వం, పోలీసుల పనితీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారని స్థానిక ఎస్సై వెంకటేశ్‌ను సస్పెండ్ చేశారు. కేసు విచారణ అధికారిగా భువనగిరి ఏసీపీ భుజంగరావును రాచకొండ పోలీస్ కమిషనర్ మహేశ్ భగవత్ నియమించారు. ఏప్రిల్ 29న శ్రీనివాస్‌రెడ్డిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చి వరంగల్ జైలుకు తరలించారు.

### వివిధ శాఖల సహకారం

పోలీసులకు సవాలుగా మారిన ముగ్గురు మైనర్ బాలికల అత్యాచారం, హత్య కేసులో రాచకొండ పోలీసులు వివిధ శాఖల సమన్వయం, సహకారంతో ముందుకు సాగారు. ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్, రెవెన్యూ, వైద్యారోగ్య శాఖలు, ఫింగర్ ప్రింట్స్, క్లూస్‌టీం, ఐటీ సెల్, వివిధ పాఠశాలల బాలికలు, సెల్‌ఫోన్ నెట్‌వర్క్ విభాగాలు, డీఎన్‌ఏ శాంపిల్స్, సీసీటీవీ ఫుటేజీలు, పోలీసు శాఖ వివిధ విభాగాల అధికారులు ఆధారంగా చార్జిషీట్‌లు దాఖలు చేసి నేరాన్ని రుజువు చేశారు.



శ్రీనివాస్‌రెడ్డికి ఉరిశిక్ష వేయడంతో మృతురాలి తల్లి నాగలక్ష్మికి స్వీట్ తినిపిస్తున్న గ్రామస్తురాలు

# ఊపిరిపీల్చుకున్న హాజీపూర్

- సైకో శ్రీనివాస్‌రెడ్డికి ఉరిశిక్ష వేయడంపై బాణసంచా కాల్చి సంబరాలు
- స్వీట్ల పంపిణీ.. రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ



మృతురాలి సోదరి మీనా ఆనందభాష్పాలు

**బొమ్మలరామారం:** హాజీపూర్ కేసులో నిందితుడు శ్రీనివాస్‌రెడ్డికి ఉరిశిక్ష వేసిన నేపథ్యంలో ఇన్నాళ్లు ఉత్కంఠగా ఎదురుచూసిన గ్రామస్తులు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. కంటతడిపెడుతూ తమ పిల్లల ఉసురు తగిలిందని బాధితకుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామస్తులు బాణసంచా కాల్చారు. పలువురు మహిళలు స్వీట్లు తినిపించుకుంటూ కనిపించారు.

### ఉదయం నుంచి ఎదురుచూపులు

సైకో శ్రీనివాస్‌రెడ్డికి కోర్టు ఏ శిక్ష వేస్తుందోనని గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు ఉదయం నుంచి ఎదురుచూశారు. ఉదయం 6 గంటల నుంచే గ్రామ పంచాయతీ ఆవరణకు చేరుకున్న బాధిత కుటుంబసభ్యులు, గ్రామస్తులు ప్లకార్డులతో బైఠాయించారు. మధ్యాహ్నం నేరం రుజువైందని జడ్జి చెప్పినట్లు తెలియడంతో కాసింత ఉపశమనం పొందారు. నిందితుడి శ్రీనివాస్‌రెడ్డికి ఉరిశిక్ష పడితేనే తమ పిల్లల ఆత్మలకు శాంతి కలుగుతుందని, లేకుంటే తమకు అప్పగిస్తే తగిన శాస్తి చేసి ఇంకెవరూ ఆడపిల్లల జోలికి వెళ్లకుండా శ్రీనివాస్‌రెడ్డికి శిక్ష విధిస్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రం 6 గంటల తర్వాత ఉరిశిక్ష వేసినట్లు తెలియడంతో ఒక్కసారిగా ఆనందం వ్యక్తం చేశారు. 'మా చెల్లిని చెరిచి చంపిన సైకోకు సరైన శిక్ష పడింది. ఇప్పుడు మాకు సంతోషంగా ఉంది'అని ఓ బాలిక సోదరి మీనా ఆనందభాష్పాలు రాల్చడం అక్కడున్న వారి మనస్సు చలింపజేసింది. రాత్రి గ్రామస్తులు ముగ్గురు బాలికల ఆత్మలకు శాంతి చేకూరాలని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు.

### ఉరితీసిన రోజే సంతృప్తి: పాముల నాగలక్ష్మి, బాలిక తల్లి

కోర్టు తీర్పుతో మాకు ఊరట లభించింది. నిందితుడికి కోర్టు ఉరిశిక్ష ఖరారు చేయడంపై సంతోషంగా ఉంది. శ్రీనివాస్‌రెడ్డిని ఉరితీసిన రోజే నిజమైన సంతృప్తి ఉంటుంది. నా కూతురును చిత్రవధ చేసి అత్యంత దారుణంగా హత్య చేసినట్లే అతడిని కూడా చిత్రహింసలకు గురిచేసి చంపాలి. ఉన్న ఒక్క కూతురును పోగొట్టుకుని అనునిత్యం తన జ్ఞాపకాలతో బతుకుతున్నాం. శ్రీనివాస్‌రెడ్డికి పడిన శిక్షతోనైనా ఆడపిల్లల జోలికి వెళ్లేవారికి గుణపాఠంగా మారుతుంది. ఉరిశిక్ష పడటంతో మా పిల్లల ఆత్మలు శాంతించాయి.



హాజీపూర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

# చదువుకునేందుకు వెళ్లి బలయ్యారు

- పేద కుటుంబాలైనా బడికి పంపిన తల్లిదండ్రులు
- రవాణా వసతి లేకపోవడంతో బాలికల బలి..
- బస్సు వసతి ఉంటే జరగకపోయేదంటున్న గ్రామస్తులు



హాజీపూర్‌లోని మర్రిబావి (ఫైల్)

**సాక్షి, యాదాద్రి:** 'బేటీ బచావో బేటీ పఢావో'నినాదంతో బాలికల రక్షణ, చదువు కోసం ప్రాధాన్యమిస్తున్న ఈ రోజుల్లో చదువు కోసం వెళ్లిన ముగ్గురు అమ్మాయిలు ఓ కిరాతకుడి చేతిలో బలయ్యారు. సరైన రవాణా వసతి లేకున్నా.. తమ కుమార్తెలను చదువు కోసం పొరుగున ఉన్న గ్రామాలకు పంపించాయి ఆ పేద కుటుంబాలు. కానీ లిఫ్ట్ ఇచ్చే పేరుతో ఓ రాక్షసుడు ఆ బాలికలపై ఘోరానికి ఒడిగట్టాడు. హాజీపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు, మైసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మరో బాలికపై హాజీపూర్ గ్రామానికి చెందిన మర్రి శ్రీనివాస్‌రెడ్డి అఘాయిత్యాలకు పాల్పడి హత్య చేసి తన వ్యవసాయ బావిలోనే పూడ్చిపెట్టిన విషయంలో కోర్టు నిందితుడికి ఉరిశిక్ష విధించింది. రాజధానికి శివారునే ఉన్న బొమ్మలరామారం మండలం హాజీపూర్‌కు గ్రామాల మీదుగా భువనగిరి వరకు బస్సు సౌకర్యం లేకపోవడంతోనే ముగ్గురు బాలికలు బలైపోయారని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.

### స్పెషల్ క్లాసులకు వెళ్లి..

మండలంలోని హాజీపూర్ గ్రామానికి చెందిన పాముల నర్సింహా, నాగమణి దంపతుల కుమార్తె(14) మేడ్చల్ జిల్లా కీసర మండలంలోని సెరినిటీ మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. ఆమె గతేడాది ఏప్రిల్ నెల 25న పాఠశాలలో ప్రత్యేక తరగతులకు వెళ్లి సాయంత్రం 3 గంటలు దాటినా ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. 2019 మార్చి 6 నుంచి కనిపించకుండా పోయిన హాజీపూర్ గ్రామానికే చెందిన మరో బాలిక(18) మేడ్చల్ జిల్లా కీసర సమీపంలోని కేఎల్‌ఆర్ కాలేజీలో బీకామ్ రెండో సంవత్సరం చదువుతోంది. ఈ నేపథ్యంలో 2019 మార్చిలో శివరాత్రి పర్వదినం అనంతరం 6వ తేదీన కాలేజీకి వెళ్లిన బాలిక తిరిగి ఇంటికి రాలేదు. ఈ ఇద్దరు బాలికలనూ హాజీపూర్‌కే చెందిన శ్రీనివాస్‌రెడ్డి లిఫ్ట్ ఇస్తానని నమ్మించి అత్యాచారం, హత్య చేసినట్లు నేరం రుజువు కావడంతో ఉరిశిక్ష పడింది.

### ఉద్యోగానికి పంపుదామంటే ఊపిరి తీసిండు:

పేద కుటుంబానికి చెందిన నేను కూతురిని చదివించి ఉద్యోగం చేసే స్థాయికి తీసుకొద్దామంటే సైకో శ్రీనివాస్‌రెడ్డి తన కూతురు ఊపిరి తీసి నా ఆశలు ఆవిరి చేసిండు. శ్రీనివాస్‌రెడ్డికి బతికే హక్కు లేదు. కోర్టు తీర్పుతో పానం నిమ్మలమైంది. వాయిదాలు లేకుండా తొందరగా ఉరి తీసి మా పిల్లల పానాలు తీసిన బావిలోనే సైకోను పాతి పెట్టాలి. అప్పుడే పోకిరీలకు కనువిప్పు కలుగుతుంది.

*– తిప్రబోయిన మల్లేశ్, బాలిక తండ్రి*

### సాక్షి కథనంతో తెరపైకి మరో మిస్సింగ్ కేసు

మైసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆరో తరగతి చదువుతున్న బాలిక (11) 2015లో అదృశ్యమైంది. ఈ మిస్సింగ్ కేసులో పోలీసులు నాలుగేళ్లుగా ఎలాంటి పురోగతి సాధించలేకపోయారు. 2019 ఏప్రిల్ 29న 'సాక్షి'దినపత్రికలో ఆ బాలిక మిస్సింగ్‌పై కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన పోలీసులు కస్టడీలో ఉన్న శ్రీనివాస్‌రెడ్డిని విచారించగా, ఆ బాలికనూ తానే పొట్టన పెట్టుకున్నట్లు ఒప్పుకొన్నాడు.

# హాజీపూర్ దోషికి ఉరిశిక్షపై జాజుల హర్షం



**సాక్షి, హైదరాబాద్:** హాజీపూర్ మైనర్ బాలికల హత్యాచార కేసుల్లో దోషి శ్రీనివాస్‌రెడ్డికి నల్లగొండ పోక్సో కోర్టు ఉరిశిక్ష వేయడాన్ని స్వాగతిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. సమత కేసులో 46 రోజులు, హాజీపూర్ కేసుల్లో 90 రోజుల్లోనే న్యాయస్థానాలు విచారణ చేపట్టి దోషులకు ఉరిశిక్షలు విధించడంతో ప్రజలకు న్యాయవ్యవస్థపై మరింత విశ్వాసం పెరిగిందని ఆయన చెప్పారు. బడుగు, బలహీన వర్గాల మహిళల హత్యల విషయంలో నిందితులకు శిక్షలు పడేలా చేసిన రాష్ట్ర సర్కార్, సీఎం కేసీఆర్‌తోపాటు పోలీస్ శాఖకు గురువారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

# ఉరిని స్వాగతిస్తున్నాం: ఇందిరా శోభన్



**సాక్షి, హైదరాబాద్:** హాజీపూర్ ఘటనలో కోర్టు తీర్పు ఆలస్యమైనా దోషి శ్రీనివాస్‌రెడ్డికి ఉరిశిక్ష విధించడాన్ని టీపీసీసీ అధికార ప్రతినిధి ఇందిరా శోభన్ పోశాల స్వాగతించారు. సమత కేసుతోపాటు హాజీపూర్ తీర్పును త్వరగా అమలు చేయాలని ఓ ప్రకటనలో ఆమె కోరారు. చట్టంలోని లొసుగులను ఆసరా చేసుకొని నిర్భయ కేసులో మాదిరిగా కాకుండా త్వరగా న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నామని పేర్కొన్నారు. దిశ, సమత, నిర్భయ లాంటి కేసుల్లో చట్టాల్లో ఉన్న లోపాలను పార్లమెంటులో ఎన్డీఏ ప్రభుత్వం సరిచేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనల్లో నిందితుల తరఫున న్యాయవాదులు వాదించకుండా బార్ కౌన్సిల్ తీర్మానం చేయాలన్నారు.

# త్వరితగతిన కేసును ఛేదించాం

### రాచకొండ సీపీ మహేశ్ భగవత్



**నల్లగొండ క్రైం:** హాజీపూర్ నేర సంఘటనలో కేసును త్వరితగతిన ఛేదించామని, బాధితులకు నష్ట పరిహారం అందేలా చూస్తామని రాచకొండ సీపీ మహేశ్ భగవత్ తెలిపారు. గురువారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. నేరస్తుడు శ్రీనివాస్‌రెడ్డి మైనర్లను తన బైక్‌పై తీసుకెళ్తానని నమ్మబలికి వ్యవసాయ బావి వద్దకు తీసుకెళ్లి అత్యాచారం, హత్య చేసి గోనె సంచిలో మూటకట్టి బావిలో పడేశాడని తెలిపారు. జిల్లా కోర్టు చరిత్రలో 55 ఏళ్లలో డబుల్ కేసులో ఉరిశిక్ష పడటం ఈ కేసులోనే కావొచ్చని పేర్కొన్నారు. బాధిత కుటుంబాల కడుపుకోత, ఆవేదన ఎవరూ తీర్చలేనిదని.. చట్ట ప్రకారం నేరస్తుడిని శిక్షించేందుకు అన్ని విధాలుగా తగిన సాంకేతిక సాక్ష్యాధారాలను సేకరించామని తెలిపారు. గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు అన్ని విధాలుగా సహకరించారని, డీజీపీ, ప్రభుత్వం కేసు త్వరితగతిన పూర్తి చేసి నేరస్తుడికి శిక్ష పడే విధంగా సహకరించారని పేర్కొన్నారు. గ్రామస్తులు రెండు పాతబావులతో ఆందోళన చెందారని, కలెక్టర్ సహకారంతో ఆ బావులను పూడ్చివేసినట్లు పేర్కొన్నారు. గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించి, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నేటికీ పోలీసు పహారా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పైకోర్టులో కూడా ఉరిశిక్ష పడేలా అన్ని ఆధారాలు అందజేస్తామని తెలిపారు.

# రాచకొండ సిబ్బందికి డీజీపీ మహేందర్‌రెడ్డి మెచ్చుకోలు



**సాక్షి, హైదరాబాద్:** రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హాజీపూర్ వరుస హత్యలు, అత్యాచార ఘటనల కేసులో బాధితులకు న్యాయం జరిగిందని డీజీపీ మహేందర్‌రెడ్డి అన్నారు. హంతకుడికి రెండు కేసుల్లో ఉరిశిక్ష, మరోకేసులో జీవిత ఖైదు పడిందని పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్‌తో పాటు కోర్టులో సాక్ష్యాలు సమర్పించడంలో సహకరించిన సాక్షులు, బాధిత కుటుంబీకులు, పౌర సమాజం, వేగంగా విచారణ పూర్తి చేసిన కోర్టుకు కృతజ్ఞతలు చెప్పారు. రికార్డు సమయంలో విచారణను పూర్తి చేసేందుకు అవసరమైన సాక్ష్యాలు సేకరించడంలో శ్రమించిన రాచకొండ కమిషనర్ మహేశ్ భగవత్, యాదాద్రి డీసీపీ నారాయణరెడ్డి, భువనగిరి ఏసీపీ భుజంగరావుతోపాటు విచారణ బృందాన్ని డీజీపీ మహేందర్‌రెడ్డి అభినందించారు. న్యాయస్థానానికి సాక్ష్యాలను సమర్పించి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సి.చంద్రశేఖర్‌ను ఆయన మెచ్చుకున్నారు. రాష్ట్రంలో జరిగే క్రూరమైన నేరాలను సమర్థవంతంగా విచారణ చేయడంతో పాటు నిందితులకు వేగంగా శిక్షలు అమలయ్యేలా చూస్తామని గురువారం ఓ ప్రకటనలో పునరుద్ఘాటించారు.

## పాత గుట్టలో వైభవంగా ఎదుర్కోలు


స్వామివారిని అశ్వవాహనంపై ఎదుర్కోలు ఉత్సవానికి తీసుకువస్తున్న అధికారులు

**యాదగిరిగుట్ట:** యాదాద్రి పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి ఎదుర్కోళ్ల మహోత్సవం కనుల పండువగా సాగింది. శ్రీ స్వామి వారిని పెళ్లి కొడుకుగా ముస్తాబు చేసి అశ్వవాహనంపై మేళతాళాలతో ఊరేగింపుగా కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. అనంతరం అర్చకులు, ఆలయ అధికారులు వధూవరుల తరపున రెండు బృందాలుగా ఏర్పడి నిర్వహించిన ఎదుర్కోలు మహోత్సవం వైభవంగా సాగింది. శుక్రవారం రాత్రి 8 గంటలకు శ్రీస్వామి, అమ్మవార్ల తిరు కల్యాణం జరగనుంది.

**సింహవాహనంపై ఊరేగిన స్వామి, అమ్మవారు**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం హవన పూజలు, మూల మూర్తి ఆరాధన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను సింహవాహన సేవపై తిరువీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఆస్థాన స్థానాచార్యులు రాఘవాచార్యులు, ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి పాల్గొన్నారు.

## ఉద్యోగులకు త్వరలోనే మంచి పీఆర్‌సీ

### మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



**నిజామాబాద్‌నాగారం/ఇందూరు(నిజామాబాద్ అర్బన్):** ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యోగులకు మంచి పీఆర్‌సీని ప్రకటిస్తారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గురువారం నిజామాబాద్‌లో టీఎన్జీవోస్ ఉమ్మడి (నిజామాబాద్, కామారెడ్డి) జిల్లాల 33వ జిల్లాస్థాయి క్రీడల టోర్నమెంట్, రెవెన్యూ ఉద్యోగుల డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాలకు మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వం ఎల్లప్పుడూ ఉద్యోగుల విషయంలో సానుకూల దృక్పథంతో ఉంటుందన్నారు. త్వరలో మంచి పీఆర్‌సీపై నిర్ణయం ఉంటుందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించడానికే ప్రభుత్వం కొత్త రెవెన్యూ చట్టాన్ని తెస్తోందని, రెవెన్యూ ఉద్యోగులు ఎటువంటి భయాలకు గురి కావాల్సిన అవసరం లేదని అన్నారు. కొత్త చట్టంతో భూ రికార్డుల ప్రక్షాళనలో ఏర్పడిన కొన్ని లోపాలను సరిదిద్దడానికి అవకాశం కలుగుతుందన్నారు.

## అడవిలో కాలినడకన కలెక్టర్



**ఇబ్రహీంపట్నం:** జగిత్యాల జిల్లా కలెక్టర్ జి.రవి గురువారం అడవిబాట పట్టారు. ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామం నుంచి ఎర్రాపూర్ వెళ్లే మార్గంలో ఉన్న మంకీ ఫుడ్ కోర్టును చూసేందుకు కలెక్టర్ రవి వెళ్లారు. దాదాపు కిలోమీటరు దూరం ఆయన అడవిలో అధికారులతో కలసి నడుచుకుంటూ వెళ్లారు. మంకీ ఫుడ్‌కోర్టుకు సమీపంలో హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను పరిశీలించారు.

## ఉమ్మడి పాలమూరులో భారీ జలాశయం

### నిర్మాణంకోసం జూరాల ఎగువ భాగం పరిశీలన



**గద్వాల టౌన్:** ఉమ్మడి పాలమూరు జిల్లాలో తక్కువ వ్యయంతో భారీ జలాశయాన్ని నిర్మించే దిశగా కసరత్తు జరుగుతోంది. ఇందులో భాగంగా గురువారం రిటైర్డు ఇంజనీర్ల ఫోరం ప్రతిపాదిత ప్రాంతాన్ని సందర్శించింది. వాస్తవ పరిస్థితులు, జలాశయాల లెవెల్స్, నీటి వల్ల ముంపునకు గురయ్యే ప్రాంతం, నిర్మాణ వ్యయం, నిర్వహణ భారంపై ఫోరం సభ్యులు సమగ్ర పరిశీలన చేశారు. ఫోరం ప్రధాన కార్యదర్శి శ్యాంప్రసాద్‌రెడ్డి, డిజైన్స్ విభాగం రిటైర్డు చీఫ్ ఇంజనీర్ వెంకట్రామరావు, రిటైర్డు చీఫ్ ఇంజనీర్ అనంతరాములు, ఉమ్మడి పాలమూరు జిల్లా రిటైర్డు చీఫ్ ఇంజనీర్ ఖగేందర్, జూరాల ప్రాజెక్టు ఎస్ఈ రఘునాథరావు, నెట్టెంపాడు ఈఈ రహీముద్దీన్ తదితరులు జూరాల ప్రాజెక్టు జలాశయానికి ఎగువన ధరూరు మండలంలో ఉన్న నాగర్‌దొడ్డి, డ్యాగదొడ్డి, నెట్టెంపాడు, గార్లపాడు గ్రామాల ప్రాంతాలలో లెవెల్స్‌ను పరిశీలించారు. జూరాల ప్రాజెక్టు జలాశయ సామర్థ్యం కేవలం 9.66 టీఎంసీలే ఉందని, ఈ నేపథ్యంలో జూరాలకు ఎగువన తక్కువ వ్యయంతో 15 నుంచి 20 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యంతో భారీ జలాశయం ఏర్పాటు చేసుకోవచ్చని రిటైర్డు ఇంజనీర్లు ప్రాథమిక అంచనాకు వచ్చారు. జూరాల జలాశయం నీటి నిల్వ నాగర్‌దొడ్డి గ్రామం వరకు ఉంటుంది. అక్కడే తక్కువ ఎత్తులో నీటిని మరో జలాశయంలోకి వరద సమయంలో ఎత్తిపోయడం వల్ల తక్కువ వ్యయం అవుతుందని నిపుణులు అభిప్రాయపడ్డారు.

## సంగారెడ్డిలో 130 అడుగుల గాంధీ విగ్రహం

### కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి



**సాక్షి,హైదరాబాద్:** త్వరలో సంగారెడ్డి జిల్లా కేంద్రంలో 130 అడుగుల గాంధీ విగ్రహం ఏర్పాటు చేస్తానని సంగారెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి చెప్పారు. ఈ విగ్రహ ఆవిష్కరణకు ఏఐసీసీ చీఫ్ సోనియాతో పాటు రాహుల్, ప్రియాంక గాంధీలను కూడా ఆహ్వానిస్తానని వెల్లడించారు. గురువారం ఆయన సీఎల్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ శాంతిస్వరూపుడు గాంధీ ప్రతి ఇంట్లో పుట్టాలని అందరూ కోరుకుంటారని, కానీ బీజేపీ నేతలు మాత్రం గాంధీ కంటే గాడ్సే మంచి అని మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ఎంపీలు గాంధీపై విమర్శలు చేస్తుంటే, మరో పక్క ఆ పార్టీ నేతలు గాంధీ చిత్రపటాలు పెట్టి ర్యాలీలు చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ నేతలు మహాత్మాగాంధీపై చేసిన విమర్శలు వెనక్కు తీసుకుని భేషరతుగా క్షమాపణలు చెప్పాలని జగ్గారెడ్డి డిమాండ్ చేశారు.

## ములుగును సమ్మక్క జిల్లాగా ప్రకటించాలి

### మంద కృష్ణమాదిగ డిమాండ్



**హన్మకొండ :** ములుగు కేంద్రంగా ఏర్పాటైన జిల్లాకు సమక్క–సారలమ్మ జిల్లాగా నామకరణం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. గురువారం సీఎం కేసీఆర్‌కు బహిరంగ లేఖ విడుదల చేశారు. అనంతరం కృష్ణమాదిగ మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగు జిల్లాకు దేవుళ్లు, దేవతల పేర్లు పెట్టిన సీఎం.. ములుగు జిల్లా విషయంలో వివక్ష చూపుతున్నారనడానికి ఇదే నిదర్శనమన్నారు. సమ్మక్క, సారలమ్మ జాతరకు జాతీయ హోదా కోసం ప్రయత్నించకపోగా.. రాష్ట్ర స్థాయిలో తగిన ప్రాధాన్యత ఇవ్వడంలేదని విమర్శించారు. మేడారం జాతరకు రూ.1000 కోట్లు ప్రకటించి, వారం రోజుల పాటు సెలవులు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

# పసుపు ధరలపై 'కరోనా' కాటు..

సాక్షిప్రతినిధి, నిజామాబాద్

**చైనా, ఇరాన్‌కు తగ్గిన ఎగుమతులు**

- కనిష్టంగా క్వింటాలుకు రూ.3,800 పడిపోయిన ధర
- ఆందోళనలో పసుపు రైతులు

ప్రాణాంతకమైన 'కరోనా'వైరస్ ప్రభావం పసుపు ఎగుమతులపై పడింది. చైనాకు ఎగుమతులు నిలిచిపోవడం, దీనికి తోడు దేశీయ మార్కెట్‌లో పాత నిల్వలు పేరుకుపోవడంతో ఈ సీజన్‌లో పసుపు ధర పూర్తిగా పతనమైందని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇక్కడినుంచి పసుపు అత్యధికంగా ఇరాన్ దేశానికి ఎగుమతి అవుతుంది. అలాగే ఐరోపా దేశాలతో పాటు, చైనాకు కూడా పసుపు ఎగుమతి అవుతుంది. ప్రధానంగా ఇరాన్‌లో పరిస్థితులు బాగా లేకపోవడం మరో పక్క చైనాలో కరోనా వైరస్ వల్ల ఏర్పడిన సంక్షోభం కారణంగా ఎగుమతులు పూర్తిగా పడిపోవడంతో దేశీయ మార్కెట్‌లో ధర తగ్గిపోయిందని మార్కెట్ వర్గాలు అంటున్నాయి.

**అన్నదాత కన్నీళ్లు..**

పసుపు ధర పతనమై క్వింటాలుకు కనిష్టంగా రూ.3,800 చేరడంతో అన్నదాతలు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. ప్రస్తుతం నిజామాబాద్ మార్కెట్‌కు పసుపు రాక ఊపందుకుంది. జనవరిలో మొత్తం 38 వేల క్వింటాళ్లు మార్కెట్‌కు రాగా, ఈనెల 25వ తేదీ నుంచి పంట రావడం మరింతగా పెరుగుతుంది. గతేడాది కంటే క్వింటాలుకు రూ.వెయ్యి నుంచి రూ.1,500 వరకు వ్యాపారులు తగ్గించి కొనుగోలు చేయడంతో పసుపు రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. గత ఏడాది ఫిబ్రవరిలో ఈ పంట సగటు ధర క్వింటాలుకు 5,500 వరకు పలికింది. గరిష్టంగా రూ.6,718 వరకు కొనుగోలు చేసిన వ్యాపారులు, ఇప్పుడు పూర్తిగా ధర తగ్గించడంతో పసుపు రైతులు పరేషాన్‌లో పడ్డారు.

**భారీగా పాత నిల్వలు..**

పసుపు పాత నిల్వలు కూడా భారీగా పేరుకుపోయాయని వ్యాపారులు చెబుతున్నారు. దేశవ్యాప్తంగా సుమారు 25 లక్షల క్వింటాళ్ల వరకు పసుపు నిల్వలున్నాయని అంచనా వేస్తున్నారు. ఒక్క నిజామాబాద్ మార్కెట్ పరిధిలోనే సుమారు 3 లక్షల క్వింటాళ్ల పసుపు కోల్డ్ స్టోరేజీల్లో ఉన్నట్లు మార్కెటింగ్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఇందులో గత ఏడాదితోపాటు అంతకు ముందు సీజనుకు సంబంధించిన పసుపు కూడా ఉంటుందని చెబుతున్నారు.

**ఎగుమతులు తగ్గాయి..**

విదేశాలకు పసుపు పంట ఎగుమతి తగ్గింది. ముఖ్యంగా కరోనా వైరస్ ప్రభావంతో చైనాకు ఎగుమతులు నిలిచిపోయాయి. అలాగే అత్యధికంగా కొనుగోలు చేసే ఇరాన్ కూడా సంక్షోభంలో ఉంది. దేశీయ మార్కెట్‌లోనూ డిమాండ్ తక్కువగా ఉంది. దీంతో ధర పెట్టలేకపోతున్నాము. అలాగే మహారాష్ట్రలో పసుపు విస్తీర్ణం పెరగడంతో పంట ఎక్కువగా వస్తోంది. డిమాండ్, సరఫరాకు తేడా ఉండటంతో ధర తగ్గుతోంది.

–కమల్ కిశోర్ ఇనానీ, పసుపు ఎగుమతిదారుడు


నిజామాబాద్ మార్కెట్ యార్డులో కుప్పలుగా పోసిన పసుపు

**బతుకు అందేరవుతోంది..**



వ్యాపారులు పసుపు ధర పూర్తిగా తగ్గించారు. మంచి రకం పంటను మార్కెట్‌కు తెస్తే క్వింటాలుకు రూ.5,385 ధర పెట్టిండ్రు. ఈ ధరకు అమ్మితే పెట్టుబడి కూడా రాదు. రెండు ఎకరాల్లో పసుపు వేసుకున్న. ఎరువు, విత్తనం, కూలీ ఖర్చులన్నీ కలిపి పెట్టుబడి రూ.లక్షన్నర దాటింది. పంట అంతా అమ్మినా పెట్టుబడి ఖర్చులు కూడా రాక మా బతుకే అందేరయ్యేట్లుగా ఉంది.

– ఇప్పగంగయ్య, పసుపు రైతు, దోంచంద, నిజామాబాద్‌జిల్లా.

**కైకిల్లకు చాల్తలేవు..**



పసుపు అమ్మితే వచ్చే డబ్బులు కూలీల ఖర్చులు (కైకిళ్లకు)కు చాలడం లేదు. పసుపు తవ్వకం కోసం కూలీలకు గంట లెక్క చొప్పున చెల్లించాల్సి వస్తుంది. 34 సంచులు తెస్తే బీట్ల రూ.4,426 ధర పెట్టిండ్రు. ఈ ధరకు పంట అమ్మితే నష్టమే. ఇదేం ధర అని వ్యాపారులను అడిగితే గుంజాయిషీలేదని అంటున్నరు. తిరిగి ఇంటికి తీసుకపోలేము.. ఏం చేయాలో అర్థమైతలేదు.

– గూడ నర్సారెడ్డి, పసుపురైతు ఇబ్రహీంపట్నం, జగిత్యాల జిల్లా.

## కూలిన స్లాబ్

### 21 మందికి తీవ్ర గాయాలు

**శామీర్‌పేట్:** మండలంలోని తుర్కపల్లి గ్రామ పరిధిలోని భారత్ బయోటెక్ కంపెనీలో నూతనంగా నిర్మిస్తున్న భవనం స్లాబ్ అకస్మాత్తుగా కూలిన ఘటనలో 21 మంది వలస కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. సీఐ సంతోషం వివరాల ప్రకారం.. భారత్ బయోటెక్ కంపెనీలో ఉన్న భవనంపై రెండవ అంతస్తు నిర్మాణ పనులు చేపట్టారు. ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన దాదాపు 40 మంది కూలీలు స్లాబ్ వేయడానికి సిద్ధమయ్యారు. స్లాబ్‌కు సంబంధించిన కర్రలు, సెంట్రింగ్ డబ్బాలు సరిగా లేకపోవడంతో ఒక్కసారిగా కుంగిపోయింది. దీంతో ఆందోళనకు లోనైన కూలీలు భయంతో పరుగులు తీయడంతో చెల్లాచెదురుగా పడిపోయారు. అధికారులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

# శభాష్ పోలీస్..

సాక్షి, హైదరాబాద్

- మౌలిక వసతుల్లో తెలంగాణ పోలీస్ భేష్
- 2,75,528 సీసీ కెమెరాలతో దేశంలోనే నంబర్‌వన్
- సంతృప్తికరంగా వాహనాలు, ఠాణాలు, ఇతర సదుపాయాలు
- డీవోపీవో గణాంకాల్లో వెల్లడి

ఒకప్పుడు తెలంగాణలో పోలీసు విధుల నిర్వహణ అంటే ప్రాణాలకు గ్యారెంటీ ఉండేది కాదు. డిపార్ట్‌మెంట్‌లో ఈ ప్రాంతాన్ని మావోయిస్టు ప్రాబల్య ప్రాంతంగా.. పనిష్మెంట్ జోన్‌గా పరిగణించేవారు. కానీ, రాష్ట్రంగా అవతరించాక ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. తెలంగాణ పోలీసులకు బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. వాహనాలు, కమ్యూనికేషన్, ఫోరెన్సిక్, సీసీ కెమెరాలకు భారీగా ప్రాధాన్యం కల్పించింది. ఫలితంగా తెలంగాణ పోలీసులు నేర దర్యాప్తులో దేశంలోనే నంబర్‌వన్‌గా ఉన్నారు. ఇప్పుడు ఇదే విషయాన్ని కేంద్ర హోం శాఖ అనుబంధ విభాగమైన డేటా ఆన్ పోలీస్ ఆర్గనైజేషన్స్ (డీవోపీవో) కూడా వెల్లడించింది. 2019 జనవరి 1 వరకు అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం ఈ నివేదిక విడుదలైంది. విధుల నిర్వహణకు పోలీసులకు మౌలిక, సాంకేతిక సదుపాయాలు ఎంతో కీలకం. ఈ రెండింటిలో తెలంగాణ పోలీసులకు సంతృప్త స్థాయిలో సదుపాయాలు ఉండటం గమనార్హం.

**సీసీ కెమెరాల్లో దేశంలోనే టాప్..**

సీసీ కెమెరాల ఏర్పాటు విషయంలో తెలంగాణ దేశంలోని మిగతా రాష్ట్రాల కంటే ముందంజలో ఉంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో 4,27,529 సీసీ కెమెరాలు ఉండగా.. ఒక్క తెలంగాణలోనే 2,75,528 సీసీ కెమెరాలను తెలంగాణ పోలీసు శాఖ ఏర్పాటు చేయగలిగింది. పెద్ద రాష్ట్రాలైన తమిళనాడులో 40,112, మహారాష్ట్రలో 39,587, ఉత్తర్‌ప్రదేశ్‌లో కేవలం 2,134 మాత్రమే ఉండటం గమనార్హం. నేర దర్యాప్తు, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలే కీలకంగా మారాయి. తెలంగాణ ఆవిర్భావం తర్వాత అనేక నేరాలు, దోపిడీలను కేవలం 24 గంటల్లోనే పోలీసులు ఛేదించగలుగుతున్నారంటే దానికి కారణం సీసీ కెమెరాలే. రాష్ట్రంలో ఉన్న 815 పోలీసు స్టేషన్లలో ప్రతీ స్టేషన్‌కి వాహనాల సదుపాయం, మొబైల్స్, వైర్‌లెస్ సదుపాయం ఉన్నాయి.

**8 నుంచి 10 నిమిషాల్లోనే స్పాట్‌కు..**

వాహనాల విషయంలో ప్రభుత్వం రూ.వందల కోట్లు డిపార్ట్‌మెంట్‌కు కేటాయించింది. ప్రస్తుతం డిపార్ట్‌మెంట్ వద్ద మొత్తం 10,009 వాహనాలు ఉండగా.. అందులో 4,729 టూవీలర్లు ఉన్నాయి. దాదాపుగా అన్నీ కొత్త వాహనాలు కావడంతో 100కి డయల్ చేశాక, సరాసరిగా కేవలం 8 నుంచి 10 నిమిషాల్లోపే పోలీసులు స్పాట్‌కు చేరుకుంటున్నారు. వాహన వేగానికి కళ్లెం వేసే 28 స్పీడో మీటర్లు, 498 బ్రీత్ అనలైజర్లు ఉన్నాయి. పోలీసులు నివాసముండేందుకు ఉద్దేశించిన నివాస సముదాయాలు కూడా భారీగానే ఉన్నాయి. 2018 వరకు రాష్ట్రంలో 40,286 పోలీసు క్వార్టర్లు అందుబాటులో ఉన్నాయి. ఈ విషయంలో మహారాష్ట్ర, యూపీ, తమిళనాడు, రాజస్థాన్, గుజరాత్, కర్నాటక తరువాత స్థానాల్లో నిలిచాయి.

## నిస్వార్థ సేవకుడు వర్థెల్లి బుచ్చిరాములు

### సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి


వర్థెల్లి బుచ్చిరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జూలకంటి, వర్థెల్లి మురళి, మల్లు లక్ష్మి తదితరులు

**సూర్యాపేట:** తాను పట్టిన ఎర్రజెండాను విడనాడకుండా చనిపోయేంత వరకు పార్టీ కోసం, ప్రజల కోసం పనిచేసిన స్వార్థం లేని నాయకుడు వర్థెల్లి బుచ్చిరాములు అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్‌లో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుచ్చిరాములు ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ, తన జీవితానంతా పేద ప్రజల కోసం ధారపోసిన కమ్యూనిస్టు యోధుడు బుచ్చిరాములు అని,.. నమ్మిన సిద్ధాంతం కోసం ఎనాడూ రాజీపడని వ్యక్తి అని కొనియాడారు. సమసమాజ స్థాపనకు నాటి తెలంగాణ సాయుధ పోరాటం నుంచి నేటి తెలంగాణ ఉద్యమం వరకు పోరాడిన ఏకైక వ్యక్తిగా నిలిచారన్నారు. రాజకీయాల్లో విలువలు తగ్గుతున్నా, తాను నమ్మిన సిద్ధాంతాలకే కట్టుబడి సమాజ సేవకు పాటుపడ్డారని కొనియాడారు. బహుజన రాజ్యాధికారం సాధించేందుకు మొదటి పునాది వేసి పోరాటాలు నడిపారన్నారు. బీఎన్, ధర్మభిక్షం, నల్లా రాఘవరెడ్డిలు మొదటి తరం పోరాట నాయకులుగా కొనసాగితే .. రెండోతరానికి బుచ్చిరాములు నాయకత్వం వహించారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరాములు కుమారుడు, సాక్షి ఎడిటర్ వర్థెల్లి మురళి, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డెక్కిన కంది రైతులు

### మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో ధర్నా

**అలంపూర్:** కంది పంటకు మద్దతు ధర కల్పించి పూర్తి స్థాయిలో పంట కొనుగోళ్లు చేయాలని రైతులు రోడ్డెక్కారు. గురువారం గద్వాల జిల్లా అలంపూర్ చౌరస్తాలో 44వ నంబర్ జాతీయరహదారిపై మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ఆధ్వర్యంలో రైతులు ధర్నాకు దిగారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో కందులు అమ్మేందుకు రైతులు రాగా.. వారిని లోపలికి అనుమతించలేదు. దీంతో మార్కెట్ యార్డు వద్ద కంది ధాన్యంతో వచ్చిన వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ అక్కడికి చేరుకుని రైతులకు మద్దతుగా జాతీయరహదారిపై బైఠాయించారు. రైతులు కష్టపడి పండించిన పంటకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించడం లేదని ఆయన మండిపడ్డారు. రెండు రోజులుగా రైతులు కొనుగోలు కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్నా కనికరం చూపడం లేదన్నారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలన్నారు. అనంతరం గద్వాల కలెక్టర్ శృతి ఓఝాతో ఫోన్‌లో మాట్లాడిన సంపత్, రైతుల పరిస్థితిని వివరించారు. మార్కెట్ అధికారులు రైతుల వాహనాలను లోపలికి అనుమతి ఇవ్వడంతో ధర్నా విరమించారు. రైతులు ఆందోళన చేయడంతో హైదరాబాద్–బెంగళూరు రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోయాయి.

## రోడ్డున పడిన 'బీఎడ్' విద్యార్థులు

- కాలేజీ పేరుతో ఘరానా మోసం
- సెమిస్టర్ పరీక్షలు వచ్చినా అందని హాల్‌టికెట్లు
- కాలేజీకి అసలు గుర్తింపు లేదని తెలిసి లబోదిబోమంటున్న విద్యార్థులు

**సాక్షి, హైదరాబాద్:** మైనారిటీ బీఎడ్ కాలేజీ అని ప్రచారం చేశారు. జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్‌సీటీఈ) అనుమతి ఉందన్నారు. 67 మంది విద్యార్థులను చేర్పించుకున్నారు. అందులో 62 మంది నిరుపేద కుటుంబాలకు చెందిన బాలికలే. ఒక్కో విద్యార్థి నుంచి రూ.20 వేల నుంచి రూ.లక్ష వరకు ఫీజు వసూలు చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి సదరు కాలేజీ అనుబంధ గుర్తింపు పొందలేదు. కనీసం దరఖాస్తు కూడా చేయలేదు. అయినా విద్యార్థులకు తరగతులు నిర్వహించింది. సెమిస్టర్ పరీక్షలు వచ్చాయి. హాల్‌టికెట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు యాజమాన్యాన్ని నిలదీశారు. యూనివర్సిటీ ఇవ్వలేదని, వెళ్లి అడగమంటూ బుకాయించారు. యూనివర్సిటీకి వెళితే అసలు ఆ పేరుతో ఎవరూ అనుబంధ గుర్తింపు కావాలని తమకు దరఖాస్తు చేసుకోలేదని చెప్పారు. దీంతో తాము మోసపోయామని గ్రహించిన విద్యార్థులు తీవ్ర ఆందోళనలో పడ్డారు. కాలేజీ డైరెక్టర్‌పై ఆసిఫ్‌నగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మరోవైపు తమకు న్యాయం చేయాలంటూ విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డికి గురువారం విజ్ఞప్తి చేశారు. మెహదీపట్నం మురాద్‌నగర్‌లో హిదాయహ్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ పేరుతో విద్యా సంస్థను పెట్టి తమను మోసం చేశారని.. జరిగిందంతా మంత్రికి, చైర్మన్‌కు వివరించారు. ఈ నెల 1 నుంచి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం అయ్యాయని, తమకు ఎలాగైనా న్యాయం చేయాలని విన్నవించారు.

**వర్సిటీ అధికారులతో మాట్లాడిన మంత్రి సబిత..**

ఘటనపై స్పందించిన మంత్రి బాధిత విద్యార్థులకు న్యాయం చేసే మార్గం ఏమైనా ఉంటే పరిశీలించాలని మండలి చైర్మన్ పాపిరెడ్డికి సూచించారు. ఆయన యూనివర్సిటీ అధికారులతో మాట్లాడారు. ఆ విద్యార్థుల్లో ఎక్కువ మంది బ్యాచిలర్ ఎడ్యుకేషన్‌లో (బీఎడ్) ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్‌సెట్ రాయలేదు. పైగా ఆ కాలేజీ పేరు యూనివర్సిటీ రికార్డుల్లో లేదు. అనుబంధ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోలేదు. ఈ పరిస్థితుల్లో ఏం చేయాలనే దానిపై అధికారులు ఆలోచనల్లో పడ్డారు. ఈ పరిస్థితుల్లో తాము ఏమీ చేయలేమని పాపిరెడ్డి పేర్కొన్నారు.

# తల్లీకూతురు దారుణహత్య..

- నిద్రిస్తున్న మారుతల్లి, చెల్లి తలపై రోకలిబండతో మోది యువకుడి ఘాతుకం
- పోలీసుల ఎదుట లొంగిపోయిన నిందితుడు
- ఆస్తికోసం కుటుంబాల మధ్య గొడవలు!
- సూర్యాపేట జిల్లాలో ఘటన


అంజమ్మ


మౌనిక

**సూర్యాపేట రూరల్:** మారు తల్లిని, ఆమె కూతురుని రోకలిబండతో మోది హత్య చేశాడు ఓ యువకుడు. అనంతరం అతను పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. సూర్యాపేట జిల్లా తాళ్లఖమ్మంపహాడ్ గ్రామంలో గురువారం తెల్లవారుజామున ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కప్పల నాగయ్య, మోతె మండలం సిరికొండ గ్రామానికి చెందిన అచ్చమ్మను వివాహం చేసుకున్నాడు. వీరికి కుమారుడు హరీశ్, కూతురు అంజలి ఉన్నారు. కాగా, కొన్ని సంవత్సరాల తర్వాత అచ్చమ్మ అనారోగ్యంతో ఉండడంతో అచ్చమ్మ సోదరి అయిన అంజమ్మ (38)ను నాగయ్య రెండో వివాహం చేసుకున్నాడు. ఆమెకు మౌనిక (18) అనే కూతురు ఉంది. పదేళ్ల క్రితం నాగయ్య మృతి చెందడంతో ఇద్దరు తోబుట్టువుల మధ్య పిల్లలకు దక్కాల్సిన ఆస్తి వాటాలపై తగాదాలు ప్రారంభమయ్యాయి. తరచూ ఆస్తి కోసం గొడవలు జరుగుతుండడంతో పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయతీలు కూడా పెట్టారు. నాగయ్య ఇద్దరు భార్యలు, ముగ్గురు సంతానానికి పెద్ద మనుషులు ఐదు వాటాలు వేశారు. మొదటి భార్య అచ్చమ్మ అనారోగ్యంతో ఇంట్లోనే ఉంటుండగా రెండో భార్య అంజమ్మ గ్రామంలో రేషన్ దుకాణం నడుపుతోంది. అలాగే అచ్చమ్మ కుమారుడు హరీశ్ గ్రామంలో పురుగుమందుల దుకాణం నడుపుతున్నాడు. కుమార్తె అంజలి వివాహం జరిగింది. రెండో భార్య అంజమ్మ కుమార్తె మౌనిక గుంటూరులో సీపీఏ మొదటి సంవత్సరం చదువుతోంది. ఫస్టియర్ పరీక్షలు ముగిసిన అనంతరం గ్రామానికి వచ్చింది. సెకండియర్‌లో చేరేందుకు గురువారం గుంటూరు వెళ్లాలనుకుంది. కాగా మారుతల్లి, ఆమె కూతురుకు దక్కాల్సిన ఆస్తిపై హరీశ్ కన్నేశాడు. ఈ క్రమంలో సవతి తల్లి అంజమ్మ, ఆమె కూతురు మౌనిక నిద్రిస్తున్న సమయంలో హరీశ్ వారి తలపై రోకలిబండతో మోదాడు. సంఘటనా స్థలంలోనే మౌనిక మృతిచెందగా, తీవ్ర గాయాలపాలైన అంజమ్మను స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతిచెందింది. హత్య అనంతరం నిందితుడు హరీశ్ సూర్యాపేట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. హత్య విషయం తెలుసుకున్న సూర్యాపేట డీఎస్పీ నాగేశ్వరరావు, ఇన్‌చార్జ్ రూరల్ సీఐ శ్రీనివాస్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాలను ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలు అంజమ్మ సోదరుడు చామకూరి వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

# చికిత్స పొందుతూ ట్రిపుల్ ఐటీ విద్యార్థి మృతి



**జక్రాన్‌పల్లి(నిజామాబాద్‌రూరల్):** నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం కొలిప్యాక్ గ్రామానికి చెందిన బోండ్ల సంజయ్ అనే ట్రిపుల్ ఐటీ విద్యార్థి గురువారం హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సంజయ్ నిర్మల్ జిల్లాలోని బాసర ట్రిపుల్ ఐటీ కళాశాలలో బుధవారం భవనంపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. కళాశాలలో సంజయ్ మరో విద్యార్థి సాయిచరణ్‌లు ఘర్షణ పడ్డారు. ఈ విషయంలో సాయిచరణ్, సంజయ్‌పై కళాశాల అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అధికారులు వీరిని ప్రత్యేక గదిలో ఉంచారు. బుధవారం ఉదయం సంజయ్‌ను విచారించే సమయంలో మరుగుదొడ్డికి వెళ్లి వస్తానని చెప్పి నాలుగంతస్తుల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన తోటి విద్యార్థులు, సిబ్బంది చికిత్స కోసం తొలుత నిజామాబాద్‌లోని ప్రగతి ఆస్పతికి తరలించారు. తర్వాత సంజయ్ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కాగా గురువారం మధ్యాహ్నం సంజయ్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

**విషాదంలో కుటుంబం**

కొలిప్యాక్ గ్రామానికి చెందిన బోండ్ల శ్రీనివాస్, సత్తెమ్మల కుమారుడు సంజయ్. నిర్మల్‌లోని బాసర ట్రిపుల్ ఐటీ కళాశాలలో సీఈసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. వీరికి ఇద్దరు కూతుళ్లు కూడా ఉన్నారు. శ్రీనివాస్ గీత కార్మికుడిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తల్లి సత్తెమ్మ బీడీలు చుడుతుంది. సంజయ్‌ను ఎలాగైనా బాగా చదివించాలని ఆశించారు. అనుకోకుండా సంజయ్ ఆత్మహత్యకు పాల్పడడం కుటుంబంలో విషాదాన్ని నింపింది. సంజయ్ అందరితో స్నేహపూర్వకంగా ఉండేవాడని స్నేహితులు గుర్తు చేసుకుంటున్నారు.


గురువారం రాత్రి సమ్మక్క రాక సందర్భంగా స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్న భక్తజనం


ఎదుర్కోళ్లు ఎగుర వేస్తున్న భక్తులు


గౌరవ సూచకంగా గాలిలోకి కాల్పులు జరుపుతున్న ఎస్పీ సంగ్రాం సింగ్ జీ పాటిల్

# మెగా సిటీగా మేడారం

**వరంగల్:** దట్టమైన అటవీ ప్రాంతంలోని మేడారం.. జాతర జరిగే సమయంలో మెగా సిటీగా రూపుదిద్దుకుంటోంది. సాధారణ పల్లె ప్రతీ రెండేళ్లకు ఒకసారి వారం పాటు తన స్వరూపాన్ని గుర్తు పట్టలేనంతగా మార్చుకుంటుంది. ఎంతంటే ఐదు లక్షల కుటుంబాలు.. కోటి మందికి పైగా జనాభా జాతరకు చేరుకుంటారు. పొద్దుగూకగానే బందయ్యే షాపులు ఉన్న గ్రామంలో రాత్రింబవళ్లు తేడా లేకుండా సందడి నెలకొంటోంది. రంగుల రాట్నాలు, సర్కస్ ఫీట్లు, కొబ్బరి, బెల్లం అమ్మకాలు సాగిపోతుంటాయి. ఎల్‌ఈడీ విద్యుత్ దీపాలు, హైమాస్ట్ లైట్ల కాంతులు, కెమెరా ఫ్లాష్‌ల వెలుగులతో మేడారం పోటీ పడుతోంది. ఓ వైపు నిరంతరాయంగా కోళ్లు, మేకల తలలు తెగి పడుతుంటే.. పొయ్యి మీద వంటల ఘుమఘుమలు గుప్పుమంటాయి. జల్సా చేయాలనుకునే వారికి చీప్ లిక్కర్ నుంచి ఫారిన్ స్కాచ్ వరకు అన్ని అందుబాటులో ఉంటాయి. జాతర రణగొణ ధ్వనులకు తలనొప్పిగా అనిపిస్తే రిలీఫ్ ఇచ్చేందుకు ఎక్స్‌ప్రెస్ కాఫీ, టీ షాపులు సిద్ధంగా ఉంటాయి. ఇక రింగాటలు, హెలికాప్టర్లు, ట్రైన్లు అబ్బో.. ఒక్కటేమిటీ మహా నగరంలో ఉండే అన్ని సౌకర్యాలు కొలువుదీరుతాయి.

### వారి రాక ఓ సాహసం

మేడారం జాతరకు మన రాష్ట్రం నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌ల నుంచి ఆదివాసీలు, గిరిజనులు వస్తారు. పొరుగు రాష్ట్రాల నుంచి మేడారం జాతరకు వచ్చే భక్తులకు ప్రధాన అడ్డంకి గోదావరి నది. మహారాష్ట్ర నుంచి వచ్చే భక్తులు సిరోంచ తర్వాత ఛత్తీస్‌గఢ్‌తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు ఏటూరునాగారం, కాళేశ్వరం వద్ద నిర్మించిన హైలెవల్ వంతెనల మీదుగా మేడారం చేరుకుంటారు. ఎక్కువ మంది తమ పాత సంప్రదాయం ప్రకారం ఎడ్లబండ్లపై వచ్చేందుకు ఆసక్తి చూపిస్తారు. తాళ్లగూడెం రేవు నుంచి కొండాయి, మల్యాల మీదుగా దట్టమైన వన్యప్రాణుల అభయారణ్యం గుండా కాలినడకన, ఎడ్లబండ్లపై ప్రయాణించి ఊరట్టం చేరుకుంటారు. ఇక్కడి స్థానిక గిరిజనులను పేర్లు పెట్టి పిలిచేంతంగా చనువు ఛత్తీస్‌గఢ్ ఆదివాసీలకు ఉంది.

### యూనివర్సిటీలో పరిశోధనలు

సమ్మక్క–సారలమ్మ జాతరపై జరిగిన పరిశోధనలను పరిశీలిస్తే ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. 1975లోనే వరంగల్‌లో కేయూ ప్రారంభం కాగా.. 1980వ దశకంలో వర్సిటీలో చరిత్ర విభాగం తన పరిశోధనలు ప్రారంభించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు సమ్మక్క–సారలమ్మలతో పాటు కాకతీయులపై చెప్పుకోతగిన పరిశోధనలు జరగలేదు. 2006లో దివిటి అంజనీదేవి సమ్మక్క–సారలమ్మ జాతరపై పరిశోధనలు చేసి ఓ పుస్తకాన్ని వెలుగులోకి తీసుకురాగా, అంతకు ముందు రాజ్‌మహ్మద్ ఉస్మానియా వర్సిటీ ద్వారా పరిశోధనలు చేశారు. ఇటీవల పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీకి అనుబంధంగా ఉన్న గిరిజన విజ్ఞాన పీఠం ద్వారా కొన్ని పుస్తకాలు ప్రచురితమయ్యాయి.

**చిన్నప్పటి నుంచే ఇదే సంబురం: సీతక్క**

మేడారం జాతర అంటే చిన్నప్పటి నుంచి ఇప్పటి వరకు అదే సంబురం. మిగిలిన ప్రజలకు అది నాలుగు రోజుల జాతరే కావచ్చు. కానీ ఆదివాసీలుగా మాకు ఎంత లేదన్నా నెల రోజుల పండుగ. మా సొంతూరు ములుగు మండలంలోని జగ్గన్నపేట. అప్పుడు ఎడ్లబండ్లు లేదా కాలినడకన జాతరకు వెళ్లేవాళ్లం. జంతువుల భయంతో గుంపులు గుంపులుగా వెళ్లే వాళ్లం. నిజంగా ఇరవై ముప్పై ఏళ్లలోనే ఊహించనంత మార్పు వచ్చింది. దీనికి తోడు జాతరలో పరాయీకరణ పెరిగిపోతుంది. కంకవనాల పందిళ్లు పోయి టార్పాలిన్లు, టెంట్లు వచ్చినై. పచ్చదనం కనుమరుగవుతోంది.

## జాయ్‌రైడ్‌తో హోరెత్తిన గద్దెల ప్రాంగణం

**చీప్ నుంచి ఫారిన్ లిక్కర్ వరకు లభ్యం • విడిదికి కాటేజీలు, హట్స్**


మేడారంలో రాత్రి వేళ కూడా తిరుగుతున్న జాయింట్ వీల్



## వారం రోజులు మహానగరమే

జాతర జరిగే నాలుగు రోజుల్లో ఆర్టీసీ సంస్థ 4 వేలకు పైగా బస్సులను నడిపిస్తోంది. హైదరాబాద్ నుంచి హెలిక్యాప్టర్ సర్వీసులు సైతం భక్తులకు అందుబాటులోకి వచ్చాయి. ఇంతకు నాలుగు రెట్ల సంఖ్యలో ప్రైవేటు వాహనాల్లో భక్తులు మేడారం చేరుకుంటారు. పర్యాటక శాఖ హరిత కాకతీయ హోటళ్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. భక్తుల కోసం ప్రత్యేకంగా హట్స్ ఏర్పాటు చేశారు. వైద్య సాయం అందించేందుకు వేలాది మందితో వైద్య బృందం 24 గంటలు సేవలు అందిస్తోంది.


శిశువుతో శివాణి

## జాతరలో జంపన్న పుట్టిండు!

**భూపాలపల్లి అర్బన్ :** మేడారం మహాజాతరకు వచ్చిన భక్తురాలు మగబిడ్డకు జన్మనిచ్చింది. ఇక్కడ ఏర్పాటు చేసిన 50 ఆస్పత్రిలో వైద్యులు గురువారం ఆమెకు సాధారణ ప్రసవం చేయడంతో పాటు కేసీఆర్ కిట్ అందజేశారు. పుణేకు చెందిన చావని శివాణి కుటుంబ సభ్యులతో కలసి రెండు రోజుల క్రితం జాతరకు వచ్చింది. గురువారం పురుటి నొప్పులు రావడంతో 108 వాహనం ద్వారా ఆస్పత్రికి తీసుకెళ్లగా.. వైద్యులు ప్రసవం చేయడంతో శివాణి మగబిడ్డకు జన్మనిచ్చింది. దీంతో జంపన్నే తమకు పుట్టాడని శివాణి దంపతులు ఆనందం వ్యక్తం చేశారు.


మొక్కుబడులతో నిండిన హుండీలు

## హుండీలు గలగల!

**ఎస్‌ఎస్‌తాడ్వాయి:** మేడారం శ్రీ సమ్మక్క–సారలమ్మ జాతర సందర్భంగా గద్దెల వద్ద 429 హుండీలను ఏర్పాటు చేశారు. జాతరలో రోజుకు సుమారు 40 నుంచి 50 హుండీలు నిండుతున్నాయి. ఇప్పటి వరకు 212 హుండీలు నిండినట్లు దేవాదాయ శాఖ అధికారులు గురువారం తెలిపారు.



## బస్సుల సందడి

**భూపాలపల్లి:** మేడారం మహాజాతర సందర్భంగా సమ్మక్క తల్లి గద్దెను చేరడంతో భక్తులు దర్శించుకుని తిరుగుముఖం పడుతున్నారు. ఈ మేరకు గురువారం రాత్రి వరకు మేడారంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో వందలాది బస్సులు అధికారులు అందుబాటులో ఉంచారు. బస్టాండ్‌లో నిలిపి ఉంచిన వివిధ డిపోల బస్సులను పైనుంచి ఇలా అగ్గిపెట్టెల్లా దర్శనమిచ్చాయి.

## ప్రముఖుల తాకిడి


సమ్మక్క గద్దెను మొక్కుతున్న మంత్రులు సత్యవతి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే సీతక్క

**సాక్షి, భూపాలపల్లి:** ములుగు జిల్లా మేడారం మహాజాతరకు ప్రముఖుల తాకిడి పెరిగింది. మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఈటల రాజేందర్, అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, సత్యవతి రాథోడ్ గురువారం శ్రీ సమ్మక్క–సారలమ్మలను దర్శించుకున్నారు. వీరితో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్, ములుగు ఎమ్మెల్యే సీతక్క, ఎంపీ కవిత సైతం మొక్కులు చెల్లించారు. తల్లులకు తలసాని తులాభారం ద్వారా మొక్కు చెల్లించుకున్నారు. ఇంద్రకరణ్ రెడ్డి అమ్మవార్లకు పూలు, పండ్లు, పట్టు వస్త్రాలను సమర్పించారు. ఇంకా కాళోజీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ బి.కరుణాకర్‌రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టియానా జెడ్ చోంగ్తూ కూడా వరాల తల్లులను దర్శించుకున్నారు.

**దర్శనానికి 2 గంటలు**

సారలమ్మ, సమ్మక్క గద్దెలపైకి రావడంతో భక్తుల రద్దీ పెరిగింది. గురువారం ఒకేరోజు 35 లక్షల మంది అమ్మవార్లను దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు. దీంతో క్యూలైన్లు కిక్కిరిసిపోగా.. దర్శనానికి రెండు గంటలకు పైగా సమయం పడుతోంది. ప్రైవేట్ వాహనాల్లో వచ్చే భక్తుల్ని దాదాపు 10 కిలో మీటర్ల దూరంలోని పార్కింగ్ స్థలాల్లోనే నిలిపివేయడంతో కాలినడకన గద్దెలకు చేరుకుంటున్నారు.


అమ్మవార్లకు పూలు, పండ్లు సమర్పిస్తున్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, చిత్రంలో తలసాని

## మేడారం.. అలనాటి జ్ఞాపకం!

మేడారం జాతర.. వనదేవతలైన సమ్మక్క – సారలమ్మకు నెలవు. జాతర ఎన్ని వందల ఏళ్ల నుంచి జరుగుతుందనే విషయానికి శాస్త్రీయ ఆధారాలు లేకపోయినా ప్రతీ జాతరకు వస్తున్న భక్తుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఈ సారి కోటి మందికి పైగా భక్తులు వస్తారనేది అధికారిక అంచనా. ఇప్పుడంటే రవాణా, వసతి ఇతరత్రా అన్ని సౌకర్యాలు ఉన్నాయి. కానీ కొన్నేళ్ల క్రితం ఎలాంటి సౌకర్యాలు లేని రోజుల్లో సైతం భక్తులు ఎడ్లబండ్లు, కాలినడకన జాతరకు వచ్చి తల్లులను దర్శించుకునే వారు. ఈ మేరకు 1980, అంతకు ముందు మేడారం జాతరల్లో తీసిన ఫొటోలు కొన్ని ‘సాక్షి’పాఠకులకు ప్రత్యేకం..

*అలువాల సదాశివుడు, వరంగల్*


భక్తులను చేరవేసేందుకు ఏర్పాటు చేసిన మినీ బస్సు


అప్పట్లో చిలకలగుట్ట


సమ్మక్కను తీసుకొస్తున్న పూజారులు


క్యూ లైన్లలో భక్తులు


ఎలాంటి ఫెన్సింగ్ లేని సమ్మక్క గద్దె

epaper.sakshi.com

సాక్షి
శుక్రవారం, ఫిబ్రవరి, 7

# సరోగసీకి ఇంకా సమస్యలే

ఎట్టకేలకు సరోగసీ(అద్దె గర్భం) బిల్లుపై సెలెక్ట్ కమిటీ సిఫార్సులు పెద్దల సభ ముందుకొచ్చాయి. బిల్లుకు ఏర్పడిన అవరోధాలు తొలగి అది పార్లమెంటు ఆమోదం పొందాలని సంతాన లేమితో బాధపడుతూ, సరోగసీ కోసం ఎన్నో జంటలు ఆశగా ఎదురుచూస్తున్నాయి. ఎప్పుడో 2008లో బిల్లు పని ప్రారంభం కాగా, చట్టాల రూపకల్పనలో రివాజుగా సాగే జాప్యాన్ని దాటడానికి ఇంతకాలం పట్టింది. దీనిపై ఇంకా సభలో చర్చ జరగాల్సివుంది. బిల్లును అధ్యయనం చేసిన సెలెక్ట్ కమిటీ 15 సూచనలు చేసింది. ఇందులో అద్దె గర్భానికి అంగీకరించే మహిళ, దంపతులకు సమీప బంధువై ఉండాలన్న నిబంధన తొలగించమని చేసిన సూచన కూడా ఉంది. అలాగే మరో కీలకమైన సూచన కూడా చేసింది. వివాహమైన దగ్గర నుంచి అయిదేళ్లపాటు ఎదురుచూశాకే అద్దె గర్భం ప్రత్యామ్నాయాన్ని దంపతులు ఎంచుకోవాలన్న నిబంధన కూడా సరికాదని కమిటీ అభిప్రాయపడింది. సంతానం అవసరమని భావించే దంపతులు సంతానలేమి ధ్రువీకరణ పత్రాన్ని అందజేయాలన్న నిబంధనను కమిటీ వ్యతిరేకించింది. దీనికి బదులు వైద్యపరంగా వారిని అద్దె గర్భం ద్వారా 'సంతానం కోరుకునే జంట'గా పరిగణిస్తే సరిపోతుందని తెలిపింది. 'సంతానం కోరుకునే జంట' గా ఎవరిని పరిగణించాలన్న విషయమై బిల్లులోని నిబంధనను మార్చాలని కమిటీ సూచించింది. వివాహమైన జంట మాత్రమే సరోగసీకి అర్హులన్న నిబంధన బదులు 35 నుంచి 45 ఏళ్ల మధ్య వయసుగల మహిళలు వారు విడాకులు తీసుకున్నవారైనా, భర్తను కోల్పోయినవారైనా ఎంచుకునేలా మార్పు చేయాలని సూచించింది. అయితే ఒంటరి పురుషులు, ఒంటరి మహిళలు, సహజీవనం చేస్తున్న జంటలు, స్వలింగసంపర్కులకు బిల్లులో ఉన్న అనర్హత కొనసాగాలని పేర్కొంది. ఈ కేటగిరీలోని వారికి ఇప్పటికే దత్తత చట్టాల ప్రకారం ఎవరినైనా దత్తత తీసుకునే అవకాశం ఉంది. అటువంటప్పుడు సరోగసీలో బిడ్డను పొందే హక్కును వారికి నిరాకరించడంలో హేతుబద్ధత కనబడదు.

సరోగసీ సాంకేతికత మొదలయ్యాక మన దేశంలో అది విస్తృతంగా వ్యాప్తిలోకి వచ్చింది. 2000 సంవత్సరంనాటికి మన దేశాన్ని అందరూ 'క్రాడిల్ ఆఫ్ ద వరల్డ్'(ప్రపంచ ఊయల) అనేవిధంగా అది వ్యాపించింది. పేదరికం ఉన్నచోట ఏమైనా చేయొచ్చునన్న అభిప్రాయం సంపన్నుల్లో ఉండటం దీనికి కారణం. ఈ అంశాన్ని మొదట ప్రభుత్వం గుర్తించలేదు. మహిళా ఉద్యమకారులు, ఆరోగ్య రంగ కార్యకర్తలు గమనించి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. అయినా మరో ఎనిమిదేళ్లకుగానీ బిల్లు రూపొందించే ప్రక్రియ మొదలుకాలేదు. ఆ తర్వాతైనా ఆ పని చకచకా పూర్తికాలేదు. చివరకు బిల్లు తయారైనా అది కేంద్ర మంత్రివర్గం ముందుకు కూడా పోలేదు. ఈలోగా యూపీఏ పాలన ముగిసి, ఎన్‌డీఏ అధికారంలోకొచ్చింది. అనంతరం 2016లో కేంద్ర మంత్రివర్గం ముందుకు ఈ బిల్లు వచ్చింది. ఆరోగ్య మంత్రిత్వ శాఖకు అనుబంధంగా ఉండే పార్లమెంటరీ స్థాయీ సంఘం కూడా ఈ బిల్లును అధ్యయనం చేసి అనేక సవరణలు సూచించింది. ఆ సవరణల్లో చాలావాటిని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదన్న విమర్శలు వస్తున్న తరుణంలోనే అది లోక్‌సభ ముందు కెళ్లింది. తీవ్ర గందరగోళం మధ్య పెద్దగా చర్చ లేకుండానే ఆమోదం పొందింది. బిల్లు సమగ్రంగా లేదని, సరోగసీకి ఇందులో ఎన్నో పరిమితులు విధించారని రాజ్యసభలో విమర్శలు వచ్చిన నేపథ్యంలో దీన్ని సెలెక్ట్ కమిటీకి పంపాలని నిర్ణయించారు. రెండేళ్ల అనంతరం ఇప్పుడు ఆ కమిటీ సిఫార్సులు రాజ్యసభ ముందుకొచ్చాయి. బిల్లు త్వరగా చట్టంగా మారితే నిరుపేద అమాయక మహిళలకు ఇప్పుడెదురవుతున్న అనేకానేక సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. అయితే ఈ క్రమంలో అసలు సరోగసీ కోరుకునే జంటలకు చట్టం సమస్యాత్మకంగా మారకూడదు.

ఈ బిల్లుపై మొదటినుంచీ మహిళా సంఘాలనుంచీ, ఆరోగ్యరంగ కార్యకర్తల నుంచి ఎదురవుతున్న మౌలిక అభ్యంతరాల గురించి సెలెక్ట్ కమిటీ సరిగా పట్టించుకోలేదనే చెప్పాలి. ఉదాహరణకు సరోగసీ అనేది 'నిస్వార్థమైనది'గా ఉండాలని బిల్లు నిర్దేశిస్తోంది. బిడ్డను కని ఇచ్చే మహిళకు అవసరమైన వైద్య ఖర్చులకూ, బీమా సౌకర్యం కల్పించడానికి సొమ్ము ఇవ్వాలి తప్ప ఇతరత్రా డబ్బిస్తే అది వాణిజ్యపరమైన సరోగసీ అవుతుందని బిల్లు చెబుతోంది. నిజానికి అన్యులైతే చట్టవిరుద్ధంగా డబ్బు ప్రమేయంతో సరోగసీ సాగుతుందని అనుమానించి, సన్నిహిత బంధువులైన మహిళలు మాత్రమే సరోగసీకి అర్హులని బిల్లులో నిబంధన పెట్టారు. సెలెక్ట్ కమిటీ దీన్ని తొలగించాలని సూచించడం మంచిదే అయినా... ఎవరికోసమో బిడ్డను కని ఇవ్వడానికి ఒప్పుకుని, అందుకోసం తొమ్మిదినెలలపాటు ఎన్నో సమస్యలు ఎదుర్కొనడానికి సిద్ధపడే మహిళ ఆ పని నిస్వార్థంగా చేయాలన్న నిబంధన సరికాదు. దీన్ని కూడా కమిటీ వ్యతిరేకించి ఉంటే బాగుండేది. భారత్‌లో సంతానం లేని జంటల కోసం ఎంతో పెద్ద మనసుతో, త్యాగబుద్ధితో సరోగసీకి సిద్ధపడే మహిళలుంటారన్న భుజకీర్తులకు మాత్రమే ఇది ఉపయోగపడుతుంది. డబ్బు లావాదేవీలు మాత్రం చట్టం కన్నుగప్పి సాగుతూనే ఉంటాయి. ఇందులో ఉండే సమస్యేమంటే... తొలుత అంతా మాట్లాడుకుని, ఆ తర్వాత మహిళకు సొమ్ము ఎగ్గొట్టిన పక్షంలో ఆ నిస్సహాయురాలికి చట్టం అండదండలుండవు. పైగా ఫిర్యాదు చేస్తే ఆమె కూడా చట్టప్రకారం నిందితురాలవుతుంది. కనుక మౌనంగా ఉండిపోవాల్సివస్తుంది. అయితే సరోగసీకి సిద్ధపడే మహిళకు వైద్య ఖర్చులు, బీమా సౌకర్యంతోపాటు పౌష్టికాహార అవసరాలు, గర్భిణిగా ధరించాల్సినవి సమకూర్చుకోవడానికయ్యే ఖర్చుల్ని కూడా ఇవ్వాలన్న నిబంధన కూడా పెట్టాలని కమిటీ సూచించింది. బీమా సౌకర్యం ఇప్పుడున్న 16 నెలలనుంచి, 36 నెలలకు పొడిగించాలన్నది. ఏదేమైనా సరోగసీ బిల్లు రూపకల్పనలో మహిళా కార్యకర్తలు, ఆరోగ్య రంగ కార్యకర్తల అభిప్రాయాలకు చోటిచ్చివుంటే బాగుండేది.

### గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, తిథి శు.త్రయోదశి సా.4.38 వరకు, తదుపరి చతుర్దశి, నక్షత్రం పునర్వసు రా.10.46 వరకు, తదుపరి పుష్యమి వర్జ్యం ఉ.10.55 నుంచి 12.30 వరకు, దుర్ముహూర్తం ఉ.8.51 నుంచి 9.34 వరకు, తదుపరి ప.12.35 నుంచి 1.21 వరకు అమృతఘడియలు... రా.8.23 నుంచి 9.54 వరకు.

సూర్యోదయం : 6.34
సూర్యాస్తమయం: 5.54
రాహుకాలం : ఉ.10.30 నుంచి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుంచి 4.30 వరకు

# ప్రాణం నిలిపే పోషణ ఏది?


దిలీప్ రెడ్డి

'మీ మిత్రులెవరో చెప్పండి, మీరేంటో నే చెబుతాన'ని ప్రఖ్యాత రచయిత బెర్నార్డ్ షా అన్నారని ప్రతీతి. 'మీరేం తింటున్నారో చెప్పండి, మీ ఆరోగ్య భవితవ్యం మేం చెబుతాం' అంటున్నారిప్పుడు పౌష్టికాహార నిపుణులు. మన తిండి మన ఆరోగ్యాన్ని, భవిష్యత్తును నిర్ధారిస్తుంది. దేశ సౌభాగ్యాన్ని కూడా తేలుస్తుంది. నూరేళ్ల కింద, '... తిండి కలిగితె కండ కలదోయ్, కండ కలవాడె మనిషోయ్!' అన్న మహాకవి గురజాడ కూడా ఈ రోజున ఉండుంటే, తిండి అన్న మాటను 'సరైన తిండి' అని సవరించి ఉండేవాడే! 'ఆరోగ్యమే మహాభాగ్యం' అన్న సామెతను మరింత విస్తృత పరచి చూస్తే, ఒక దేశంలో తిండి, ఆహార పద్ధతులు, పరిస్థితులు ఆ దేశ సౌభాగ్యాన్ని నిర్ణయిస్తాయనొచ్చేమో! ఆయా దేశాల్లో నెలకొన్న ఆరోగ్యపరిస్థితులను వారి ఆహార స్థితిగతులతో పోల్చి పరిశీలించినపుడు అదే నిజమనిపిస్తుంది. భారతదేశ ప్రజల ఆరోగ్య–అనారోగ్య స్థితుగతుల్ని కాస్త లోతుగా విశ్లేషించినపుడు ఇక్కడి ఆహార సంపద, పౌష్టికాహార లభ్యత, అవకాశాల్లో అసమానత, తిండి అలవాట్లు... తీవ్రమైన ప్రభావకాలే అని స్పష్టమౌతోంది. అందుకే ఈ అంశాల పట్ల దేశప్రజల్లో నెమ్మదిగా స్పృహ పెరుగుతోంది. ప్రభుత్వాలూ ప్రత్యేక కార్యక్రమాలతో శ్రద్ధ పెంచుతున్నాయి. మూడేళ్లుగా దేశంలో అమలు పరుస్తున్న 'పోషణ్ అభియాన్' అటువంటిదే! తాజాగా నిన్నటి కేంద్ర బడ్జెట్లో ఈ అభియాన్ కింద ప్రత్యక్షంగా రూ.3700 కోట్లు కేటాయిస్తే, పౌష్టికాహార సమృద్ధి కోసం పరోక్షంగా వివిధ శాఖల ద్వారా రూ.35,600 కోట్లు వ్యయం చేయనున్నట్టు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన ప్రసంగంలో చెప్పారు.

ఇప్పుడు చైనాలో అల్లకల్లోలం సృష్టించి ప్రపంచాన్ని గడగడ వణికిస్తున్న కరోనా వైరస్, వారి విపరీత ఆహారపు అలవాట్ల వల్లే వచ్చిందన్న అభిప్రాయం విశ్వమంతా వినిపిస్తోంది. ఈ వైరస్ ఒక రకపు గబ్బిలాలు, పాముల్లోనూ ఉన్నందున, అవే ద్వితీయ వాహకాలుగా వైరస్ జనానికి వ్యాపించిందేమోనని సదరు అనుమాన మున్నమాట నిజమే అని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్లుహెచ్‌వో) అంగీకరించింది. కానీ, ఆహారపు అలవాట్లవల్లే వ్యాధి ఖచ్చితంగా వచ్చి ప్రబలుతోందని నిర్ధారించే ఆధారాలేమీ లేవని కూడా స్పష్టం చేసింది. ఆహారం, తిండి అలవాట్లు ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయన్న దాంట్లో ఎవరికీ సందేహం లేదు.

తిండి విషయంలో అతిచిన్న అంశాల్లోనూ సరైన అవగాహన దేశ ప్రజల్లో లేకపోవడం దురదృష్టకరం! పౌష్టికా హార లోపం దేశ ప్రజల ఆరోగ్యస్థితికే కాకుండా భవిష్యత్తరాలకు కూడా ఓ పెనుసవాల్ విసురుతోంది. ఈ లోపం వల్ల బాల్యం బలిపశువుగా మారింది. తల్లులు అనారోగ్యంతో తల్లడిల్లుతున్నారు. దేశంలో రికార్డుస్థాయి మాతా–శిశు మరణాలకు పౌష్టికాహార లోపమే ప్రధాన కారణం. 'ఇది న్యూట్రీషన్ బడ్జెట్' అని కేంద్ర ప్రభుత్వం జబ్బలు చరుస్తున్నా... అతి సాధారణ విషయాల పట్లా సగటు పౌరుల్లో గూడుకట్టుకున్న అవగాహనా లేమి పాలకులను, ప్రణాళికా నిపుణుల్ని ఇంకా వెక్కిరిస్తూనే ఉంది.

### అసమానతలు తగ్గి, అవకాశాలు పెరగాలి

మేటి పారిశ్రామికవేత్త రతన్ టాటా ఓ ఆంగ్ల దినపత్రికలో బుధవారం ఒక వ్యాసం రాశారు. దేశంలో ఈ దశాబ్ది (2020–30) అన్ని లోపాలను అధిగమించేదిగా నిలవాలని, అందుకే దేశాన్ని పౌష్టికాహార సమృద్ధంగా తీర్చిదిద్దితేనే అది సాధ్యమని అభిప్రాయపడ్డారు. అంతరాలు తగ్గాలని, ముఖ్యంగా సమాజపు వివిధ స్థాయి పౌరుల మధ్య ఆహారపు అవకాశాల అంతరం ప్రమాదకరంగా ఉందనీ ఆయన న్నారు. ఫలితంగా లక్షలాది శిశువుల్ని కోల్పోవడం, గర్భిణుల్ని పోగొట్టుకోవడం, తల్లులు ఆరోగ్యవంతమైన పిల్లల్ని కనలేని దుస్థితి బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తినాల్సిన ఆహారం తగినంత తినకపోవడం, మోతాదుకు మించి తినడం, ఒంటికి సరిపడని ఆహారం తినడం. అసలేమీ తినకపోవడం... వీటివల్లే పౌష్టికాహార లోపమని చెబుతారు. మన దేశంలో దాదాపు 20 కోట్ల మంది ఈ

సమకాలీనం



దుస్థితిలో ఉన్నారు. ఇది ప్రపంచంలోని పౌష్టికాహార లోప జనాభాలో మూడో వంతు! ఈ కారణంగానే ఏటా 25 లక్షల మంది అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో చూసినపుడు తక్కువ బరువు, తక్కువ ఎత్తు, తక్కువ స్వస్థత, తక్కువ మెదడు వికాసంతో పుట్టే పిల్లల సంఖ్య దేశంలో పెద్ద మొత్తంలో ఉంటోంది. ఈ రకం పిల్లల్లోనే అత్యధికులకు అయిదేళ్లలోపు ఆయువు తీరుతోంది. అయిదేళ్ల తర్వాత కూడా సరైన పౌష్టికాహారం లభించక జరిగే బాల్య మరణాలెన్నో! దేశం యువ భారత్ అని మనం గంభీరంగా చెప్పుకుంటున్నా... దేశంలో బాలల సంఖ్య ఏయేటి కాయేడు తగ్గిపోతోంది.

దేశంలో 6–15 సంవత్సరాల మధ్య వయస్కుల్నే (ప్రాథమిక–ఉన్నత విద్యా స్థాయి) తీసుకుంటే, ఈ సంఖ్య ఏటా తగ్గిపోతున్నట్టు విద్యా శాఖ గణాంకాల్లో ఉంది. మొత్తం జనాభాలో 14 ఏళ్లలోపు వయస్కుల సంఖ్య 29.5 శాతం ఉన్నట్టు 2011 జనాభా లెక్కలు చెబుతున్నాయి. కానీ, ఇదే వయస్కులు 1971లో, నాటి మొత్తం జనాభాలో 41.2 శాతంగా ఉన్నారు. అప్పట్నుంచి ప్రతి పదేళ్ల జన గణనలోనూ ఇది తగ్గుతూ వస్తోంది. వృద్ధి రేటును నియంత్రించి జనాభా కట్టడిలో మనం సాధించిన సత్ఫలితాల వల్ల ఇలా జరిగి ఉండొచ్చు! పుట్టకపోతే అదో పద్ధతి. కానీ, పుట్టి నేలపైకి వచ్చిన అరుదైన, అపురూపమైన మానవవనరుల్ని పౌష్టికాహారం అందించలేక కోల్పోవడం కన్నా దురదృష్టకర పరిస్థితి ఇంకోటుండదు.

### చిత్తశుద్ధితోనే అవగాహన వృద్ధి

ఆహారం సరిపోని పరిస్థితి వేరు! కానీ, ఏ ఆహారం ఏ పాళ్లలో తినాలో తెలియక ప్రాణాలమీదకు తెచ్చుకోవడం ఆందోళన చెందాల్సిన అంశం. పిల్లలు, తల్లుల్లోనే కాకుండా అన్ని వయస్కుల్లోనూ నేటి అనారోగ్య పరిస్థితులకు ప్రధాన కారణం పౌష్టికాహార లోపమే! తిండి, అందులో ఉండాల్సిన పోషక విలువలు, వాటి సమతుల్యతపై కనీస అవగాహన లోపించడం వల్లే ప్రమాద పరిస్థితులు. అందుకే, 'కరోనా' ఉపద్రవ నేపథ్యంలో డబ్లుహెచ్‌వో ఓ హెచ్చరిక చేస్తోంది. సరైన ఆహారం, ముందు జాగ్రత్తలకు కొన్ని వందల కోట్ల రూపాయలు వెచ్చిస్తే సరిపోయే దానికి, నిర్లక్ష్యం చేసి తర్వాత వైద్యారోగ్యం కోసం వేల, లక్షల కోట్లు వ్యయం చేయాల్సిన పరిస్థితి తెచ్చుకోకండి అన్నది ఆ హెచ్చరిక సారాంశం. ఏ వైద్య పరీక్షలు చేయకుండానే ఈ దేశంలో ప్రతి ముగ్గురు మహిళల్లో ఇద్దరికి రక్త హీనత ఉందని చెప్పొచ్చు. ఏ ప్రమాణాలతో లెక్కించినా మహిళల్లో 65 శాతానికి తగ్గకుండా రక్తహీనత (సాధారణ, మధ్య, తీవ్ర స్థాయి)తో బాధపడుతున్నట్టు వైద్య గణాంకాలు చెబుతాయి.

రోజుకు ఒక మైక్రోగ్రామ్ ఇనుము (అంటే 50 గ్రాములకు తగ్గకుండా ఏ ఆకు/కాయ కూరలో) తీసు కుంటే జీవితంలో రక్తహీనత వచ్చే ఆస్కారమే ఉండదు. ఈ విషయాన్ని గ్రహించలేని స్థితిలో సగటు పౌరులుంటారు. ప్రజల్లో కనీస అవగాహన కలిగించే వాతావరణం లేదు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వారి ఆర్థిక పరిస్థితికి లోబడి సమృద్ధ పౌష్టికాహారాన్ని తీసుకునే వీలున్నా ప్రాధాన్యతలు తెలియవు. ఆశా, అంగన్‌వాడీ కార్య కర్తలు చేయాల్సిన ప్రధాన విధి ఇదే! కానీ, అది ఆశించిన స్థాయిలో జరగదు. సర్వత్రా అవినీతి, నిర్లక్ష్యం, నియంత్రణ లోపం తాండ విస్తుంది. తినొద్దని వైద్యులు, ఆహార నిపుణులు చెప్పే 'జంక్‌ఫుడ్' తినండని చేసే కార్పొరేట్ ప్రచారం కొన్ని కోట్ల రూపాయలతో జరుగుతుంది. సంప్రదాయ మీడియా, సోషల్ మీడియా వేదిక నుంచి కుమ్మేసే ఈ ప్రచారం ముందు మన ప్రభుత్వాలు చేసే పౌష్టికాహార ప్రచార కార్యక్రమాలు ఎల్యీడీ బల్బుల ముందు కొవ్వొత్తి దీపాల్లా వెలవెలబోతాయి.

ప్రణాళికాబద్ధ కార్యక్ర మాలతో ఈ దేశంలో 27 కోట్ల మందిని దారిద్ర్యరేఖ దిగువనుంచి పైకి తెచ్చి పేదరిక నిర్మూలన చేయడం ఘన విజయమే! పౌష్టికాహార లోపాన్ని అధిగమించే కృషి కూడా వ్యూహం, చిత్తశుద్ధితో జరగాలి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో రూ. 344 కోట్ల అదనపు నిధుల్ని కేటాయించి బడి పిల్లల మధ్యాహ్న భోజనాన్ని మరింత నాణ్యం, సమృద్ధం చేసింది. అంగన్ వాడిల ద్వారా పిల్లలు, గర్భిణిలకు పౌష్టికాహారం అందించే కార్య క్రమాన్ని మెనూ మార్చి మరింత పకడ్బందీగా నిర్వహిస్తోంది. ఆహ్వానించదగ్గ ఈ చొరవను ఇతర రాష్ట్రాలూ అందిపుచ్చుకోవాలి.

కేంద్రం, రాష్ట్రాలు పరస్పర సహకారం, అవగాహనతో బాధ్యతగా ఈ కృషి చేపట్టాలి. భారత రాజ్యాంగం నిర్దేశించిన ఆదేశిక సూత్రాల (అధికరణం 47) ప్రకారం పౌష్టికాహార ప్రమాణాలను పెంచడం ప్రభుత్వ నిహిత బాధ్యత. తద్వారా పౌరుల ఆరోగ్య రక్షణ, జీవన ప్రమాణాల వృద్ధి ప్రభుత్వాల ప్రాథమిక కర్తవ్యం. ఆరోగ్యానికి హానికరమైన ఆహార పదార్థాలు, పానీయాలు, డ్రగ్స్ వంటి వాటిని నిషేధించే అధికారం కూడా ఈ అధికరణం ద్వారా ప్రభుత్వానికి సంక్రమించింది.

### సుస్థిరాభివృద్ధి సాధనలో మూలసూత్రమిదే!

ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన 17 అంశాల సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో తొలి మూడు ఏదో రకంగా పౌష్టికాహారంతో ముడివడి ఉన్నవే! ప్రపంచంలో ఏ మూల, ఏ రూపంలో ఉన్నా పేదరికాన్ని నిర్మూలించాలి. ఎవరి పౌష్టికాహారానికి పేదరికం అవరోధం కాకూడదు. ఇక రెండో లక్ష్యం, ఆకలిని పూర్తిగా నిర్మూలించాలి. ప్రతి తొమ్మిది మందిలో ఒకరు ఆకలితోనే రాత్రి పడక ఎక్కుతున్నారు. ఇక మూడోది.. అన్ని వయసులకు చెందిన ప్రజలంతా ఆరోగ్యంగా, హాయిగా ఉండాలి. ఆరో లక్ష్యం అందరికీ రక్షిత నీరు, పదో లక్ష్యం అసమానతలు తగ్గించడం... ఇవన్నీ కూడా పౌష్టికాహార కల్పన వల్ల సాధ్యపడేవే. ప్రజలు అవగాహన పెంచుకోవడమే కాకుండా స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజం, వరుస ప్రభుత్వాలు ఈ కృషిలో మొక్కవోని దీక్షతో ముందుకు కదిలితేనే లక్ష్యం సుసాధ్యం!

ఈ–మెయిల్ : dileepreddy@sakshi.com

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



### సోషల్ మీడియా

#### రిజర్వ్



"షహీన్‌బాగ్ వెనుక భాగంలోని టెంట్‌లో కొంత భాగం పంజాబ్ నుంచి వచ్చే రైతుల కోసం రిజర్వ్ చేశారు. వాళ్లు ఇక్కడ విశ్రాంతి తీసుకుంటారు. వాళ్ల కోసం దుప్పట్లు, చాపలు కూడా సిద్ధంగా ఉన్నాయి"

– జెబావర్సీ, జర్నలిస్ట్

#### అనుమతి



"ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ముగ్గురు జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రులను ఆరు నెలలుగా నిర్బంధంలో ఉంచిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వ చర్యకు రాజ్యాంగపరమైన అనుమతి ఉందో లేదో నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత సుప్రీంకోర్టుకు ఏమాత్రం లేదంటారా?"

– సుధీంద్ర కులకర్ణి, కాలమిస్టు

#### మీడియా



"ఇవాళ న్యూస్ చానళ్లను చూడలేదని బాధపడాల్సిన పని లేదు. అధికారంలో ఉన్నవారి ఆజ్ఞలకు అనుగుణంగా పార్లమెంట్‌లో ఎన్డీఏ ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రకటనలను పదేపదే ప్రసారం చేసి ఎన్డీటీవీ రోజంతా గడిపేసింది. గోడీ మీడియా ఇప్పుడు ఏం చేయగలదో కాస్త ఊహించుకోండి"

– రూపా గులాబ్, రచయిత్రి

#### సిక్కులు



"ద్వేషించేవారు సిక్కుల నుంచి నేర్చుకోవాల్సి ఉంది. భారతదేశ విభజన సందర్భంలో తీవ్రంగా దెబ్బతిన్న సిక్కు వర్గం ఇప్పుడు ప్రేమ, కరుణ, ఐక్యత గురించి మాట్లాడుతోంది. అదే అసలైన భారతీయ స్ఫూర్తి. అకారణంగా ఒకసారి విడిపోయినవాళ్లు ఈ విచ్ఛిన్నకర శక్తులు మరోసారి తలెత్తకుండా చూడవలసిన అవసరం ఎంతైనా ఉంది"

– ఓనిర్, దర్శకుడు

#### కల్పన



"చాయ్ అమ్మానని చెప్పుకున్న వ్యక్తి ప్రధానమంత్రి కాగా లేంది, గుంజన్ కపూర్ రాజకీయ విశ్లేషకురాలు కాకూడదా?"

– సంగీత, రచయిత్రి

#### వాది



"ఔరంగజేబు కాశీవిశ్వనాథ ఆలయాన్ని ధ్వంసం చేసి జ్ఞాన్‌వపి మసీదు నిర్మించాడన్న ఆరోపణతో ఏఎస్ఐ చేపట్టిన సర్వేపై స్టే ఇవ్వాలని యూపీ సున్నీ వక్ఫ్ బోర్డు కోరింది. కానీ, కోర్టు వాళ్ల అభ్యర్థనను తిరస్కరించింది. అయితే, ఈ నెల 17న వాది తరఫున వాదనలు మాత్రం వినడానికి అంగీకరించింది"

– అన్షుల్ సక్సేనా, జర్నలిస్ట్

#### ఇంటికి



"ఉత్తరప్రదేశ్‌లో మా చుట్టూ జరుగుతున్న సంఘటనలు తలచుకుంటూ వెనక్కి వెళ్లిపోదామని మా అమ్మతో అంటే.. అల్లా వారి హృదయాన్ని మారుస్తాడు. వారి హృదయంలో మంచిని నింపుతాడు. అందుకోసం ప్రార్థన చేస్తున్నా అని చెబుతుంది. ప్రతీకారేచ్ఛ లేకపోవడమే స్వేచ్ఛ. ప్రతీకారేచ్ఛ దండిగా ఉండే ప్రభుత్వానికి మేం పూర్తి వ్యతిరేకం"

– జోయా రసూల్, జర్నలిస్ట్

# రుజువులు చూపకపోతే పౌరులు కారా?

విశ్లేషణ


మాడభూషి శ్రీధర్

ఈ దేశవాసిని అనడానికి తగిన రుజువులు చూపలేకపోతే విదేశీయులమవుతామా? సీఏఏ, ఎన్ఆర్సీ, ఎన్‌పీఆర్ సమస్య ఇది. దీన్ని హిందూముస్లిం సమస్యగా చర్చలోకి తెచ్చి, హిందూ ఓట్లను కొల్లగొడదామని అధికార పార్టీ పన్నిన వ్యూహం. ఈ దేశంలో పుట్టిన వారందరూ, వారి పిల్లలూ భారత పౌరులే అనే సార్వజనిక విశ్వజనీన నియమం ప్రకారం రాజ్యాంగం వారికి పౌరసత్వం లభిస్తుందని నిర్దేశించింది. రాజ్యాంగం, 1955 పౌరసత్వ చట్టం, దానికి చేసిన అన్ని సవరణలలో కూడా ఆ అధికారాన్ని ప్రభుత్వానికి, పార్లమెంటుకు ఇవ్వలేదు. కానీ దాన్ని చట్టంద్వారా కాకుండా, రూల్స్ ద్వారా కేంద్రం చేజిక్కించుకుని రెవెన్యూ అధికారులకు, జిల్లా కలెక్టర్లకు అప్పగించడం దారుణం.

కేంద్రానికి సహజీకరణ రిజిస్ట్రేషన్ ద్వారా కొందరు విదేశీయులకు, వలసదారులకు, శరణార్థులకు పౌరసత్వం ఇచ్చే విచక్షణాధికారం ఉంది. దాన్ని 1955 చట్టం స్పష్టంగా గుర్తించింది. ప్రపంచంలో ఏ ప్రభుత్వానికైనా బయటనుంచి వచ్చే వారి పౌరసత్వాన్ని నిర్ధారించే, నిరాకరించే అధికారం పూర్తిగా ఉంటుంది. కానీ, రాజ్యాంగాన్నే ప్రభుత్వ ఉత్తర్వు ద్వారా సవరించిన ప్రభుత్వం నియమాలు మార్చడం ద్వారా చట్టం లక్ష్యాలను అతిక్రమించే ప్రయత్నం చేస్తున్నది. ముస్లింలను మతం ప్రాతిపదికన మినహాయించడం రాజ్యాంగ వ్యతిరేకమే.

ఎన్ఆర్సీ జనపట్టిక వివరాలతో పౌరసత్వానికి ప్రమాదం వస్తుందని ఊహించలేం. ఆ ప్రమాదాన్ని చాలా జాగ్రత్తగా రూల్స్ రూపంలో ప్రవేశపెట్టారు. ఈ లంకె 2003లోనే పెట్టారు. జనపట్టిక వివరాలు సరిచూసి, దాని ప్రాతిపదికగా పౌరపట్టిక తయారవుతుందని చాలా స్పష్టంగా రూల్స్‌లో ప్రకటించి, అదేమీ లేదని, ప్రచారం చేస్తున్నారు. నిజానికి జనపట్టికలో వచ్చిన వివరాలను సరిపోల్చినపుడు అనుమానం వస్తే పౌరుడిని సందేహాస్పద పౌరుడుగా వేరు చేసి రిజిస్టర్ చేయకుండా ఆపే అధికారం కిందిస్థాయి వరకు ఇచ్చారు. అనుమానిత పౌరుడు జిల్లా మేజిస్ట్రేట్ ముందు అప్పీలు చేసుకోవాలి. అతను కూడా కింది అధికారుల నిర్ణయాన్ని ఆమోదిస్తే ఆ పౌరుడి గతి అధోగతే. ఇక్కడ కేంద్రం ఇంకో వల పన్నింది. అదేమంటే పౌరసత్వం చట్టం కింద చేసిన నియమాలలో సందేహంతో ఆపివేసి, మిగతా పరిణామాల గురించి ఫారినర్స్ ఆర్డర్ కింద రూల్స్‌లో కొత్త చేర్పులు చేసింది. దాంతో సీఏఏకు, ఎన్ఆర్సీకి కొత్త లంకె వేశారు. మామూలుగా బయటపడని ఈ లంకెను ఫారినర్స్ చట్టం 1946లో చేశారు. దీనికింద 1964లో ఫారినర్స్ ట్రిబ్యునల్ ఆర్డర్ రూపొందించారు.

అనుమానించిన ప్రతి పౌరుడిపై విదేశీయుడుగా ముద్ర పడే ప్రమాద స్థలం ఈ ట్రిబ్యునల్. దీని కారణంగా ఎన్నో దశాబ్దాలనుంచి దేశంలో ఉన్న పౌరులు మతంతో పనిలేకుండా వలసవచ్చిన వారితో సమానంగా, చొరబాటుదారులుగా లేదా శరణార్థులుగా భావింపబడే ప్రమాదానికి గురి అవుతారు. దేశంలో ఎంత మంది ప్రజల దగ్గర తాము పౌరులమని రుజువు చేసుకోగల పత్రాలు ఉన్నాయి? ఉన్నా తుఫాన్ లోనో మరో కారణం వల్లో కోల్పోతే వారి గతి ఏమిటి? వీరంతా విదేశీయులైపోతారు కదా? కనుక ఇది ముస్లింలు, సెక్యులరిస్టులు, వామపక్షాలు అనుకుంటున్నట్టు కేవలం ముస్లింల వేర్పాటు సమస్య కాదు. విదేశీ ముస్లింల సమస్య కూడా కాదు. ఇది ఈ దేశంలో పుట్టి ఈ దేశంలోనే దశాబ్దాల నుంచి ఉంటున్న ప్రతి వ్యక్తి ఎదుర్కోవలసిన గడ్డు సమస్య.

వ్యాసకర్త బెన్నెట్ యూనివర్సిటీ ప్రొఫెసర్,
కేంద్ర సమాచార మాజీ కమిషనర్
madabhushi.sridhar@gmail.com

# వినరా... నాజర్ గాథను నేడూ!

సందర్భం


పున్నా కృష్ణమూర్తి

'నేనయ్యా నాజర్‌ను, లోపలకు పోనివ్వండి' మేఘం ఉరిమినట్లుగా విన్పించింది గుంటూరు శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో 1990 ఏప్రిల్‌లో ఒక సాయంత్రం. సినీ సంగీత దర్శకుడు చక్రవర్తికి సన్మానం. హాలంతా కిక్కిరిసింది. బయటా గాంధీ పార్కులోనూ నిలుచున్న జనం ప్రసంగాలను వింటున్నారు. హాలులో ప్రెస్‌కు కేటాయించిన మొదటి వరుసలో కూర్చున్నాను. ఆ సందర్భంలో 'నేనయ్యా నాజర్‌ను'...

నాజర్ ఇంకా జీవించే ఉన్నారా? విస్మయం! మాచర్ల చెన్నకేశుని గుడిలో 1968 ప్రాంతంలో పల్నాటి కథను చెబుతూ వేదికను, ప్రేక్షకుల హృదయాలను ఊపేసిన నాజర్ మనసులో మెదిలారు. ఆ నాజరే. సన్మానం అందుకుంటోన్న చక్రవర్తి, పరుగు పరుగున వేదిక దిగారు. బయట ప్రవేశ ద్వారం వరకూ వెళ్లి, కాపలాదారులు అడ్డగించిన నాజర్‌ను గౌరవంగా వేదికపైకి తీసుకు వచ్చారు. తన తండ్రి బసవయ్య కోరిక మేరకు, తనకూ, తన తల్లికి పొన్నెకల్లులో హార్మోనియం నేర్పిన గురువు నాజర్ అని ప్రేక్షకులకు చెప్పారు. గురువుకి శాలువా కప్పారు.

ఆ మరుసటి ఉదయం నాజర్ ఇంటికి వెళ్లాను. తన బతుకు కథను చెప్పమని కోరాను. 'ఒక పూట తెమిలేదా అబ్బాయి' అన్నారు. రోజూ వస్తానన్నాను. దాదాపు రెండు వారాలు. రోజూ ఉదయం ఏడు, ఎనిమిది గంటలకు వెళ్లేవాడిని. శ్రీమతి నాజర్ తొలుత సేమ్యా పాయసం, వచ్చేపుడు పెద్ద 'ఇత్తడి గళాసు' నిండా మజ్జిగ ఇచ్చేవారు. నాజర్‌కు కళాకారులకు సహజమైన అలవాట్లు లేవు. ఆంధ్రభూమిలో ఆయనపై ప్రచురితమైన సవివర వ్యాసాలు చదివిన ఎందరో ప్రముఖులు ఫోన్ చేయడం వలన తెలి సింది, నాజర్ ఇంకా జీవించే ఉన్నారా అనే సందేహం నాకు మాత్రమే కలిగినది కాదని! చదువరులను శ్రీశ్రీ వలె, పామరులను అంతకు మించి ప్రభావితం చేసిన బుర్రకథా పితామహుడు నాజర్‌ను వామపక్షాలు ఎందుకు విస్మరించాయి? వివిధ సందర్భాలలో ఎందుకు ఆహ్వానించలేదు? అవలోకన చేయవలసిన అంశం.

నాజర్‌కు నాటకాలంటే ఆసక్తి. ఎనిమిదో ఏటనుండే వేషాలు కట్టారు. 'పగలు రేత్తిరి' నాట కాల వారి వెంటే. పెదరావూరుకు చెందిన రామక్రిష్ణ శాస్త్రి నెలకు మూడు రూపాయలిచ్చి నాజర్‌కు తెనాలిలో డ్యాన్స్ నేర్పించారు. నరసరావుపేటలోని క్షురకుడు మురుగుల సీతారామయ్య ఖర్చులు ఇప్పించి నాజర్‌కు సంగీతం నేర్పించారు. పేటలో, తాడికొండ బోగం అమ్మాయి పాటలు పాడించుకుని అన్నం పెట్టేది. విద్య నేర్చుకుని నాజర్ పొన్నెకల్లు చేరాడు.

ఈ నేపథ్యంలో, 1943లో ఉమ్మడి కమ్యూనిస్ట్ పార్టీ తాళ్ళూరులో నిర్వహించిన పాటల పోటీలో నాజర్ ప్రథమ బహుమతి పొందారు. ఆ సందర్భంలో రెంటపాడుకు చెందిన రామకోటి పరిచయమయ్యారు. కథకుడిగా బుర్రకథను చెప్పే రామకోటి, తనకంటే గొప్పగాత్రం ఉందని భావించి, తగిన మెళకువలను నేర్పి నాజర్‌ను కథకుడిగా చేశాడు. నాజర్ కథకుడు. హాస్యగాడు రామకోటి. వంత కర్నాటి.'నాజర్ దళం' లక్షలాది సామాన్య జనం కమ్యూనిస్ట్ పార్టీని ఆలింగనం చేసుకునేలా చేసింది. ప్రజానాట్యమండలిలో తొలి తరం కళాకారుడైన నాజర్ స్వయంగా బుర్రకథలను రాసుకునేవారు. పాటలు రాసేవారు. కట్టేవారు. పాడేవారు. ఆ వాగ్గేయుని ప్రభావం గద్దర్, వంగపండు, నేటి గోరటి వెంకన్న వరకూ ప్రసరిస్తోంది.

కమ్యూనిస్ట్ పార్టీలకు మాత్రం నాజర్ ఆత్మఘోష సోకలేదు. ప్రజానాట్య మండలి 1949లో రద్దయింది. పార్టీ కథలు



చెప్పుకుని బతకమన్నది. కొన్నాళ్లకు ఉమ్మడి పార్టీ నాయకులు పార్టీ వేదిక లపై కథ చెప్పాలన్నారు. బయటవారు నాజర్ కథకు 300 రూపాయలు ఇచ్చే రోజులు. 'దళం' రాకపోకల ఖర్చు కోసం పార్టీ నుంచి రూ. 100 తీసుకునేవారు. కథలో భాగంగా కుల వాస్తవికతలను చెప్పేవారు. అది పెడధోరణిగా భావించి నాజర్ సేవలు అవసరం లేదంది పార్టీ. సీపీఎం సైతం చాలు చాలన్నది. 'అవును నిజం, నీవన్నది' అంటూ ఆ తరువాత తరిమెల, దేవులపల్లిలు నాజర్‌ను ఆహ్వానించారు. ధర్మరాజు వంటి వ్యసనపరులు, భీముని వంటి తిండిపోతులు, నకుల సహదేవుల వంటి అర్భకులను, అర్జునుని వంటి వీరులను ఒక్కతాటిపై నడిపి, రాజ్యా ధికారంలోకి తెచ్చేందుకు పార్టీలోని మేధోన్నతులు కృష్ణునిలా దోహదపడాలన్న నాజర్ వైఖరి ఎం.ఎల్‌లకు నచ్చలేదు. విరసానిక్కూడా. మావో సాక్షిగా చివరి శ్వాస వరకూ నాజర్ మార్క్సిజాన్నే నమ్మారు!

నాజర్ ఉదహరించే ఇతిహాసాలను అభ్యుదయవాదులు విస్మరించారు. ఆ ఖాళీలో దేశంలో మతవాదులు చొరబడ్డారు. వామపక్షవాదులు కులభావనను గుర్తించలేదు. ఆ శూన్యంలో అణగారిన కులాల అభ్యున్నతికి పాటుపడతామనే విశ్వాసాన్ని కలిగించిన పార్టీలు రాష్ట్రాలలో అధికారంలోకి వచ్చాయి. ఆ దిశగా అడుగులు వేయడమూ చూస్తున్నాం. ఏదిఏమైనా, ప్రజలే చరిత్ర నిర్మాతలు కదా!

(ప్రముఖ బుర్రకథా పితామహుడు షేక్ నాజర్ శత జయంతి సందర్భంగా)

వ్యాసకర్త ఇండిపెండెంట్ జర్నలిస్ట్ । 76809 50863

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899



నామినేషన్ తిరస్కరణ



సినిమా పేజీలో...
జోడీ కుదిరిందా?

# ఇప్పటికీ అవే అసైన్‌మెంట్‌లు!



బర్ఖా తల్లి ప్రభాదత్
తొలి మహిళా యుద్ధ విలేఖరి



బర్ఖాదత్

**'మహానటి' చిత్రంలో సమంత యువ జర్నలిస్టు. వాళ్ల ఎడిటర్ ఆమెకు ఎప్పుడూ అంతగా శ్రమ అవసరం లేని అసైన్‌మెంట్‌లు ఇస్తుంటారు. సమంతకు మాత్రం ఏదైనా డైనమిక్‌గా చేయాలని ఉంటుంది. "ఆ వెధవ శేఖర్‌కి చీఫ్ మినిస్టర్.. నాకేమో.. కోమా పేషెంట్" అని బాధపడుతుంది ఓ సీన్‌లో. మంగళవారం (ఫిబ్రవరి 4) హైదరాబాద్‌లో ఫిక్కీ లేడీస్ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో 'చేంజింగ్ నేచర్ ఆఫ్ ఇండియన్ మీడియా' అనే అంశంపై సీనియర్ జర్నలిస్ట్ బర్ఖాదత్ ప్రసంగిస్తూ.. "మహిళా రిపోర్టర్‌లకు ఇప్పటికీ అవే అసైన్‌మెంట్‌లు" అంటూ తన అనుభవాలు పంచుకున్నప్పుడు ఆమెలోనూ ఒక సమంత కనిపించారు!**

జర్నలిజంలో మహిళలకు కేటాయించే అసైన్‌మెంట్‌ల విషయంలో తన తల్లి ప్రభాదత్ తరానికి, తన తరానికి, ఇప్పటి కొత్త తరానికి పెద్ద తేడా లేదంటారు బర్ఖాదత్. ''మా అమ్మ అరవైలలోనే జర్నలిజంలోకి వచ్చింది. అప్పటికి ఈ రంగంలో ఆడవాళ్లు అసలు లేరనే చెప్పాలి. సమాజంలో ఉన్న అవినీతిని ఎండగట్టాలని, మహిళల సమస్యల మీద కథనాలు రాయాలని, రాజకీయ విశ్లేషణలు చేయాలని ఎంతో ఉత్సాహంగా ఈ రంగంలోకి వచ్చిన మా అమ్మకు ఫ్లవర్ షో అసైన్‌మెంట్ ఇచ్చారట! 'ఇది కాదు, నేను చేయాలనుకుంటున్నది' అన్నప్పుడు మా అమ్మకు వచ్చిన సమాధానం 'అమ్మాయివి కదా' అని. ఇండో పాక్ యుద్ధం జరుగుతున్నప్పుడు తనకు వార్ ఫీల్డ్ నుంచి రిపోర్ట్ చేసే అవకాశం ఇమ్మని అమ్మ అడిగిందట. అప్పుడూ అదే సమాధానం. ఇరవై ఏళ్ల ఆడపిల్లను యుద్ధక్షేత్రానికి పంపించడానికి ఎడిటర్ సిద్ధంగా లేరు. కానీ సరిహద్దులో యుద్ధం జరుగుతుంటే ఢిల్లీలో ఉండడం ఆమె వల్ల కాలేదు. ఐదు రోజులు సెలవు పెట్టి మరీ పంజాబ్ సరిహద్దుకు వెళ్లింది. ఢిల్లీకి వచ్చి యుద్ధ సమయంలో తాను చూసిన విషయాలను రాసింది. నాకు పదమూడేళ్లున్నప్పుడే అమ్మ బ్రెయిన్ హెమరేజ్‌తో మాకు దూరమైంది. ఆమె జీవించింది నలభై ఏళ్లే. కానీ నాలో వందేళ్ల స్ఫూర్తిని నింపింది. అదే స్ఫూర్తితో జర్నలిజంలో కొనసాగాను.

## నాకూ అదే ఎదురైంది

కార్గిల్ యుద్ధ సమయంలో అసైన్‌మెంట్ వేయమని అడిగినప్పుడు నాకు కూడా మా అమ్మకు ఎదురైనట్లే 'యుద్ధం క్షేత్రంలోకి అమ్మాయిలెందుకు? అనే ప్రశ్న ఎదురైంది. తరం మారినా ఏమీ మారలేదని తెలిసింది. ఆ రిపోర్టింగ్‌కి అవకాశం వచ్చిందనడం కంటే తెచ్చుకున్నానని చెప్పడమే కరెక్ట్. తీరా అక్కడికి వెళ్లిన తరవాత సైనికాధికారులు కూడా 'ఇది అమ్మాయిలు పని చేసే ప్రదేశం కాదు' అన్నారు. నాకు భయం లేదన్నాను. వాళ్లు చెప్పిన కారణం ఏమిటంటే... అక్కడ సమయానికి ఆహారం ఉండదు, బస వసతి ఉండదు, కనీసం బాత్‌రూమ్‌లు కూడా ఉండవు. అందుకే వద్దంటున్నాం అని. అన్నింటికీ సిద్ధపడి, బాత్‌రూమ్ అవసరాలకు చెట్ల మాటును, రాళ్ల గుట్టలను ఆశ్రయిస్తూ పని చేశాను. కార్గిల్ యుద్ధంలో హీరో.. కెప్టెన్ విక్రమ్ బత్రాను ఇంటర్వ్యూ చేయగలిగాను. 1999లో ఇప్పటిలాగా స్మార్ట్‌ఫోన్‌లు లేవు. ఇంటర్నెట్ సౌకర్యం విస్తృతంగా లేదు. రిపోర్ట్ చేసిన కథనాలను, ఫొటోలను ఢిల్లీకి చేర్చాలంటే దగ్గరలోని పట్టణాలకు వెళ్లాలి. మిలటరీ వాళ్లను బతిమలాడి వాళ్లతోపాటు వాళ్ల వాహనంలో ప్రయాణించాను. నేను చెప్పేదేమిటంటే.. ఎవరైనా తాము ఒకటి చేయాలనుకుంటే చేసి తీరాలి. ఇప్పటి రిపోర్టర్‌కు తాను చూసిన, విశ్వసించిన విషయాన్ని యథాతథంగా రిపోర్ట్ చేసే అవకాశం తగ్గిపోయింది. అయితే పని చేయాలనుకుంటే సంకెళ్లు మాత్రం ఎప్పుడూ ఉండవు. గ్రామాలకు వెళ్లండి. అక్కడి సమస్యలను కెమెరాలో చిత్రీకరించండి. వాటిని యథాతథంగా రిపోర్ట్ చేయండి. వార్తలు మన దగ్గరకు రావు. వార్తల దగ్గరకు మనమే వెళ్లాలి. మీడియాలో వచ్చిన మార్పుల్లో టెక్నాలజీ విప్లవం కూడా ఒకటి. ఇప్పుడు సాంకేతికత విస్తృతమైంది. చేతిలో స్మార్ట్ ఫోన్, మొబైల్‌లో డాటా ఉంటే చాలు. చూసింది చూసినట్లు చెప్పడం వస్తే చాలు.. జర్నలిస్టు అయిపోవచ్చు. సంఘటనను మీదైన కోణంలో విశ్లేషిస్తూ ప్రజెంట్ చేయవచ్చు'' అన్నారు బర్ఖాదత్.

## పెళ్లే కాలేదు.. ముగ్గురు భర్తలా!

వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో సగానికి సగం తప్పుడు కథనాలు చెలామణిలోకి రావడం మీద బదులిస్తూ వికీపీడియా కూడా ఇందుకు పెద్దగా మినహాయింపు కాదన్నారు బర్ఖాదత్. పెళ్లి చేసుకోని తనకు ముగ్గురు భర్తలున్నట్లు వికీపీడియా రాసిన విషయాన్ని గుర్తు చేశారామె. టీవీలు రేటింగ్ పరుగులో కొట్టుకుపోవడాన్ని కూడా ఆక్షేపించారు. ఏదైనా ఒక మీడియా సంస్థ తాను ప్రచురించే లేదా ప్రసారం చేసే కథనాల విషయంలో... నిజం మీద కట్టుబడితేనే ఆ సంస్థకు విశ్వసనీయత ఉంటుంది అన్నారు.

ఒక ప్రశ్నకు సమాధానంగా ''అవాస్తవాలతో కథనాలను వండి వారుస్తుంటే వచ్చే చెడ్డ పేరు ఆ మీడియా సంస్థకు మాత్రమే కాదు. జర్నలిజం వృత్తి మీదనే గౌరవం తగ్గిపోతుంది'' అన్నారు బర్ఖాదత్.

**– వాకా మంజులారెడ్డి**

---

**రెండు విషయాలు**

## పట్టిన పట్టు వదల్లేదు

భగీరథి అమ్మ అనే 105 ఏళ్ల కేరళ మహిళ 74.5 శాతం మార్కులతో నాలుగో తరగతి పాస్ అయ్యారు! కేరళలోనే అత్యంత పెద్ద వయసుగల స్కూలు విద్యార్థినిగా ఇప్పటికే గుర్తింపు పొందిన భగీరథి అమ్మ ఉత్తీర్ణతను.. కేరళ రాష్ట్ర అక్షరాస్యత యంత్రాంగం బుధవారం అధికారికంగా ప్రకటించింది. కొల్లం జిల్లా త్రిక్కరువ పంచాయితీలోని ప్రక్కులం గ్రామంలో భగీరథి అమ్మ ఉంటున్నారు. మూడవ తరగతి చదువుతున్నప్పుడే పెద్దల ఒత్తిడి వల్ల బడి మానేశారు. అయితే తరాలు గడిచినా ఆమెలోని విద్యా తృష్ణ చల్లారలేదు. పట్టు పట్టి చదివారు. నాలుగో తరగతి పాస్ అయ్యారు. ఇప్పుడిక ప్రత్యేక అనుమతితో పదో తరగతి చదవబోతున్నారు. చదువుకు వయసు అడ్డు కాదని మరోసారి రుజువైంది.



భగీరథి అమ్మను ఇంటికొచ్చి అభినందిస్తున్న పంచాయితీ ప్రెసిడెంటు

## కొట్టడం ప్రేమ కాదు



నటి తాప్సీ

ప్రేయసిని చెంపదెబ్బ కొట్టడం కూడా ప్రేమేనని.. అదేదో సినిమా వచ్చినప్పట్నుంచీ ఒక ప్రచారంలా సాగిపోతోంది! కొట్టేంత ప్రేమ అట!! అయితే తాప్సీ ఆ ప్రేమనే కొట్టిపడేస్తున్నారు. చెంపదెబ్బ కొట్టడం చెయ్యి చేసుకోవడమే అవుతుంది తప్ప.. ప్రేమ ఎలా అవుతుందని ఆమె ప్రశ్న. తాప్సీ నటించిన 'థప్పడ్' సినిమా ఈ నెలలో విడుదల కాబోతోంది. థప్పడ్ అంటే చెంపదెబ్బ. చెంప దెబ్బ కొట్టిన భర్త నుంచి విడాకులు కోరే భార్య స్టోరీ అది. ఆ సినిమాలో నటించినందు వల్ల తాప్సీ ఇలా మాట్లాడ్డం లేదు. ముందు నుంచీ అంతే! ప్రేమ పేరుతో వ్యక్తిత్వం పై దెబ్బ పడితే సహించి ఊరుకోవద్దని అమ్మాయిలకు చెబుతూ ఉంటుంది కూడా. సరైన పాత్రకు సరైన కథానాయికనే ఎంచుకున్నాడు అనుభవ్ సిన్హా. ఆయనే ఈ 'థప్పడ్' సినిమా డైరెక్టర్.

---

**చెట్టు నీడ**

## ధనవంతుడు

**"నేనెన్నో ధర్మ కార్యాలు చేశాను. అయినా నన్ను నరకంలోకి తీసుకొచ్చారు. ఆ దొంగ ఎన్నో దొంగతనాలు చేశాడు. అయినా స్వర్గం లోకానికి తీసుకెళుతున్నారు. ఏమిటీ పక్షపాత వైఖరి?" అని ఆవేశంగా ప్రశ్నించాడు ధనవంతుడు.**

అడవివరం అనే గ్రామంలో జగన్నాథం అనే ధనవంతుడు వడ్డీ వ్యాపారంలో బాగా సంపాదించి ఆ వచ్చిన ధనంతో అన్నదానాలు చేయడం, గుడులు కట్టించడం వంటి ధర్మకార్యాలు చేస్తూ పుణ్యాత్ముడుగా పేరు తెచ్చుకున్నాడు. పుర జనులు కీర్తిస్తుంటే ఎంతో ఆనందించేవాడు.

అదే ఊళ్లో గంగన్న అనే ఒక చిల్లర దొంగ చిన్న చిన్న దొంగతనాలు చేస్తూ, పట్టబడ్డప్పుడు కారాగార శిక్ష అనుభవిస్తూ జీవించేవాడు.

ఒకరోజు ధనవంతుడు మరణించాడు. మరునాడే ఆ చిల్లర దొంగ కూడా మరణించాడు.

ఆ చిల్లర దొంగని దేవదూతలు స్వర్గానికి తీసుకు వెళుతుండగా నరకంలో ఉన్న ధనవంతుడు ఆశ్చర్యం, కోపం ముప్పిరిగొనగా యమకింకరులతో..

''నేనెన్నో ధర్మకార్యాలు చేశాను. అయినా నన్ను నరకంలోకి తీసుకొచ్చారు. ఆ దొంగ ఎన్నో దొంగతనాలు చేశాడు. అయినా స్వర్గం లోకానికి తీసుకెళుతున్నారు. ఏమిటీ పక్షపాతవైఖరి?'' అని ఆవేశంగా ప్రశ్నించాడు.

దీనికి యమకింకరులు..

''నువ్వు చేసిన దానధర్మాలు, పుణ్యకార్యాలు వడ్డీవ్యాపారం చేయగా వచ్చిన ధనంతో చేశావు. దానికి ప్రతిగా అందరూ పొగుడుతుంటే ఎంతో ఆనందించావు. నీవు చేసిన పుణ్యాలకి సరిపోయింది.

ఆ దొంగ దొంగతనాన్ని వృత్తిగా ఎంచుకుని దొరికినప్పుడు కారాగారశిక్ష అనుభవించాడు. అందరూ తిట్టేవారు. ఆపాపాలకి ప్రాయశ్చిత్తం అయిపోయింది.

ఇక స్వర్గలోక ప్రాప్తి అంటావా? ఆ దొంగ తాను మరణించడానికి ఒకరోజు ముందు ఒక శవం వెళుతుంటే తన పాదరక్షలు విప్పి దణ్ణం పెట్టాడు. నీవు ఏరోజూ అలాంటి పని చేయలేదు. అంతేకాదు.. ఆ దొంగ దణ్ణం పెట్టుకున్న శవం కూడా నీదే. నీవు చేసే వడ్డీ వ్యాపారం వలన నీకు నరకలోకం ప్రాప్తించింది. శవానికి నమస్కరించడం వలన ఆ దొంగకి స్వర్గలోకం దొరికింది'' అన్నారు.

ధనవంతుడు మిన్నకుండిపోయాడు.

**– లోగిశ లక్ష్మీనాయుడు**

---

**మానవ సేవ**

## దైవ దూతలు

మనుషులెప్పుడూ ఇంతగా భయపడలేదు. కరోనా వైరస్ పడగ విప్పి బుసలు కొడుతుంటే పెద్ద పెద్ద దేశాలు సైతం గజగజలాడుతున్నాయి. మానవాళికిపై ఇప్పుడు రెండు బాధ్యతలు. ఒకటి కరోనా వ్యాప్తి చెందకుండా చూడటం. ఇంకోటి.. కరోనా వచ్చినవారిని కాపాడుకోవడం. ఎవరు కాపాడతారు.. దేవుడు కూడా మనిషికి దగ్గరగా వచ్చేందుకు సంశయిస్తాడా అన్నంతగా కరోనా వాయువేగంతో ప్రబలిపోతుంటే! దేవుడు ప్రత్యక్షంగా దిగిరాక పోవచ్చు కానీ.. దైవ స్వరూపాల్లా.. నర్సులు కరోనా రోగులకు సేవలు అందిస్తున్నారు. తమకేమైనా పర్వాలేదు.. వీలైనన్ని ప్రాణాలను నిలబెట్టడమే తమ బాధ్యత అన్నట్లు.. ముఖాలకు మాస్కులు కట్టుకున్నవాళ్లు కట్టుకున్నట్లే.. అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారు. అలా దీర్ఘకాలం మాస్కులు ఉండటంతో వారి ముఖాల మీద పుండ్లు పడుతున్నాయి. వాటిని కట్టుకున్న చోట చర్మం పలుచనై రక్త చారికలు కనిపిస్తున్నాయి. అయినా వారు తమ వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తూనే ఉన్నారు. కమిలి, నొక్కుకుని, వాతలు తేలి ఉన్న ఈ నర్సుల ముఖాలు చూసైనా కరోనా మహమ్మారి శాంతిస్తే బావుణ్ణు. మరోవైపు.. సోషల్ మీడియాలో ఈ దైవదూతల ముఖాలను చూసిన వాళ్లంతా.. 'సెల్యూట్ ద ఏంజిల్స్' అని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నారు.



మాస్కుల కారణంగా కమిలిన ముఖాలతో కరోనా నర్సులు

---

## ప్రశ్న జవాబు

**నిర్భయ దోషులకు జనవరి 22న ఉరి అన్నారు. వాయిదా వేశారు. ఫిబ్రవరి 1న ఉరి అన్నారు. మళ్లీ వాయిదా వేశారు. చివరికి ఉరి అమలునే నిలిపేశారు. ఎందుకు నిలిపేశారు?**

ఉరి అమలును పూర్తిగా నిలిపి వేయడం కాదు. జనవరి 22న ఉరి అని సుప్రీంకోర్టు తొలి డెత్ వారెంట్ ఇచ్చాక.. నాటి నుంచీ దోషులు అందరూ ఒకేసారి కాకుండా ఒకరొకరుగా వేసుకుంటూ వస్తున్న పిటిషన్‌లను పరిశీలించి తీరాలి కనుక అవన్నీ పూర్తయ్యే వరకు చట్టరీత్యా ఉరి అమలు సాధ్యం కాదు. అదే విషయాన్ని బుధవారం ఢిల్లీ హై కోర్టు కూడా స్పష్టం చేసింది.

**మరి పిటిషన్‌ల పరిశీలన పూర్తవకుండానే ఫిబ్రవరి 1 అని మరో డెత్ వారెంట్ ఎందుకు ఇచ్చినట్లు?**

దోషుల తరఫు లాయర్లు ఎప్పటికప్పుడు కొత్తగా పిటిషన్‌లు వేస్తున్నారు. శనివారం (ఫిబ్రవరి 1) ఉరి తీస్తారనగా రెండు రోజుల ముందు.. గురువారం.. నలుగురు దోషులలో ముగ్గురైన అక్షయ్ ఠాకూర్, వినయ్ శర్మ, పవన్ గుప్త తరఫు లాయర్ ఉరి శిక్ష అమలును వాయిదా వేయాలంటూ కోర్టులో పిటిషన్ వేశారు. అప్పటికి వినయ్ శర్మ క్షమాభిక్ష పిటిషన్ రాష్ట్రపతి దగ్గర పెడింగులో ఉంది. అక్షయ్ ఠాకూర్, పవన్ గుప్తలు కూడా తమకున్న చట్టపరమైన అవకాశాలను పూర్తిగా ఉపయోగించుకోలేదు. కాబట్టి ఉరి అమలును నిలిపి వేయాలని లాయర్ కోరారు. కోర్టు సమ్మతించింది. ఉరికి కొత్త తేదీ చెప్పేవరకు ఉరి అమలును నిలిపి వేయాలని తీర్పు ఇచ్చింది.

**ఉరి తీసే తేదీ ఇచ్చాక కూడా మళ్లీ వారికి చట్టపరమైన అవకాశాలు ఇవ్వడం ఎందుకు?**

చట్టంలోనే అలా ఉంది. ఉరి తీసే ముందు 'నీ చివరి కోరిక ఏమిటి?' అని అడుగుతారని అంటారు. ఆ అడగడం నిజమో కాదో కానీ.. డెత్ వారెంట్ వచ్చాక (ఉరి తేదీ వచ్చాక) కూడా.. తమను ఎందుకు ఉరి తియ్యకూడదో చెప్పుకునే, క్షమాభిక్ష కోరుకునే అవకాశాన్ని చట్టం దోషులకు కల్పిస్తోంది. మరణశిక్ష పడిన ప్రతి దోషికీ మూడు అవకాశాలు ఉంటాయి. ఆ మూడు అవకాశాలూ.. ఒకటి నిష్ఫలం అయితే ఇంకొకటి అన్నట్లుగా దోషికి ఉపకరిస్తాయి.

**ఏమిటా మూడు అవకాశాలు?**

మొదటిది రివ్యూ పిటిషన్. ఉరి విధింపును తిరిగి పరిశీలించమని కోర్టును కోరడం. రెండోది క్యురేటివ్ పిటిషన్. ఉరి విధింపునకు దారి తీసిన వాదనల వల్ల తమకు న్యాయం జరగలేదని కోర్టుకు చెప్పుకోవడం. మూడోది క్షమాభిక్ష పెట్టమని రాష్ట్రపతిని వేడుకోవడం.

**ఇప్పటి వరకు ఎవరు ఎన్ని అవకాశాలు ఉపయోగించుకున్నారు?**

ముఖేశ్, వినయ్, అక్షయ్‌లు పూర్తిగా వినియోగించుకున్నారు. పవన్ గుప్తా ఇంతవరకు రివ్యూ పిటిషన్ తప్ప క్యురేటివ్ పిటిషన్, క్షమాభిక్ష పిటిషన్ వెయ్యలేదు.

### నిర్భయ కేసు / ప్రస్తుత స్థితి



| | ముఖేశ్ సింగ్ | అక్షయ్ ఠాకూర్ | వినయ్ శర్మ | పవన్ గుప్తా |
|---|---|---|---|---|
| రివ్యూ పిటిషన్ | తిరస్కరణ | తిరస్కరణ | తిరస్కరణ | తిరస్కరణ |
| క్యురేటివ్ పిటిషన్ | తిరస్కరణ | తిరస్కరణ | తిరస్కరణ | ఇంకా పిటిషన్ వెయ్యలేదు |
| క్షమాభిక్ష పిటిషన్ | తిరస్కరణ | తిరస్కరణ | తిరస్కరణ | ఇంకా పిటిషన్ వెయ్యలేదు |

---

**స్ఫూర్తి**

## అందుకున్న కల

**పెళ్లి, పిల్లలు కుటుంబ బాధ్యతల్లోనే మహిళ జీవనం గడిచిపోతుంది. ఉద్యోగినిగా మారితే అదనపు బాధ్యత వచ్చి చేరుతుంది. ఆ బాధ్యతలు, విధుల్లో తలమునకలుగా ఉండటంతో చిన్ననాటి కలలు ఎక్కడో మరుగున పడిపోతాయి. అయితే, స్వరాజ్యలక్ష్మి తన కలల్ని విడిచిపెట్టేయలేదు. గృహిణిగా, కండక్టర్‌గా విధులు నిర్వర్తిస్తూనే పరుగుల రాణిగా తన కలను తనే అందుకున్నారు.**

బైరి స్వరాజ్యలక్ష్మి ఉండేది సికింద్రాబాద్‌కు చేరువలో ఉన్న మచ్చబొల్లారంలో. వయసు నాలుగు పదులు దాటింది. భర్త ధన్‌రాజ్ ప్రైవేటు ఉద్యోగి. ఒక్కగానొక్క కొడుకు. చిన్న కుటుంబం. చింతల్లేవు. ''నాన్న రైల్వేలో ఉద్యోగి కావడంతో నేనూ రైల్వే కాలేజీలో చదువుకున్నాను. స్కూల్, ఇంటర్మీడియెట్ స్థాయిలో రన్నింగ్ కాంపిటిషన్‌లో పాల్గొనే దాన్ని. ఎప్పుడూ ఫస్ట్ వచ్చేదాన్ని. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని పీటీ ఉషలా పేరుతెచ్చుకోవాలని కలలు కనేదాన్ని. అయితే ఇంటర్మీడియెట్ పూర్తికాగానే అక్కడితో చదువు ఆపేయమన్నారు అమ్మానాన్న'' అని చెప్పారు స్వరాజ్యలక్ష్మి. చదువుతో పాటే రన్నింగ్ రేస్‌లలో పాల్గొనడమూ ఆగిపోయింది. ముగ్గురు అక్కచెల్లెళ్లు. వాళ్ల పెళ్లిళ్లు చేసి బాధ్యతలు తీర్చుకున్నారు స్వరాజ్యలక్ష్మి తల్లిదండ్రులు.

### గ్రౌండ్‌లలో రౌండ్లు

''మా వారిది ప్రైవేటు ఉద్యోగం కావడంతో, చదువుకున్నది కొంత వరకే అయినా ఖాళీగా ఉండటం ఇష్టంలేకపోవడంతో ఉద్యోగం చేస్తానని చెప్పాను. తన ప్రోత్సాహంతో ఇరవై ఏళ్ల క్రితం ఆర్టీసీలో కండక్టర్ చేరాను. గృహిణిగా ఇంటి బాధ్యతలు, ఉద్యోగినిగా కండక్టర్ విధులు, తల్లిగా పిల్లాడి పనులు.. రోజులు గడిచిపోతున్నాయి. ఆ సమయంలో.. ఎనిమిదేళ్ల క్రితం.. ఆర్టీసీ తరపున స్పోర్ట్స్ పర్సన్స్ ఎవరైనా దేశ, అంతర్జాతీయ స్థాయిల్లో జరిగే పోటీల్లో పాల్గొనవచ్చని తెలిసింది. చదువుతో ఆగిపోయిన నా కలలకు కొత్త రెక్కలు వచ్చి చేరినట్టు అనిపించింది. రన్నింగ్.. అనే మరుగున పడిపోయిన జ్ఞాపకం తిరిగి నా కళ్లెదుటికి వచ్చింది. ఇంట్లో ఈ విషయం చెప్పడంతోనే సపోర్ట్ కూడా వచ్చింది. ఆ రోజు నుంచి నా టైమ్ టేబులే మారిపోయింది. ఉదయం 5 గంటలకల్లా డ్యూటీకి వెళతాను. మధ్యాహ్నం 2:30 కల్లా ఇంటికి వచ్చేస్తాను. ఓ అర గంట విశ్రాంతి. తర్వాత స్కూల్ నుంచి వచ్చిన బాబుకు టిఫిన్ పెట్టి, కాసేపు హోమ్ వర్క్ చేయించి, తిరిగి 5 గంటలకు బొల్లారంలోని పబ్లిక్ గ్రౌండ్‌కు వెళతాను. వారంలో ఒక్కరోజైనా ఉస్మానియా యూనివర్శిటీ గ్రౌండ్, ఇందిరా గార్డెన్‌లోనూ ప్రాక్టీస్‌కి వెళతాను. అలా ప్రాక్టీస్ చేస్తూనే.. రెండేళ్ల క్రితం ఇండోనేషియాలో జరిగిన రన్నింగ్ కాంపిటేషన్‌లో పాల్గొని బంగారు పతకంతో తిరిగి వచ్చాను. దేశీయ స్థాయిలో ఢిల్లీ, రాజస్థాన్, చండీగడ్‌లలోనూ రన్నింగ్ పోటీల్లో పాల్గొన్నాను. 2018లో ఇండోనేషియా జకార్తాలో జరిగిన అంతర్జాతీయ అథ్లెటిక్ పోటీల్లో బంగారు పతకాలు, 3 కిలోమీటర్ల నడక పందెంలో కాంస్య పతకం, గతేడాది గచ్చిబౌలిలో జరిగిన రాష్ట్రస్థాయి పరుగు పోటీల్లో 100, 400, 800 మీటర్ల విభాగంలో బంగారు పతకాలు సాధించాను.



పతకాల విజేతగా



కండక్టరుగా

### నమ్మలేకపోతుంటారు

''ఈ నెలలో దేశీయ స్థాయిలో హర్యానాలో పోటీలు జరుగుతున్నాయి. 8 నుంచి 11 వరకు అక్కడ జరిగే నేషనల్ కాంపిటిషన్స్‌కు వెళుతున్నాను. ప్రయాణ ఖర్చుల వరకు నేను పెట్టుకొని వెళతాను. మిగతా వసతి సదుపాయాలు నిర్వాహకులు ఏర్పాటు చేస్తారు.

నా సహోద్యోగులు 'మేం చేయలేనిది నువ్వు చేస్తున్నావ్, గ్రేట్' అంటుంటారు. 'ఈ వయసులో మాకు కాళ్ల నొప్పులు. మరి నువ్వెలా పరిగెడుతున్నావు?' అని కొందరు అంటుంటారు. చదువుకునే రోజుల్లో ఆటలు వద్దని చెప్పిన అమ్మనాన్న, బంధువులే కాదు నాతో పాటు పెరిగిన నా చెల్లెళ్లు కూడా ఇప్పుడు నా గురించి గొప్పగా చెప్పుకుంటుంటారు...'' అని నవ్వుతూ అన్నారు స్వరాజ్యలక్ష్మి.

అమ్మాయిలు తమ కలగన్న జీవితాన్ని అందుకోవడానికి చాలా అడ్డంకులే ఏర్పడుతుంటాయి. వాటిని అధిగమిస్తూ వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటూ ముందుకు సాగాలనుకునేవారికి స్వరాజ్యలక్ష్మి పట్టుదల ఒక స్ఫూర్తి.

**– నిర్మలారెడ్డి**

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
శుక్రవారం ॥
7-2-2020

# టైటిల్స్ కుదిరాయి

సినిమా ప్రేక్షకుడి దాకా వెళ్లాలన్నా, ప్రేక్షకుడు థియేటర్ దాకా రావాలన్నా ప్రచారం కీలకం. సినిమా ప్రచారంలో మొట్టమొదటి చాప్టర్ సినిమా టైటిల్. పేరు ఎంత బావుంటే, ఎంత క్యాచీగా ఉంటే సినిమాకి అంత ప్లస్సు. ప్రస్తుతం ఇండస్ట్రీలో కొన్ని క్రేజీ సినిమాలకు టైటిల్స్ ఫిక్స్ అయ్యాయని తెలిసింది. ఆ వివరాలు...


• చిరంజీవి


• ప్రభాస్


• పవన్ కల్యాణ్

### ఆచార్య చిరంజీవి

చిరంజీవి, కొరటాల శివ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కుతోంది. సామాజిక అంశాలతో కూడుకున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కి 'ఆచార్య' అనే టైటిల్ ఫిక్స్ చేశార ట. నిరంజన్ రెడ్డి, రామ్ చరణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. టైటిల్‌ని బట్టి గమనిస్తే చిరంజీవి ఈ సినిమాలో ప్రొఫెసర్ పాత్రలో కనిపిస్తారని ఊహించవచ్చు.

### డియర్ ప్రభాస్

ప్రభాస్, పూజా హెగ్డే జంటగా రాధాకృష్ణ దర్శకత్వంలో ఓ ప్రేమకథా చిత్రం తెరకెక్కుతోంది. ఈ సినిమాకు ముందు 'జాన్' అనే టైటిల్ అనుకుంటున్నారని వార్తలు వచ్చాయి. తాజాగా 'ఓ డియర్' అనే టైటిల్ ఫిక్స్ చేయాలని చిత్రబృందం భావిస్తోందట. అలాగే 'రాధే శ్యామ్' అనే టైటిల్‌ను కూడా పరిశీలిస్తున్నారని టాక్.

### వకీల్ సాబ్

హిందీ చిత్రం 'పింక్' తెలుగు రీమేక్‌ను తన రీ ఎంట్రీ కోసం ఎంచుకున్నారు పవన్ కల్యాణ్. ఇందులో లాయర్ పాత్రలో నటిస్తున్నారాయన. ఈ సినిమా కోసం 'వకీల్ సాబ్' అనే టైటిల్ రిజిస్టర్ చేశారట. వేణు శ్రీరామ్ దర్శకత్వంలో 'దిల్' రాజు నిర్మిస్తున్న ఈ సినిమా మే 15న విడుదల కానుంది.


• శ్రుతీహాసన్

### జోడీ కుదిరిందా?

'గబ్బర్‌సింగ్'లో తొలిసారి పవన్‌కల్యాణ్‌తో జోడీ కట్టారు శ్రుతీహాసన్. ఆ సినిమా సూపర్ హిట్ అయింది. ఆ తర్వాత 'కాటమరాయుడు' సినిమాలో మళ్లీ జంటగా నటించారు. తాజాగా మరోసారి జంటగా కనిపించడానికి రెడీ అవుతున్నారట పవన్ కల్యాణ్, శ్రుతీహాసన్. 'గబ్బర్ సింగ్' తర్వాత పవన్ కల్యాణ్‌ని మరోసారి డైరెక్ట్ చేస్తున్నారు దర్శకుడు హరీష్ శంకర్. మైత్రీ మూవీస్ సంస్థ ఈ సినిమాను నిర్మించనుంది. ఇందులో హీరోయిన్‌గా శ్రుతీహాసన్‌ని తీసుకోవాలని భావిస్తున్నారట చిత్ర బృందం.

# నామినేషన్ తిరస్కరణ

• కోర్టుని ఆశ్రయించనున్న చిన్మయి


• చిన్మయి

తమిళ ఇండస్ట్రీలో జరిగిన డబ్బింగ్ యూనియన్ ఎన్నికలపై ఎప్పుడూ లేని ఆసక్తి నెలకొంది. దానికి కారణం ప్రెసిడెంట్ పదవికి రాధారవిపై పోటీగా డబ్బింగ్ ఆర్టిస్ట్, గాయని చిన్మయి నామినేషన్ వేయడమే. గతంలో ప్రముఖ రచయిత వైరముత్తు, నటుడు రాధారవిపై 'మీటూ' ఉద్యమంలో భాగంగా లైంగిక వేధింపుల ఆరోపణలు చేశారు చిన్మయి. ఆ తర్వాత డబ్బింగ్ యూనియన్ సభ్యత్వం నుంచి ఆమె తొలగించబడ్డారు. కానీ కోర్టు నుంచి ఇంటర్న్ ఆర్డర్ (చిన్మయిని యూనియన్ సభ్యురాలిగా పరిగణించాలి) తెచ్చుకున్నారు చిన్మయి. ఆ తర్వాతే రామరాజ్యం పార్టీ తరఫున డబ్బింగ్ యూనియన్ ప్రెసిడెంట్ పదవికి నామినేషన్ వేశారామె. అయితే చిన్మయి నామినేషన్ తిరస్కరణకు గురయింది. దాంతో రాధారవి ప్రెసిడెంట్ పదవికి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ''ఎలక్షన్ కమిషనర్ నేను సభ్యురాలిని కాదని నామినేషన్ తిరస్కరించారు. నా వద్ద కోర్ట్ ఇంటర్న్ ఆర్డర్ ఉన్నప్పటికీ ఎందుకు సభ్యురాలిగా పరిగణించలేదో అర్థం కావడం లేదు. ఎవరి సూచనల మేరకు ఈ పని చేశారు? రాధారవి ఆజ్ఞ మేరకా? ఈ విషయంపై న్యాయపరంగా పోరాడతాను'' అని ట్వీటర్‌లో పేర్కొన్నారు చిన్మయి.

# అభ్యంతరకర పోస్టర్లను తొలగిస్తున్నాం


• శ్రీనివాసరావు, నరసింహ నంది, బాపిరాజు

''డిగ్రీ కాలేజ్' సినిమా పోస్టర్లలో కొన్ని అభ్యంతరకరంగా ఉన్నాయని విద్యార్థి సంఘాల నాయకులు, మహిళలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై పోలీసులు స్టేషన్‌కి పిలిపించి అభ్యంతరకర పోస్టర్స్‌ను తొలగించమని చెప్పారు. నన్ను అరెస్ట్ చేశారని వస్తున్న వార్తల్లో నిజం లేదు'' అన్నారు నరసింహ నంది. వరుణ్, దివ్యారావు జంటగా శ్రీ లక్ష్మీ నరసింహ సినిమా పతాకంపై నరసింహ నంది స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'డిగ్రీ కాలేజ్' చిత్రం నేడు విడుదలవుతోంది. విలేకరుల సమావేశంలో నరసింహ నంది, డిస్ట్రిబ్యూటర్ బాపిరాజు, సహ నిర్మాతలు ఆలేటి శ్రీనివాసరావు, కొండయ్య మాట్లాడుతూ– ''పోస్టర్లను చూసి సినిమా ఆపేస్తామనడం సమంజసం కాదు. అభ్యంతరకరంగా ఉన్న రెండు పోస్టర్స్‌ను వెంటనే తొలగించే పని మొదలు పెట్టాం. ఈ సినిమా ఆగిపోతే మా జీవితాలు రోడ్డున పడతాయి'' అన్నారు.


• వల్లభ, ఇజా బెల్లా, కేథరిన్, విజయ్ దేవరకొండ, రాశీ ఖన్నా, కెయస్ రామారావు, క్రాంతి మాధవ్

# నా చివరి ప్రేమ కథ ఇదే

- విజయ్ దేవరకొండ

''నా గత చిత్రాలన్నింటిలో 'వరల్డ్ ఫేమస్ లవర్' సినిమా కోసమే ఎక్కువ కష్టపడ్డా. ఈ సినిమాకి నేనేం హడావిడి చెయ్యలేదు. ఈ ట్రైలర్‌తో బయట హడావిడి స్టార్ట్ అవుతుంది. నా చివరి ప్రేమ కథా చిత్రమిది'' అని విజయ్ దేవరకొండ అన్నారు. క్రాంతి మాధవ్ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ హీరోగా నటించిన చిత్రం 'వరల్డ్ ఫేమస్ లవర్'. రాశీఖన్నా, ఐశ్వర్యా రాజేష్, కేథరిన్, ఇజాబెల్లే లెయితే కథానాయికలుగా నటించారు. కె.ఎస్. రామారావు సమర్పణలో క్రియేటివ్ కమర్షియల్స్ పతాకంపై కె.ఎ. వల్లభ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్ విడుదల చేశారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ– ''మనిషిగా కొంచెం మారుతున్నా.. టేస్టులు కొంచెం మారుతున్నాయి. లైఫ్‌లో కొత్త దశలోకి వెళ్తున్నా. ఈ సినిమా చేస్తున్నప్పుడే ఇదే నా చివరి ప్రేమ కథా చిత్రం అని తెలిసిపోయింది. అందుకే ఈ సినిమాని పూర్తిగా ప్రేమతో నింపేశాం. ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలి. క్రాంతి మాధవ్‌కు పెద్ద సక్సెస్ రావాలి'' అన్నారు. ''వరల్డ్ ఫేమస్ లవర్' తెలుగు ప్రేక్షకుల సినిమాలా ఉండదు.. హాలీవుడ్, హిందీ సినిమాలా ఉంటుంది. ప్రతి సినిమా లవర్‌కి మా చిత్రం నచ్చుతుంది'' అన్నారు కె.ఎస్. రామారావు. 'మళ్లీ మళ్లీ ఇది రానిరోజు' తర్వాత ఈ బ్యానర్‌లో ఇది నా రెండో సినిమా. ఈ సినిమాలో అందరూ తమ పాత్రల్లో జీవించారు'' అన్నారు క్రాంతి మాధవ్. ''ఇప్పటి వరకూ నేను చేసిన సినిమాల్లో, చేసిన పాత్రల్లో ఈ సినిమాలోని యామిని పాత్ర బెస్ట్'' అన్నారు రాశీఖన్నా. ''ఈ సినిమాలో స్మిత అనే భిన్నమైన పాత్ర చేశా'' అన్నారు కేథరిన్. ''ఈ చిత్రంలో నటించినందుకు సంతోషంగా ఉంది'' అన్నారు ఇజా బెల్లా.

# ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నా


• నందు

''నేను ఇండస్ట్రీకి వచ్చి 13 ఏళ్లవుతోంది. ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నా. యూట్యూబ్ వచ్చిన తర్వాత అయితే ఇష్టం వచ్చినట్లు.... ఆత్మగౌరవాన్ని అహంలా భావించేవాడు నా స్థానంలో ఉండి ఉంటే సూసైడ్ చేసుకోవాలేమో. నాకు డబ్బు కన్నా.. గౌరవం ముఖ్యం. ఫలితంతో సంబంధం లేకుండా ఇండస్ట్రీలో నా పదమూడేళ్ల స్ట్రగుల్‌కు 'సవారి' చిత్రం నాకు గౌరవాన్ని తెచ్చిపెడుతుందని అనుకుంటున్నాను (చెమర్చిన కళ్లతో)'' అన్నారు నందు. సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో నందు, ప్రియాంకా శర్మ జంటగా నిషాంక్ రెడ్డి కుడితి, సంతోష్ మోత్కూరి నిర్మించిన 'సవారి' నేడు విడుదవుతోంది. ఈ సందర్భంగా నందు మాట్లాడుతూ – ''సాహిత్ మోత్కూరి 'సవారి' కథ చెప్పారు. బాగా నచ్చింది. కానీ సినిమాలో నాది సెకండ్ లీడ్ రోల్ అన్నారు. అసలు నన్నెందుకు హీరోగా ఊహించుకోలేకపోతున్నారనే బాధ కలిగింది. హీరోగా నటిస్తానని చెబితే సరే అన్నారు. ప్రాణం పెట్టి సినిమా చేశాం. యూఎస్‌లో మూడు ప్రీమియర్ షోలు సోల్డ్ అవుట్ అయ్యాయి'' అన్నారు.

### పాత్రను చంపను!

కెరీర్ మొదట్లో సర్వైవల్ కోసం కొన్ని సినిమాలు చేశాను. ఒక్కో మెట్టు ఎక్కుతూ ఇంత దూరం వచ్చాను. నందు ఏ పాత్ర అయినా చేయగలడు అంటున్నారు. కానీ నా కోసం పాత్ర రాయడం లేదు. నాకు ఇచ్చిన పాత్రను నా యాక్టింగ్‌తో చంపను. వీలైనంత బాగా చేయడానికే ట్రై చేస్తా.

# ఇప్పుడే హీరో ట్యాగ్ వద్దు


• సుధీర్

''ప్రేక్షకులకు వినోదం పంచాలని ఇండస్ట్రీకి వచ్చాను. టీవీ, సిల్వర్ స్క్రీన్, యూట్యూబ్ చానెల్ ఇలా ప్లాట్‌ఫామ్ ఏదైనా పర్లేదు'' అన్నారు 'సుడిగాలి' సుధీర్. 'జబర్దస్త్' ఫేమ్ 'సుడిగాలి' సుధీర్, 'గెటప్' శ్రీను, రాంప్రసాద్ ప్రధాన తారాగణంగా అనిల్ కుమార్ జి. దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం '3 మంకీస్'. నగేష్. జి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదల అవుతోంది. ఈ సందర్భంగా 'సుడిగాలి' సుధీర్ మాట్లాడుతూ– ''ఈ సినిమాలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పాత్ర చేశా. మా సినిమాకి ఊహించిన స్థాయిలో థియేటర్స్ రాకపోవడంతో కాస్త ఆందోళనగా ఉన్నాం. చిరంజీవిగారు మా ట్రైలర్ చూసి చాలా బాగుందన్నారు. ఫ్యామిలీతో కలిసి సినిమా చూస్తానన్నారు. నేను హీరోగా చేసిన 'సాఫ్ట్‌వేర్ సుధీర్'కి మంచి వసూళ్లు వచ్చాయి. దానికి కారణం నేను ఫ్యామిలీలా భావించే నా ఫ్యాన్సే. హీరోగా ఓ సినిమా కమిట్ అయ్యాను. హీరోగా సినిమాలు చేస్తున్నప్పటికీ ఇప్పుడే హీరో అనే ట్యాగ్ వద్దు'' అన్నారు.












సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
శుక్రవారం ॥ 7-2-2020
ఫ్యాషన్

# స్క్రీన్ శారీస్

సినిమా హీరోయిన్స్ షూటింగ్ కోసం ఉపయోగించే డ్రస్సులను కాస్ట్యూమ్స్ అంటారు. ఈ రోజుల్లో కాస్ట్యూమ్స్‌లో చీర ఉండట్లేదు. మోడ్రన్ దుస్తులే డామినేట్ చేస్తున్నాయి. అందుకే బాలీవుడ్ హీరోయిన్లు ఇటీవల 'ఉమంగ్ 2020' పేరుతో ముంబై పోలీసులు తమ వెల్‌ఫేర్ ఫండ్ కోసం నిర్వహించిన అవార్డ్స్ ఫంక్షన్‌లో చీర కట్టుకుని అభిమానులను ఆకట్టుకున్నారు. స్క్రీన్ గాడెస్‌లు కట్టిన శారీస్ ఇవి.







బ్యూటిప్స్

ఈ కాలం వాతావరణం కాస్త చలి, మరి కాస్త ఎండ ఉంటుంది. దీనివల్ల చర్మం త్వరగా తేమను కోల్పోయి పొడిబారుతుంది. మృతకణాలూ ఏర్పడతాయి. ఫలితంగా చర్మం జీవకళను కోల్పోతుంది. ఈ సమస్యకు విరుగుడుగా...

# చర్మకాంతికి

## ఆరెంజ్ జ్యూస్, రాతి ఉప్పు



టేబుల్ స్పూన్ చొప్పున ఆరెంజ్ జ్యూస్, నిమ్మరసం తీసుకొని కప్పు పెరుగులో కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి, ఆరనివ్వాలి. తర్వాత తడి క్లాత్ లేదా టిష్యూతో తుడిచేయాలి. మృతకణాల సంఖ్య తగ్గి చర్మం కాంతిమంతంగా కనిపిస్తుంది.

టీ స్పూన్ మినపప్పు, 6 బాదాం పప్పులు కలిపి నీటిలో రాత్రంతా నాబెట్టాలి. ఉదయాన్నే ఈ రెండింటిని మెత్తగా రుబ్బి, ముఖానికి మాస్క్ వేసుకోవాలి. అరగంట తర్వాత శుభ్రపరుచుకోవాలి. చర్మం మృదువుగా, తాజాగా కనిపిస్తుంది.

ఆలివ్ ఆయిల్ రెండు టేబుల్ స్పూన్లు, రాతి ఉప్పు టేబుల్ స్పూన్ చొప్పున తీసుకొని, శరీరానికి పట్టించి, మృదువుగా రాయాలి. ఇలా చేయడం వల్ల చర్మంపై మృతకణాలు సులువుగా తొలగిపోతాయి. ఆలివ్ ఆయిల్ చర్మకాంతిని పెంచుతుంది.

బాడీ బ్రష్ మార్కెట్‌లో లభిస్తుంది. ఈ బ్రష్ కుచ్చులు చాలా మెత్తగా ఉంటాయి. స్నానం చేసే సమయంలో ఈ బ్రష్‌తో మృదువుగా చర్మంపై రబ్ చేస్తే మురికి, మృతకణాలు తగ్గుతాయి.

అవగాహన

# కరోనా వర్సెస్ కామన్ కోల్డ్

**ఇప్పుడంతా ప్రతివారూ కరోనా వైరస్ గురించే మాట్లాడుతున్నారు. అది కరోనా అయినా కామన్‌కోల్డ్ అయినా కనిపించే లక్షణాలన్నీ మామూలుగా జలుబు చేసినప్పుడు కనిపించేవే. కరోనా వైరస్‌కైనా భవిష్యత్తులో వ్యాక్సిన్ కనుగొనగలమేమోగానీ... కామన్‌కోల్డ్‌కు మాత్రం ఆ అవకాశం ఉండదు. మందు లేని ఈ వ్యాధి ప్రాణాపాయం ఏమీ కల్పించదుగానీ... అది పెట్టే ఇబ్బంది అంతా ఇంతా కాదు. కరోనా అయినా కామన్ కోల్డ్ అయినా ఇవ్వాల్సిన చికిత్స ఒక్కలాంటిదే కాబట్టి జలుబు గురించి కాస్తంత మాట్లాడుకుందాం. దీనికి చికిత్స తీసుకుంటే కరోనాకూ తీసుకున్నట్లే కాబట్టి దీని గురించి కూడా తెలుసుకుందాం. ఆందోళన దూరం చేసుకుందాం.**

దగ్గూ, జలుబూ, తుమ్ములూ కనిపించాయంటే పడిశెం పట్టినట్టు ఇట్టే తెలిసిపోతుంది. ఆ మూడు లక్షణాలతో పాటు జ్వరం, ఒళ్లునొప్పులూ, నిస్సత్తువ, నీరసం లాంటి ఇతర లక్షణాలూ కనిపిస్తుంటాయి. జలుబు చేసిందంటే దానికి నిర్దిష్టంగా ఒక వైరస్ మాత్రమే కారణం కాదు. దాదాపు రెండు వందలకు పైగా రకాల వైరస్‌లతో మనకు జలుబు వస్తుంది. ఆ వైరస్‌లతో కనిపిచే లక్షణాల్లోని సమమైన వాటిని గుర్తిస్తూ... గ్రూపులుగా చేస్తే అందులో ఆరు ప్రధానంగా ఉంటాయని తేలింది. అవే... 1) ఇన్‌ఫ్లుయెంజా, 2) పారాఇన్‌ఫ్లుయెంజా, 3) రైనోవైరస్, 4) ప్రస్తుతం లోకాన్ని వణికిస్తున్న కరోనా వైరస్, 5) ఎడినో వైరస్, 6) హ్యూమన్ రెస్పిరేటరీ సిన్సిషియల్ వైరస్.

### జలుబుకూ, కరోనాకు మందు ఎందుకు లేదంటే...

పైనున్న ఆరు గ్రూపుల్లోకి చేర్చగలిగే సుమారు 200 పైగా వైరస్‌లు దాదాపు ప్రతి పదేళ్లకోమారు తమ యాంటిజెన్ స్వరూపాన్ని మార్చుకుంటూ ఉంటాయి. మాటిమాటికీ వేషం మార్చే వ్యక్తిని గుర్తుపట్టలేం కదా. అలాగే మాటిమాటికీ జన్యు స్వరూపాన్ని (యాంటిజెన్ స్వరూపాన్ని) మార్చుకుంటూ ఉంటుంది కాబట్టి ఈ వైరస్‌ను కూడా గుర్తుపట్టడానికి చేసే ప్రయత్నం వల్ల సమయం, సొమ్మూ రెండే వేస్ట్. ఒకవేళ కావాలని పట్టుబట్టి ప్రయత్నం చేసినా ఆ నిర్దిష్టమైన వైరస్‌ను గుర్తించే (ఐసోలేట్ చేసే)లోపే ఆ వ్యాధి రానూ రావడం, పోనూ పోవడం జరిగిపోతుంది. అందుకే... జలుబు కనిపించగానే దాని లక్షణాలను చూసి ఉపశమనం మందులు ఇస్తుంటారు. తీవ్రత ఎక్కువగా ఉన్న కొన్ని సందర్భాల్లో రక్తపరీక్ష చేసి, తెల్లరక్తకణాలు, ప్లేట్‌లెట్ కౌంట్ తగ్గడం చూసి, దాన్ని గుర్తించి, లక్షణాలకు మాత్రం చికిత్స చేస్తుంటారు. అందుకే ఇప్పటికీ జలుబుకు మందు లేదు. ఈ కారణాల వల్లనే కరోనా వైరస్‌కు కూడా. కాకపోతే ఇప్పడది సృష్టించిన ప్రకంపనల కారణంగా... దానికి వ్యాక్సిన్ కనుగొనే ప్రయత్నంలో ప్రపంచమంతా నిమగ్నమై ఉంది.

### జలుబు లక్షణాలివే...

జలుబు చేసినప్పుడు కొద్దిగా జ్వరం, తలనొప్పి,గొంతునొప్పి, ముక్కు లేదా కళ్ల నుంచి నీరుకారడం, ఒళ్లునొప్పులు... ఇవన్నీ కనిపిస్తాయి. కొన్నింటి తీవ్రత చాలా ఎక్కువగా ఉండి చాలా చికాగ్గా ఉంటుంది. సాధారణంగా వైరస్ సోకాక 5–7 రోజుల్లో ఈ లక్షణాలన్నీ తగ్గిపోతాయి. అయితే అరుదుగా కొన్నిసార్లు మాత్రం ఈ వైరస్ ఊపిరితిత్తుల్లోకి ప్రవేశించి నిమోనియాను కలగజేస్తుంది. ప్రస్తుత కరోనా కూడా అంతే. శ్వాసవ్యవస్థ పైన (అప్పర్ రెస్పిరేటరీ ట్రాక్ట్‌లో ఉంటే అది కూడా జలుబు లాగే తగ్గిపోతుంది. కానీ అదే వైరస్ కాస్తంత లోతుకు వెళ్లి శ్వాసవ్యవస్థ కింది భాగానికి (లోయర్ రెస్పిరేటరీ ట్రాక్ట్) వ్యాపిస్తే అది నిమోనియాకు దారితీస్తుంది. ఇలాంటప్పుడే సమస్య తీవ్రమవుతుంది.

### వ్యాపిస్తుందిలా...

అప్పటికే వైరస్‌ను కలిగి ఉన్న వ్యక్తులు దగ్గినప్పుడు, లేదా తుమ్మినప్పుడు గాల్లోకి వ్యాపించే తుంపర్ల ద్వారా ఇది వ్యాపిస్తుంది. ఒకసారి సోకాక 18 నుంచి 72 గంటల్లో దేహం మొత్తానికి వ్యాపిస్తుంది. ప్రధానంగా పిల్లల్లో 18 నెలల కంటే తక్కువ వారిలోనూ, పెద్దవారిలో 65 ఏళ్లు పైబడ్డ వారిలో ఇది వచ్చేందుకు అవకాశం ఎక్కువ... వచ్చాక వ్యాధి తీవ్రతా ఎక్కువే.

### నివారణ...

- మంచి పుష్టికరమైన సమతుల ఆహారం తీసుకుంటూ క్రమం తప్పకుండా ఎక్సర్‌సైజ్ చేస్తుంటే రోగనిరోధక శక్తి పెంపొందుతుంది. దీనివల్ల జలుబే గాక మరెన్నో రుగ్మతలనుంచి రక్షణ లభిస్తుంది.
- జలుబు వచ్చిన వారి నుంచి దూరంగా ఉండాలి. వాళ్ల చేతిరుమాళ్లు వంటి వస్తువులను ఇతరులు వాడకూడదు.

### చికిత్స... చిట్కాలు

జలుబు తనంతట తానే తగ్గిపోయే (సెల్ఫ్ లిమిటింగ్) రుగ్మత. చికిత్స కేవలం ఉపశమనం మాత్రమే. ఈ వైరస్‌కు విరుగుడుగా యాంటీవైరల్ మందులు ఇవ్వడం వల్ల ప్రయోజనం ఉండదు. అయితే జలుబు తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు ఆయా లక్షణాలను తగ్గించడం కోసం... జ్వరానికి పారాసిటమాల్, ముక్కులు పట్టేసినప్పుడు డీకంజెస్టెంట్స్, నేసల్ డ్రాప్స్ వాడవచ్చు. గొంతునొప్పి, గొంతులో గరగర వంటి వాటికి లోజెంజెస్ వాడవచ్చు. థ్రోట్ గార్గల్ (పుక్కిలించడం) చేయవచ్చు. ఆ సమయాల్లో జ్వరం ఉందని 'లంఖణం పరమౌషధం' అంటూ ఉపవాసాలు సరికాదు. ఒక్కోసారి జలుబుతో జ్వరం వచ్చి తగ్గిపోయాక కూడా ఇంకా నీరసం, నిస్సత్తువ ఉంటాయి. దాన్నే 'పోస్ట్ పైరెక్సియల్ డెబిలిటీ' అంటారు. అలాంటిది ఉన్నా... లేక జలుబు ఉన్నప్పుడైనా... శక్తి తగ్గుతుంది కాబట్టి మంచి పుష్టికరమైన ఆహారం తీసుకోవాలి. నీళ్లు, ద్రవాహారం ఎక్కువగా తీసుకోవాలి.

ఇక చిట్కాల విషయానికి వస్తే... జలుబు ఉపశమనం కోసం చిట్కాలూ ఎన్నెన్నో. ఉదాహరణకు... వేడినీటిలో యూకలిప్టస్ ఆయిల్ వంటివి వేసి ఆవిరి పట్టడం, కొన్ని పూతమందులు, వేడి వేడి పాలల్లో మిరియాలు వేసి తాగించడం, మాంసాహారులైతే వేడి వేడి చికెన్ సూప్ తాగించడం వంటివి చేయవచ్చు. అవన్నీ అనాదిగా అనూచానంగా ఆచరిస్తూ వస్తున్న విషయాలే. వాటన్నింటితోనూ ప్రయోజనం లేనప్పుడూ, జలుబు వచ్చి వారం దాటినా తగ్గనప్పుడు డాక్టర్‌ను తప్పక సంప్రదించాలి.





- డాక్టర్ జి. నవోదయ, కన్సల్టెంట్, జనరల్ మెడిసన్, కేర్ హాస్పిటల్స్, బంజారాహిల్స్, హైదరాబాద్

ఆభరణం

# వేలి పై వనలోకం



వనజీవులన్నీ వేలిమీద ఆభరణమై వచ్చి చేరితే ఇలా అందమైన లోకం రూపు కడుతుంది. సింహాలు, పులులు, డేగలు, గబ్బిలాలు, గుడ్లగూబలు మగవారి ఆభరణమైతే.. చిలుకలు, పిచుకలు, నెమళ్లు, నత్తలు స్త్రీల వేలి మీద చేరి సరికొత్తగా మెరుస్తున్నాయి. ఆభరణాల డిజైనర్లు మరికాస్త ముందుకెళ్లి పక్షి గూడు, గుంపు.. అంటూ వనజీవనాన్ని కళ్లకు కడుతున్నారు. ఈ డిజైనర్ ఆభరణాలు అటు ఫ్యాషన్ జువెల్రీలోనూ... ఇటు వెండి, బంగారు, వజ్రాభరణాలలోనూ తళుక్కుమంటున్నాయి. అంటే వందల రూపాయల నుంచి వెలకట్టలేనంత విలువైన ఆభరణాలలో వన్యప్రాణులు కొంగొత్త కళతో ఊపిరిపోసుకుంటున్నాయన్నమాట.



epaper.sakshi.com

సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
స్పర్ధయా వర్ధతే విద్య
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com
శుక్రవారం
7-2-2020

**బ్యాంకింగ్ కొలువులే లక్ష్యంగా ఎదురుచూస్తున్న అభ్యర్థుల కోసం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్).. 2020 సంవత్సరానికి ఎగ్జామ్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. ఆర్ఆర్‌బీలు, పీఎస్‌యూల్లో పీవోలు, క్లర్క్స్, ఎస్‌వో పోస్టుల ఎంపిక ప్రక్రియలో భాగంగా..నిర్వహించనున్న పరీక్షల తేదీలను ప్రకటించింది. ఈ నేపథ్యంలో.. ఐబీపీఎస్ పరీక్షల క్యాలెండర్, ఎంపిక విధానం, సిలబస్, ప్రిపరేషన్‌పై ప్రత్యేక కథనం..**




- ✓ పరీక్షల క్యాలెండర్-2020 విడుదల చేసిన ఐబీపీఎస్
- ✓ ఆర్ఆర్‌బీలు, పీఎస్‌బీల్లో పోస్టుల భర్తీకి షెడ్యూల్
- ✓ పీవోలు, క్లర్క్స్, ఎస్‌వో పోస్టులకు వెలువడనున్న నోటిఫికేషన్లు

# బ్యాంకు కొలువుల కాలం

### ఐబీపీఎస్ ఎంపిక ప్రక్రియ చేపట్టే బ్యాంకులు

- ఆర్ఆర్‌బీ (రీజినల్ రూరల్ బ్యాంక్‌లు),
- పీఎస్‌బీ (పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు).
- **ఐబీపీఎస్ భర్తీ చేపట్టే పోస్టులు:** పీవోలు, క్లర్క్స్, ఎస్‌వోలు

## ఆర్ఆర్‌బీలు (రీజినల్ రూరల్ బ్యాంక్‌లు)

- గ్రామీణ బ్యాంకుల్లో ఖాళీల భర్తీలో భాగంగా ఐబీపీఎస్ నియామక ప్రక్రియ చేపడుతుంది. ఇందులో మొత్తం నాలుగు వేర్వేరు రకాల పోస్టులు ఉన్నాయి.
  » ఆఫీసర్ స్కేల్-1, ఆఫీసర్ అసిస్టెంట్, ఆఫీసర్ స్కేల్-2, ఆఫీసర్ స్కేల్-3 పోస్టుల భర్తీని చేపడుతుంది.
- **పోస్టు:** ఆఫీసర్ స్కేల్-1, ఆఫీసర్ అసిస్టెంట్ పోస్టులకు అర్హత ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత.
- **వయసు:** స్కేల్-1 పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 18-30 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలి.
  » ఆఫీసర్ అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 18-28 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలి.
- **పరీక్ష, విధానం:** ఆఫీసర్ స్కేల్-1, ఆఫీసర్ అసిస్టెంట్.. ఈ రెండింటికి తొలిదశలో ప్రిలిమినరీ పరీక్షలు ఆన్‌లైన్ విధానం (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) లోనే నిర్వహిస్తారు. మొత్తం 80 ప్రశ్నలకు గాను 80 మార్కులు కేటాయిస్తారు. పరీక్ష సమయం 45 నిమిషాలు.

### ప్రిలిమ్స్

| సబ్జెక్ట్ | ప్రశ్నలు | మార్కులు |
|---|---|---|
| రీజనింగ్ | 40 | 40 |
| న్యూమరికల్ ఎబిలిటీ | 40 | 40 |

### మెయిన్

ఈ పరీక్షకు 200 మార్కులు కేటాయించారు. పరీక్ష సమయం 120 నిమిషాలు (2 గంటలు).

| సబ్జెక్ట్ | ప్రశ్నలు | మార్కులు |
|---|---|---|
| రీజనింగ్ | 40 | 50 |
| న్యూమరికల్ ఎబిలిటీ | 40 | 50 |
| జనరల్ అవేర్‌నెస్ | 40 | 40 |
| ఇంగ్లిష్ లాంగ్వేజ్ | 40 | 40 |
| కంప్యూటర్ నాలెడ్జ్ | 40 | 20 |

- **నెగిటివ్ మార్కులు:** ఈ పరీక్షల్లో నెగిటివ్ మార్కులు ఉన్నాయి. ప్రతీ తప్పు సమాధానానికి నాల్గో వంతు మార్కుల కోతను విధిస్తారు.
- **స్కేల్-2, స్కేల్-3:** ఈ పరీక్షలకు సంబంధించి పూర్తిస్థాయి నోటిఫికేషన్ విడుదల చేశాక.. అభ్యర్థుల వయోపరిమితి, అవసరమైన విద్యార్హతల వివరాలను వెల్లడిస్తారు. ఈ స్కేల్-2, స్కేల్-3 ఉద్యోగాలకు సంబంధించి అగ్రికల్చర్ ఫీల్డ్ ఆఫీసర్, ట్రెజరర్ ఆఫీసర్, ఐటీ ఆఫీసర్, లా ఆఫీసర్, మార్కెటింగ్ సహా వివిధ ఆఫీసర్ స్థాయి పోస్టులను భర్తీ చేస్తారు.
- **ఎంపిక విధానం:** స్కేల్-1 పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ప్రిలిమ్స్, మెయిన్, ఇంటర్వ్యూలను నిర్వహించి తుదిఎంపిక చేస్తారు. అలాగే ఆఫీసర్ అసిస్టెంట్ పోస్టులకు ప్రిలిమ్స్, మెయిన్ (ఇంటర్వ్యూలు ఉండదు) రెండు దశల్లో మాత్రమే పరీక్షలను నిర్వహించి.. విజేతలను ప్రకటిస్తారు. స్కేల్-2, స్కేల్-3 అభ్యర్థులకు మాత్రం సింగిల్ ఎగ్జామ్, ఇంటర్వ్యూలను నిర్వహించి విజేతల జాబితా ప్రకటిస్తారు.

### ముఖ్యమైన తేదీలు

- **ఆఫీసర్ స్కేల్-1, ఆఫీసర్ అసిస్టెంట్(ప్రిలిమ్స్):** పరీక్ష తేదీలు: 2020 ఆగస్టు 1, 2, 8, 9, 16 తేదీల్లో
- **ఆఫీసర్ స్కేల్-1 (మెయిన్) పరీక్ష తేదీలు:** 13-09-2020
- **ఆఫీసర్ అసిస్టెంట్ (మెయిన్) పరీక్ష తేదీలు:** 19-09-2020
- **ఆఫీసర్స్ స్కేల్-2, స్కేల్-3:** పరీక్ష తేదీ: 13-09-2020

## ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీలు)

**ఎస్**బీఐ తప్ప ఇతర ప్రభుత్వరంగ బ్యాంకుల్లోని వివిధ రకాల పోస్టులను భర్తీ చేసేందుకు ఐబీపీఎస్ ఏటా ఎంపిక ప్రక్రియ చేపడుతుంది. పీవో (ప్రొబేషనరీ ఆఫీసర్స్), క్లర్క్, ఎస్‌వో(స్పెషలిస్ట్ ఆఫీసర్స్) పోస్టుల భర్తీచేయనుంది. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ప్రిలిమ్స్, మెయిన్, ఇంటర్వ్యూలను నిర్వహించి తుది ఎంపిక చేస్తుంది.

### పీవో (ప్రొబేషనరీ ఆఫీసర్)

బ్యాంకుల్లో లావాదేవీలను పర్యవేక్షించడం, వినియోగదారులకు రుణాల మంజూరు, బ్యాంకుల్లో డిపాజిట్లు సహా ఇతర బ్యాంకు కార్యకలాపాల నిర్వహణ చూసే కీలక అధికారులు ప్రొబేషనరీ ఆఫీసర్లు. వీరిని పీవోలు అంటారు. పీవో పోస్టుల భర్తీకి ఐబీపీఎస్ మొత్తం మూడంచెల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తుంది. ప్రిలిమ్స్, మెయిన్, ఇంటర్వ్యూలు నిర్వహించి తుది జాబితా ప్రకటిస్తారు. పీవో పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హత ఏదైనా డిగ్రీ.



- **వయసు:** 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు వయో సడలింపు లభిస్తుంది.
- **ప్రిలిమ్స్:** పీవో ఎంపిక ప్రక్రియలో తొలిదశ పరీక్ష ప్రిలిమ్స్. ఇది ఆన్‌లైన్ విధానం(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్)లో జరుగుతుంది. ఈ పరీక్షలో మూడు విభాగాల నుంచి మొత్తం 100 ప్రశ్నలకు గాను 100 మార్కులు ఉంటాయి. పరీక్ష సమయం గంట(60 నిమిషాలు). నెగిటివ్ మార్కింగ్ విధానం ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కుల కోత విధిస్తారు. ప్రిలిమ్స్ పరీక్షల్లో కటాఫ్ మార్కులు సాధించిన వారిని మాత్రమే మెయిన్‌కు అనుమతిస్తారు.

| సబ్జెక్ట్ | ప్రశ్నలు | మార్కులు | సమయం |
|---|---|---|---|
| ఇంగ్లిష్ | 30 | 30 | 20 ని. |
| క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ | 35 | 35 | 20 ని. |
| రీజనింగ్ ఎబిలిటీ | 35 | 35 | 20 ని. |

- **మెయిన్:** 200 మార్కులకు నిర్వహించే మెయిన్ పరీక్షలో రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ అనాలసిస్,జనరల్ అవేర్‌నెస్/ ఎకానమీ/ బ్యాంకింగ్ అవేర్‌నెస్‌పై ప్రశ్నలు ఉంటాయి.

| సబ్జెక్ట్ | ప్రశ్నలు | మార్కులు | సమయం |
|---|---|---|---|
| రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ | 45 | 60 | 60 ని. |
| ఇంగ్లిష్ లాంగ్వేజ్ | 35 | 40 | 40 ని. |
| డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ అనాలసిస్ | 35 | 60 | 45 ని. |
| జనరల్/ఎకానమీ/ బ్యాంకింగ్ అవేర్‌నెస్ | 40 | 40 | 35 ని. |

- పైన పేర్కొన్న పరీక్ష పూర్తయిన వెంటనే ఇంగ్లిష్ డిస్క్రిప్టివ్ పరీక్షను నిర్వహిస్తారు. లెటర్ రైటింగ్ అండ్ ఎస్సే రైటింగ్‌పై ఈ పరీక్ష జరుగుతుంది. మొత్తం 25 మార్కులకు గాను 30 నిమిషాల పరీక్ష సమయాన్ని కేటాయిస్తారు.
- **నెగిటివ్ మార్కులు:** పీవో మెయిన్ పరీక్షల్లో నెగిటివ్ మార్కుల విధానం ఉంది. ప్రతీ తప్పు సమాధానానికి సదరు ప్రశ్నకు కేటాయించిన మార్కుల్లో నాల్గో వంతు(0.25) మార్కుల కోతను విధిస్తారు.
- **ఇంటర్వ్యూ:** మెయిన్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు 100 మార్కులకు ఇంటర్వ్యూలను నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభ చూపిన అభ్యర్థులను తుది ఎంపిక చేస్తారు.

### ముఖ్య తేదీలు

- **పీవో ప్రిలిమ్స్ పరీక్ష తేదీలు:** 2020 అక్టోబర్ 3, 4, 10 తేదీల్లో జరుగుతాయి.
- **పీవో మెయిన్ పరీక్ష తేదీ:** 28-11-2020

## ఐబీపీఎస్ క్లర్క్

ఐబీపీఎస్ క్లర్క్ ఎంపిక ప్రక్రియలో ప్రిలిమ్స్, మెయిన్ అనే రెండు దశలు ఉంటాయి. క్లర్క్ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హత ఏదైనా డిగ్రీ. వయసు 20-28 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

- **ప్రిలిమ్స్ పరీక్ష:** క్లర్క్ ప్రిలిమినరీ పరీక్ష ఆన్‌లైన్ విధానం(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్)లో జరుగుతుంది. ఈ పరీక్షలో మూడు విభాగాల నుంచి మొత్తం 100 ప్రశ్నలకుగాను 100 మార్కులు ఉంటాయి. పరీక్ష సమయం గంట(60 నిమిషాలు). నెగిటివ్ మార్కుల విధానం ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కుల కోత విధిస్తారు. ప్రిలిమ్స్ పరీక్షల్లో కటాఫ్ మార్కులు సాధించిన వారిని మాత్రమే మెయిన్‌కు అనుమతిస్తారు.
- **మెయిన్ పరీక్ష:** ఈ పరీక్షను ఆన్‌లైన్(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 190 ప్రశ్నలకుగాను 200 మార్కులకు పరీక్ష జరుగుతుంది. మెయిన్‌కు కేటాయించిన సమయం 160 నిమిషాలు.

| సబ్జెక్ట్ | ప్రశ్నలు | మార్కులు | సమయం |
|---|---|---|---|
| రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ | 50 | 60 | 45 ని. |
| క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ | 50 | 50 | 45 ని. |
| ఇంగ్లిష్ లాంగ్వేజ్ | 40 | 40 | 35 ని. |
| జనరల్/ఎకానమి/ ఫైనాన్షియల్ అవేర్‌నెస్ | 50 | 50 | 35 ని. |

- **నెగిటివ్ మార్కులు:** ఈ పరీక్షలోనూ నెగిటివ్ మార్కుల విధానం అమల్లో ఉంది. ప్రతి తప్పు సమాధానానికి సదరు ప్రశ్నకు కేటాయించిన మార్కుల నుంచి నాల్గోవంతు మార్కుల కోతను విధిస్తారు.

### ముఖ్య తేదీలు

- **క్లర్క్ ప్రిలిమ్స్ పరీక్ష తేదీలు:** 2020 డిసెంబర్ 12, 13, 19 తేదీల్లో
- **క్లర్క్ మెయిన్ పరీక్ష తేదీ:** 24.01.2021

## ఎస్‌వో (స్పెషలిస్ట్ ఆఫీసర్స్)

**బ్యాం**కింగ్ రంగంలో ప్రత్యేకమైన విధుల నిర్వహణ కోసం ఎస్‌వోల నియామకాలు జరుగుతాయి. ఈ పరీక్షను మొత్తం మూడంచెల్లో నిర్వహిస్తారు. ప్రిలిమ్స్, మెయిన్, పర్సనల్ ఇంటర్వ్యూలను నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **పోస్టులు:** » రాజ్ భాషా అధికారి » అగ్రికల్చర్ ఫీల్డ్ ఆఫీసర్ » లా ఆఫీసర్ » మార్కెటింగ్ ఆఫీసర్ » ఐటీ ఆఫీసర్ » హెచ్ఆర్ ఆఫీసర్.
- **అర్హతలు:** వయసు, విద్యార్హతల వివరాలను పూర్తిస్థాయి నోటిఫికేషన్‌లో వెల్లడిస్తారు.
- **ప్రిలిమ్స్ పరీక్ష విధానం:** ఈ పరీక్షను మొత్తం 150 ప్రశ్నలకు-125 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష సమయం 120 నిమిషాలు (రెండు గంటలు).
- ఎస్‌వోలలో వేర్వేరు పోస్టులు ఉండటంతో ప్రిలిమ్స్ పరీక్ష విధానం కూడా భిన్నంగా ఉంటుంది.
- **ప్రిలిమ్స్(ఐటీ ఆఫీసర్, అగ్రికల్చర్, హెచ్ఆర్ / పర్సనల్, మార్కెటింగ్ ఆఫీసర్):**

| సబ్జెక్ట్ | ప్రశ్నలు | మార్కులు | సమయం |
|---|---|---|---|
| ఇంగ్లిష్ | 50 | 25 | 40 ని. |
| రీజనింగ్ ఎబిలిటీ | 50 | 50 | 40 ని. |
| క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ | 50 | 50 | 40 ని. |

- **మెయిన్ (ఐటీ ఆఫీసర్, అగ్రికల్చర్, హెచ్ఆర్ /పర్సనల్, మార్కెటింగ్ ఆఫీసర్):** ప్రిలిమ్స్‌లో పేర్కొన్న సబ్జెక్టులే మెయిన్‌లోనూ ఉంటాయి. మొత్తం 60 ప్రశ్నలకు గాను 60 మార్కులకు ఈ పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయం 45 నిమిషాలు.
- **ప్రిలిమ్స్ (లా ఆఫీసర్, రాజభాష అధికారి): ఇది 150 ప్రశ్నలు, 125 మార్కులకు ఉంటుంది.**

| సబ్జెక్ట్ | ప్రశ్నలు | మార్కులు | సమయం |
|---|---|---|---|
| రీజనింగ్ | 50 | 50 | 40 ని. |
| ఇంగ్లిష్ | 50 | 25 | 40 ని. |
| జనరల్ అవేర్‌నెస్ (బ్యాంకింగ్ అవేర్‌నెస్) | 50 | 50 | 40 ని. |

- **మెయిన్ (రాజ్ భాషా అధికారి):** ప్రొఫెషనల్ నాలెడ్జ్‌కు సంబంధించి ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ విధానంలో పరీక్షను నిర్వహిస్తారు.

| సబ్జెక్ట్ | ప్రశ్నలు | మార్కులు | సమయం |
|---|---|---|---|
| ప్రొఫెషనల్ నాలెడ్జ్ (ఆబ్జెక్టివ్ విధానం) | 45 | 60 | 30 ని. |
| ప్రొఫెషనల్ నాలెడ్జ్ (డిస్క్రిప్టివ్ విధానం) | 2 | - | 30 ని. |

- **నెగిటివ్ మార్కులు:** ఈ పరీక్షలో నెగిటివ్ మార్కుల విధానం ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ప్రశ్నకు కేటాయించిన మార్కుల నుంచి నాల్గోవంతు మార్కుల కోతను విధిస్తారు.
- **ఇంటర్వ్యూ:** మెయిన్ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇది మొత్తం 100 మార్కులకు ఉంటుంది. ఇందులో ప్రతిభ కనబర్చిన అభ్యర్థులను తుది ఎంపిక చేస్తారు.



- **ఎస్‌వో ప్రిలిమ్స్ పరీక్ష తేదీలు:** 2020 డిసెంబర్ 26, 27 తేదీల్లో
- **ఎస్‌వో మెయిన్ పరీక్షతేదీ:** 30.01.2021

## సిలబస్.. ప్రిపరేషన్

ఐబీపీఎస్ భర్తీ చేసే పోస్టులు అన్నింటిలోనూ ఇంగ్లిష్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ ఎబిలిటీ, జనరల్ నాలెడ్జ్, బ్యాంకింగ్ అవేర్‌నెస్, కంప్యూటర్ నాలెడ్జ్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

### ఇంగ్లిష్

ఐబీపీఎస్ భర్తీచేసే అన్ని పోస్టుల్లో ఇంగ్లిష్ ముఖ్యమైన సబ్జెక్ట్. ఇందులో రీడింగ్ కాంప్రహెన్షన్, స్పాటింగ్ ద ఎర్రర్స్, సినానిమ్స్, ఆంటోనిమ్స్, ఫిల్ ఇన్ ది బ్లాంక్స్, జంబుల్ వర్డ్స్, పారా జంబుల్స్, క్లోజ్ టెస్ట్, ఇడియమ్స్ అండ్ ఫ్రేసెస్, ఫ్రేసెస్, గ్రామర్ ముఖ్యమైనవి. వీటి మీద పట్టు పెంచుకుంటే.. ఇంగ్లిష్‌లో మంచి స్కోర్ సాధించొచ్చు. ముఖ్యంగా వొకాబ్యులరీ, రీడింగ్ కాంప్రెహెన్షన్, గ్రామర్‌పై అభ్యర్థి అవగాహనను పరీక్షించే విధంగా ఎక్కువగా ప్రశ్నలు వస్తున్నాయి. దీంతోపాటు సినానిమ్స్, ఆంటోనిమ్స్, సెంటెన్స్ కరెక్షన్, సెంటెన్స్ రీ అరేంజ్‌మెంట్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూట్స్‌పై పట్టు పెంచుకోవాలి. ఇంగ్లిష్ విభాగంలో కేవలం గ్రామర్‌కే పరిమితం కాకుండా.. జనరల్ ఇంగ్లిష్ నైపుణ్యాలు పెంచుకోవడానికి ప్రయత్నం చేయాలి.

### క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

ఈ విభాగం నుంచి సింప్లిఫికేషన్స్, అప్రాక్సిమేట్ వాల్యూస్, నంబర్ సిరీస్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, డేటా సఫిషియన్సీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్, పర్ముటేషన్-కాంబినేషన్స్, ప్రాబబిలిటీ సహా ఇతర అర్థమెటిక్ అంశాల నుంచి ప్రశ్నలను అడుగుతారు. ఈ విభాగంలో ప్రశ్నలన్నీ ప్రధానంగా హైస్కూల్ స్థాయి మ్యాథమెటిక్స్‌పై ఉంటాయి. అర్థమెటిక్‌కు సంబంధించి పర్సంటేజెస్, యావరేజెస్, రేషియో-ప్రపోర్షన్, ప్రాఫిట్-లాస్, సింపుల్ ఇంట్రెస్ట్-కాంపౌండ్ ఇంట్రెస్ట్, టైమ్ -వర్క్, టైమ్-డిస్టెన్స్, పర్ముటేషన్స్-కాంబినేషన్స్, ప్రాబబిలిటీ, మిక్చర్ అండ్ అలిగేషన్స్, పార్టనర్‌షిప్ విభాగాలు కీలకం. సింప్లిఫికేషన్స్‌కు బోడ్‌మస్ రూల్స్‌కు సంబంధించి ఎక్కువ ప్రాక్టీస్ చేయాలి. సంఖ్యల వర్గాలు, ఘనాలు గుర్తుంచుకోవాలి. ఫలితంగా సింప్లిఫికేషన్స్ సాధించడం సులువు అవుతుంది.

### డేటా అనాలసిస్

డేటా ఇంటర్‌ప్రెటేషన్, టేబుల్స్, డయాగ్రమ్స్, నంబర్ డేటా, లైన్ గ్రాఫ్, బార్ గ్రాఫ్ తదితర గ్రాఫ్ ఆధారిత డేటాల్లోని సమాధానాన్ని క్రోడీకరించే విధంగా ప్రాక్టీస్ చేయాలి. ఈ విభాగం ఎక్కువగా పర్సంటేజెస్, యావరేజెస్, రేషియోల మిళితంగా ఉంటుంది. కాబట్టి అర్థమెటిక్ అంశాలు కీలకం.

### రీజనింగ్ ఎబిలిటీ

రీజనింగ్ ఎబిలిటీలో.. కోడింగ్, డీకోడింగ్, డైరెక్షన్ టెస్ట్, బ్లడ్ రిలేషన్, సిలాయిజమ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, పజిల్స్, ఇన్‌పుట్ అండ్ అవుట్‌పుట్, డెసిషన్ మేకింగ్, సింబల్స్ అండ్ నొటేషన్స్, డేటా సఫిషియన్సీ, క్రిటికల్ రీజనింగ్ అంశాలు ఉంటాయి. ఇది వాస్తవానికి అభ్యర్థుల అనలిటికల్ సామర్థ్యాన్ని పరీక్షించడానికి ఉద్దేశించిన విభాగం. బ్యాంకు పరీక్షల్లో ఫలితాన్ని నిర్దేశించే విభాగమిది. అభ్యర్థుల విజయాన్ని తారుమారు చేసేది కూడా ఈ విభాగమే. ఇటీవల కాలంలో ఐబీపీఎస్ పరీక్షల్లో హై లెవల్ రీజనింగ్ మీద ప్రశ్నలు వస్తున్నాయి. అజంప్షన్స్, ఆర్గ్యుమెంట్స్, కాజ్ అండ్ ఎఫెక్ట్, ప్రాబ్లమ్ సాల్వింగ్, కోడింగ్, డీ-కోడింగ్, అనలిటికల్ పజిల్స్, క్రిటికల్ రీజనింగ్‌ను బాగా ప్రాక్టీస్ చేయాలి. మరీ ముఖ్యంగా అనలిటికల్ రీజనింగ్, సిలాయిజమ్స్, ఇన్ ఈక్వాలిటీస్, ఇన్‌పుట్ అవుట్‌పుట్, డేటా సఫిషియెన్సీ విభాగాల నుంచే ఎక్కువ ప్రశ్నలు ఉంటాయి. పీవో పరీక్షల్లో కాఠిన్యత స్థాయి ఎక్కువగా ఉంటుంది.



### జనరల్ నాలెడ్జ్

జనరల్ అవేర్‌నెస్‌కు సంబంధించి వివిధ దేశాల కరెన్సీలు, ముఖ్యమైన తేదీలు, అంతర్జాతీయ విమానాశ్రయాలు, పోర్టులు, నేషనల్ హైవేలు, నదులు, డ్యామ్‌లు, న్యూక్లియర్ పవర్‌ప్లాంట్లు, నేషనల్ పార్కులు, స్టేడియాలు, కేంద్ర ప్రభుత్వ విధానాలు, అంతర్జాతీయ సంస్థలు, క్రీడల నుంచి ప్రశ్నలు ఎదురవుతాయి. జనరల్ అవేర్‌నెస్‌లో కరెంట్ అఫైర్స్, స్టాక్ జనరల్ నాలెడ్జ్ కోణంలోనూ ఆర్థిక సంబంధ వ్యవహారాల (ఎకానమీ, ప్రభుత్వ పథకాలు)కు ప్రాధాన్యం ఇవ్వాలి.

### బ్యాంకింగ్ అవేర్‌నెస్

ఆర్‌బీఐ విధులు, ద్రవ్య విధానం, బ్యాంకుల జాతీయికరణ, యూనివర్సల్ బ్యాంకింగ్ లైసెన్స్ గైడ్‌లైన్స్, స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్స్, పేమెంట్ బ్యాంక్స్, బ్యాంకింగ్ టెర్మినాలజీ, రీజినల్ రూరల్ బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు, భారత ఆర్థిక వ్యవస్థకు సంబంధించి ప్రాథమిక అంశాలు, దేశ పన్నుల వ్యవస్థపై ప్రశ్నలు అడిగే అవకాశముంది. ఈ విభాగంలో బ్యాంకింగ్ రంగంలోని తాజా పరిణామాలు, విధానాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. కేవైసీ, అంబుడ్స్‌మన్, ఆర్‌బీఐ గవర్నర్, డిప్యూటీ గవర్నర్, ఆర్థిక సంబంధ సంస్థల అధిపతులు, ఉదాహరణకు సెబీ ఛైర్మన్, ఐఆర్‌డీఏ అధిపతి మొదలైనవి తెలుసుకోవాలి. నీతి ఆయోగ్, దాని ఛైర్మన్, డిప్యూటీ ఛైర్మన్, సభ్యులు తదితర వివరాలు తెలుసుకోవాలి. బ్యాంకింగ్ రంగంలోని అబ్రివేషన్లు, పదజాలం, విధులు, బ్యాంకులకు సంబంధించిన కొత్త విధానాలు, కోర్ బ్యాంకింగ్‌కు సంబంధించిన చట్టాలు, విధానాలు, రిజర్వ్ బ్యాంకు విధులు వంటి వాటిపై పూర్తిగా అవగాహన ఏర్పరచుకోవాలి.

### కంప్యూటర్ నాలెడ్జ్

ఈ విభాగానికి సంబంధించి ప్రధానంగా కంప్యూటర్ ఆపరేషన్ సిస్టమ్స్, నెట్‌వర్క్, లేయర్స్, కంప్యూటర్ స్ట్రక్చర్, ఇంటర్నెట్ సంబంధిత అంశాలు, పదజాలంపై దృష్టి పెట్టాలి. కీ బోర్డ్ షార్ట్ కట్స్, ఎంఎస్ ఆఫీస్ ఫంక్షనింగ్, షార్ట్ కట్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్ సంబంధిత అంశాలు (సీపీయూ, మానిటర్, హార్డ్‌డిస్క్..) గురించి తెలుసుకోవాలి.

### ప్రిపరేషన్ టిప్స్

- మొదటిసారి ఐబీపీఎస్ పరీక్షలు రాయడానికి సిద్ధమవుతున్న విద్యార్థులు తొలుత పరీక్ష విధానం, సిలబస్‌పై పూర్తి అవగాహన పెంచుకోవాలి. సిలబస్‌లోని ఆయా అంశాలకు సంబంధించి తమ బలాలు, బలహీనతలపై స్పష్టత తెచ్చుకోవాలి. తర్వాత పటిష్టమైన ప్రిపరేషన్ ప్లాన్ రూపొందించుకోవాలి. రోజుకు కనీసం 8 నుంచి 10 గంటల సమయాన్ని ప్రిపరేషన్‌కు కేటాయించాలి.
- ప్రతీ సబ్జెక్టుకు సంబంధించి ఒక్కో అంశాన్ని అధ్యయనం చేస్తూ.. షార్ట్‌కట్స్‌పై పట్టు పెంచుకోవాలి. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ టెస్టులు రాయాలి. పాత ప్రశ్న పత్రాలు, మోడల్ పేపర్లను ప్రాక్టీస్ చేయాలి.
- ప్రిలిమ్స్, మెయిన్ పరీక్షల మధ్య తక్కువ సమయం అందుబాటులో ఉంటుంది. కాబట్టి ఇప్పటినుంచే రెండింటిని దృష్టిలో పెట్టుకొని ప్రిపరేషన్ సాగించాలి. ఫలితంగా మెయిన్‌కు కూడా సంసిద్ధత లభిస్తుంది.

### ప్రాక్టీస్ ప్రధానం

“పరీక్షలో అభ్యర్థులు సమయాభావం కారణంగా ఎక్కువ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వలేకపోతున్నారు. మాక్ టెస్టులు, గ్రాండ్‌టెస్ట్‌లు, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పరీక్షలు రాయడం ద్వారా వేగం పెంచుకోవాలి. వీలైనన్నీ ఎక్కువ ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చేలా సిద్ధమవ్వాలి. ఉద్యోగం సాధించాలనే తపన ఒక్కటే సరిపోదు. అందుకు తగ్గట్టు సిలబస్‌పై అవగాహన, ప్రిపరేషన్‌పై శ్రద్ధ ఉండాలి. దాంతోపాటు వేగాన్ని మెరుగుపరుచుకునేందుకు సాధ్యమైనన్ని ఎక్కువ ప్రశ్నలు ప్రాక్టీస్ చేయాలి.

**అరుణ్‌వీర్ కుమార్**
(సీనియర్ ఫ్యాకల్టీ, ఐఏసీఈ)

కరెంట్ అఫైర్స్ (TM & EM) ప్రాక్టీస్ టెస్టులు
విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

నేటి టాబ్లాయిడ్ విద్య పేజీల్లో...
10th Class
SRIGAYATRI EDUCATIONAL INSTITUTIONS
MATHEMATICS



## రెండో రౌండ్‌లో ప్రజ్నేశ్ గుణేశ్వరన్ పరాజయం

టాటా ఓపెన్ మహారాష్ట్ర ఏటీపీ-250 టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత నంబర్‌వన్ ప్రజ్నేశ్ గుణేశ్వరన్ పోరాటం ముగిసింది. పుణేలో గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ప్రజ్నేశ్ 3-6, 6-7 (5/7)తో క్యాన్ సూన్-వూ (దక్షిణ కొరియా) చేతిలో ఓడిపోయాడు. పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో పురవ్ రాజా-రామ్‌కుమార్ (భారత్) జంట 6-2, 6-1తో లియాండర్ పేస్ (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీపై నెగ్గి సెమీఫైనల్‌కు చేరింది.



భవన్స్ శ్రీ అరబిందో జూనియర్ కాలేజీ జట్టు



సర్దార్ పటేల్ డిగ్రీ కాలేజీ జట్టు

# చాంపియన్స్ భవన్స్, సర్దార్ పటేల్ కాలేజీ

## సాక్షి ప్రీమియర్ లీగ్

సాక్షి, హైదరాబాద్: సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) తెలంగాణ రీజియన్ క్రికెట్ టోర్నమెంట్ జూనియర్ విభాగంలో భవన్స్ శ్రీ అరబిందో జూనియర్ కాలేజీ (సైనిక్‌పురి), సీనియర్ విభాగంలో సర్దార్ పటేల్ (ఎస్‌పీ) డిగ్రీ కాలేజీ (సికింద్రాబాద్, పద్మారావునగర్) జట్లు విజేతలుగా నిలిచాయి. 'సాక్షి' మీడియా గ్రూప్, శ్రీ చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నీ గురువారం ముగిసింది. దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎల్‌ఆర్ ఐటీ) మైదానంలో జరిగిన జూనియర్ విభాగం ఫైనల్లో భవన్స్ శ్రీ అరబిందో జూనియర్ కాలేజీ ఎనిమిది వికెట్ల తేడాతో ఎస్‌ఆర్‌ఆర్ జూనియర్ కాలేజీ (మంచిర్యాల) జట్టుపై ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఎస్‌ఆర్‌ఆర్ కాలేజీ జట్టు 20 ఓవర్లలో 74 పరుగులకు ఆలౌటైంది. సాయి (22), ఆసిఫ్ (15), వికాస్ (15) రాణించారు. భవన్స్ జట్టు బౌలర్లలో ఇలియాన్ 9 పరుగులిచ్చి 3 వికెట్లు తీయగా... మయాంక్, రాహుల్ రెండేసి వికెట్లు పడగొట్టారు. అనంతరం భవన్స్ 8 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 78 పరుగులు చేసి గెలిచింది. భవన్స్ జట్టులో సాకేత్ (43; 7 ఫోర్లు), ఇలియాన్ (12) ఆకట్టుకున్నారు. ఎస్‌ఆర్‌ఆర్ బౌలర్ సాయి కృష్ణ రెండు వికెట్లు తీశాడు. ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన ఇలియాన్‌కు 'మ్యాన్ ఆఫ్ ద ఫైనల్' అవార్డు లభించింది.

సీనియర్స్ విభాగం ఫైనల్లో సర్దార్ పటేల్ కాలేజీ 47 పరుగుల ఆధిక్యంతో ఆదర్శ్ డిగ్రీ, పీజీ కాలేజీ జట్టును ఓడించి టైటిల్ సొంతం చేసుకుంది. తొలుత సర్దార్ పటేల్ కాలేజీ జట్టు 20 ఓవర్లలో మూడు వికెట్లకు 162 పరుగులు సాధించింది. షేక్ సోహైల్ (55), రాకేశ్ (43) రాణించారు. అనంతరం ఆదర్శ్ కాలేజీ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్లకు 115 పరుగులు చేసి ఓడిపోయింది. షేక్ సోహైల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద ఫైనల్' పురస్కారం దక్కింది. జూనియర్, సీనియర్ విభాగంలో విజేతగా నిలిచిన భవన్స్, సర్దార్ పటేల్ కాలేజీ జట్లకు రూ. 50 వేలు చొప్పున... రన్నరప్ ఎస్‌ఆర్‌ఆర్, ఆదర్శ్ డిగ్రీ కాలేజీ జట్లకు రూ. 25 వేలు చొప్పున ప్రైజ్‌మనీ అందజేశారు. 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచిన సాకేత్ (భవన్స్ శ్రీ అరబిందో), రాకేశ్ (సర్దార్ పటేల్ కాలేజీ)లకు రూ. 15 వేలు చొప్పున... 'మ్యాన్ ఆఫ్ ద ఫైనల్స్'గా నిలిచిన ఇలియాన్ (భవన్స్), షేక్ సోహైల్ (సర్దార్ పటేల్)లకు రూ. 10 వేలు చొప్పున ప్రైజ్‌మనీ లభించింది. సైనిక్‌పురిలోని భవన్స్ శ్రీ అరబిందో జూనియర్ కాలేజీలో జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో సాక్షి మీడియా గ్రూప్ డైరెక్టర్లు రాణి రెడ్డి (కార్పొరేట్ ఎఫైర్స్), ఏఎల్ఎన్ రెడ్డి (బిజినెస్ కంట్రోల్), భవన్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ కమోడోర్ (రిటైర్డ్) జేఎల్ఎన్ శాస్త్రి, శ్రీ చైతన్య గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్స్ ఏజీఎం డి.వెంకటేశ్వర్లు డీన్ విజయ్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు ట్రోఫీలు, చెక్‌లు అందజేశారు.

# బంగ్లాదేశ్ వచ్చేసింది

బంగ్లాదేశ్ క్రికెట్ చరిత్రలో అతి పెద్ద ఘనత... ఫిబ్రవరి 6, 2020 ఆ దేశ క్రికెట్ అభిమానులు ఎప్పటికీ మరచిపోలేని రోజు... తొలిసారి ఆ జట్టు ఒక అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టోర్నమెంట్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. ఇప్పటి వరకు ఏ ఫార్మాట్‌లో, ఏ స్థాయిలో కూడా తుది పోరుకు అర్హత సాధించని బంగ్లాదేశ్ జట్టు అండర్-19 ప్రపంచ కప్‌లో ఆ ఘనతను అందుకుంది. సెమీఫైనల్లో న్యూజిలాండ్‌ను చిత్తు చేసి నాలుగు సార్లు చాంపియన్‌గా నిలిచిన భారత్‌తో ఆదివారం జరిగే చివరి సమరానికి సిద్ధమైంది. సెంచరీతో మహ్మూదుల్ హసన్, బౌలింగ్‌లో షరీఫుల్ ఇస్లామ్ ప్రదర్శన బంగ్లాదేశ్‌కు సెమీస్‌లో చిరస్మరణీయ విజయాన్ని అందించింది.

- తొలిసారి అండర్-19 ప్రపంచకప్‌లో ఫైనల్లో ప్రవేశం
- సెమీస్‌లో 6 వికెట్లతో న్యూజిలాండ్‌పై గెలుపు
- ఆదివారం తుది పోరులో భారత్‌తో 'ఢీ'





మహ్మూదుల్

పాచెఫ్‌స్ట్రూమ్ (దక్షిణాఫ్రికా): లీగ్ దశ నుంచి అజేయంగా నిలిచిన బంగ్లాదేశ్ తమ జోరును సెమీఫైనల్లోనూ కొనసాగించింది. అండర్-19 ప్రపంచకప్‌లో తొలిసారి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. గురువారం జరిగిన రెండో సెమీఫైనల్లో బంగ్లాదేశ్ ఆరు వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ యువ జట్టు 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 211 పరుగులు చేయగా... అనంతరం బంగ్లాదేశ్ 44.1 ఓవర్లలో 4 వికెట్లకు 215 పరుగులు చేసి విజయాన్నందుకుంది. ఆదివారం ఇదే మైదానంలో జరిగే ఫైనల్లో భారత్‌తో బంగ్లాదేశ్ తలపడుతుంది.

**రాణించిన వీలర్...**

బంగ్లా బౌలర్ల ధాటికి న్యూజిలాండ్ వరుస వికెట్లు కోల్పోయింది. ఓపెనర్లు మారియూ (1), వైట్ (18)లతో పాటు లెల్‌మన్ (24), కెప్టెన్ తష్కాఫ్ (10) కూడా విఫలం కావడంతో జట్టు స్కోరు 74/4 వద్ద నిలిచింది. ఈ స్థితిలో బెకమ్ వీలర్ (83 బంతుల్లో 75 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్సర్లు), లిడ్‌స్టోన్ (74 బంతుల్లో 44; 2 ఫోర్లు) కలిసి జట్టును ఆదుకున్నారు. వీరిద్దరు కలిసి ఐదో వికెట్‌కు 77 పరుగులు జోడించారు. అయితే 43 పరుగుల వ్యవధిలో ఆ జట్టు మళ్లీ 4 వికెట్లు కోల్పోవడంతో భారీ స్కోరు చేయడంలో విఫలమైంది. షరీఫుల్ ఇస్లామ్ 45 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా... షమీమ్ హుస్సేన్, హసన్ మురాద్ చెరో 2 వికెట్లు తీశారు.

> భారత్, బంగ్లాదేశ్ యువ జట్లు గత సెప్టెంబరులో ఆసియా కప్ ఫైనల్లో తలపడ్డాయి. భారత్ 106 పరుగులకే కుప్పకూలినా...బంగ్లాదేశ్‌ను 101 పరుగులకే ఆలౌట్ చేసి టీమిండియా 5 పరుగులతో విజయాన్నందుకుంది.

**మహ్మూదుల్ సెంచరీ...**

బంగ్లాదేశ్‌కు కూడా ఛేదనలో సరైన ఆరంభం లభించలేదు. తక్కువ వ్యవధిలో ఓపెనర్లు తన్‌జీద్ (3), పర్వేజ్ (14) అవుటయ్యారు. అయితే 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మహ్మూదుల్ హసన్ జాయ్ (127 బంతుల్లో 100; 13 ఫోర్లు) చక్కటి బ్యాటింగ్ ప్రదర్శనతో జట్టును లక్ష్యం దిశగా నడిపించాడు. అతనికి తౌహీద్ (40), షహాదత్ హుస్సేన్ (40)లనుంచి మంచి సహకారం లభించింది. తౌహీద్‌తో మూడో వికెట్‌కు 68 పరుగులు, షహాదత్‌తో నాలుగో వికెట్‌కు 101 పరుగులు జోడించిన మహ్మూదుల్ సెంచరీ పూర్తయిన అనంతరం వెనుదిరిగాడు. యూత్ క్రికెట్‌లో అతనికి ఇది నాలుగో శతకం కావడం విశేషం.

# సెమీస్‌లో బెంగళూరు రాప్టర్స్

## ఆఖరి పోరులో వారియర్స్‌పై జయభేరి



సాయిప్రణీత్

సాక్షి, హైదరాబాద్: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్)లో డిఫెండింగ్ చాంపియన్ బెంగళూరు రాప్టర్స్ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. గురువారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో బెంగళూరు జట్టు 5-0తో అవధ్ వారియర్స్‌పై ఘనవిజయం సాధించింది. గెలిచిన జట్టే ముందంజ వేసే ఈ మ్యాచ్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ తై జు యింగ్, బ్రైస్ లెవెర్‌డెజ్ తమ స్థాయికి తగ్గ ప్రదర్శనతో అదరగొట్టారు. 'ట్రంప్' మ్యాచ్‌లో తెలుగు తేజం భమిడిపాటి సాయిప్రణీత్ నెగ్గడంతో రాప్టర్స్ రెండు 'ట్రంప్' మ్యాచ్‌ల్లోనూ గెలిచి సెమీస్ దారిని సులభతరం చేసుకుంది. ఇప్పటికే నార్త్ ఈస్టర్న్ వారియర్స్, చెన్నై సూపర్‌స్టార్స్, పుణే సెవెన్ ఏసెస్ సెమీస్ చేరాయి. పురుషుల డబుల్స్‌తో మొదలైన ఈ పోరులో అరుణ్ జార్జి-రియాన్ అగుంగ్ సప్రొట్రో (రాప్టర్స్) జోడీ 15-14, 7-15, 11-15తో సంగ్ హ్యాన్-షిన్ బెక్ చియోల్ (అవధ్) ద్వయం చేతిలో కంగుతింది. అయితే అవధ్ 'ట్రంప్' పోరులో జయరామ్ 9-15, 9-15తో లెవెర్‌డెజ్ (రాప్టర్స్) చేతిలో ఓడిపోవడంతో వచ్చిన పాయింట్ కూడా చేజారింది. మహిళల సింగిల్స్‌లో తై జు యింగ్ (రాప్టర్స్) 15-12, 15-12తో బీవెన్ జాంగ్ (అవధ్)పై నెగ్గింది. అనంతరం రెండో పురుషుల సింగిల్స్ మ్యాచ్‌ను బెంగళూరు 'ట్రంప్'గా ఎంచుకోగా సాయిప్రణీత్ (రాప్టర్స్) 15-11, 15-13తో విన్సెంట్ (అవధ్)ను ఓడించి జట్టు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టాడు. దీంతో మరో మ్యాచ్ మిగిలుండగానే 4-0తో అవధ్‌పై గెలుపును ఖాయం చేసుకుంది. ఇక ఆఖరి మిక్స్‌డ్ డబుల్స్ పోరులో చన్ పెంగ్ సూన్- ఇయోమ్ హి వోన్ (రాప్టర్స్) జోడీ 7-15, 15-12, 15-11తో సంగ్ హ్యాన్-క్రిస్టీనా పెడర్సన్ (అవధ్) జంటపై గెలిచింది.

> నేడు జరిగే తొలి సెమీఫైనల్లో నార్త్ ఈస్టర్న్ వారియర్స్‌తో చెన్నై సూపర్‌స్టార్స్ జట్టు; శనివారం జరిగే రెండో సెమీఫైనల్లో పుణే సెవెన్ ఏసెస్‌తో బెంగళూరు రాప్టర్స్ జట్టు తలపడతాయి. ఆదివారం ఫైనల్ జరుగుతుంది.

# ఐపీఎల్‌కు ఆర్చర్ దూరం



**మోచేతి గాయంతో తప్పుకున్న ఇంగ్లండ్ పేసర్**

లండన్: ఐపీఎల్ సీజన్ ఆరంభానికి ముందే రాజస్తాన్ రాయల్స్‌కు గట్టి దెబ్బ తగిలింది. ఆ జట్టు ప్రధాన పేసర్ జోఫ్రా ఆర్చర్ కుడి మోచేయి గాయంతో లీగ్‌నుంచి తప్పుకున్నాడు. ఆర్చర్ గాయం తీవ్రత ఎక్కువగా ఉందని, చికిత్సలో భాగంగా అతను కనీసం మూడు నెలల పాటు ఆటకు దూరంగా ఉండాల్సి ఉందని ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) ప్రకటించింది. దాంతో రాబోయే శ్రీలంక పర్యటనకు కూడా ఆర్చర్ దూరమయ్యాడు. తమ వైద్య బృందం ఆర్చర్ పురోగతిని పరిశీలిస్తుందని, జూన్‌లో స్వదేశంలో వెస్టిండీస్‌తో జరిగే మూడు టెస్టుల సిరీస్‌కు అతను అందుబాటులోకి రావచ్చని ఈసీబీ వెల్లడించింది. రెండు సీజన్ల పాటు రాజస్తాన్‌కు ఆడిన ఆర్చర్ తన పదునైన పేస్‌తో ప్రభావం చూపించాడు. 21 ఐపీఎల్ మ్యాచ్‌లలో కేవలం 23.69 సగటుతో అతను 26 వికెట్లు పడగొట్టాడు.

# పేస్ స్థానం పదిలం

## భారత డేవిస్ కప్ జట్టు ప్రకటన

న్యూఢిల్లీ: క్రొయేషియాతో వచ్చే నెలలోని 6, 7వ తేదీల్లో జరిగే డేవిస్ కప్ టెన్నిస్ వరల్డ్ గ్రూప్ క్వాలిఫయర్స్‌లో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. పాకిస్తాన్‌తో గత నవంబర్‌లో జరిగిన డేవిస్ కప్ ఆసియా ఓసియానియా పోటీకి దూరంగా ఉన్న భారత అగ్రశ్రేణి క్రీడాకారులు ప్రజ్నేశ్ గుణేశ్వరన్, దివిజ్ శరణ్, రోహన్ బోపన్నలు జట్టులోకి పునరాగమనం చేశారు. వెటరన్ స్టార్ లియాండర్ పేస్ తన స్థానాన్ని నిలబెట్టుకోగా... సుమీత్ నాగల్, రామ్‌కుమార్‌లకు కూడా చోటు దక్కింది. పాక్‌తో మ్యాచ్‌కు నాన్ ప్లేయింగ్ కెప్టెన్‌గా వ్యవహరించిన రోహిత్ రాజ్‌పాల్ క్రొయేషియాతో మ్యాచ్‌కూ నాన్ ప్లేయింగ్ కెప్టెన్‌గా కొనసాగుతాడు.



# అమెరికా డబుల్స్ టెన్నిస్ స్టార్ అబిగెయిల్ స్పియర్స్‌పై నిషేధం



పారిస్: డోపింగ్‌లో పట్టుబడినందుకు అమెరికాకు చెందిన మహిళల టెన్నిస్ డబుల్స్ స్టార్ ప్లేయర్ అబిగెయిల్ స్పియర్స్‌పై అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) 22 నెలలపాటు నిషేధం విధించింది. 2019 యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ సందర్భంగా స్పియర్స్‌కు నిర్వహించిన డోపింగ్ పరీక్షల్లో ఆమె నిషేధిత ఉత్ప్రేరకాలు ప్రాస్టీరోన్, టెస్టోస్టిరాన్ వాడినట్లు తేలింది. 'తన శరీరంలోకి నిషేధిత ఉత్ప్రేరకాలు ఎలా వచ్చాయో స్పియర్స్ ఇచ్చిన వివరణను విన్నాం. ఆమె వివరణను అంగీకరించాం. అయితే ఆమె తప్పు చేసినందుకు నిషేధం ఎదుర్కోవాల్సిందే' అని ఐటీఎఫ్ తెలిపింది. డోపింగ్ ఫలితాలు వచ్చిన తేదీ 2019 నవంబర్ 7 నుంచి నిషేధం అమలవుతుందని వచ్చే ఏడాది సెప్టెంబర్ 6 వరకు కొనసాగుతుందని ఐటీఎఫ్ తెలిపింది. స్పియర్స్ తన కెరీర్‌లో 21 డబుల్స్ టైటిల్స్ గెలిచింది. 2017 ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో కొలంబియా ప్లేయర్ యువాన్ సెబాస్టియన్ కబాల్‌తో జతగా స్పియర్స్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో విజేతగా నిలిచింది. 2013, 2014 యూఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల ఫైనల్స్‌లో స్పియర్స్ ఓడిపోయి రన్నరప్ ట్రోఫీ సాధించింది.

# 'బుష్ ఫైర్ బాష్' వేదిక మారింది!

## మెల్‌బోర్న్‌లో ఆదివారం మ్యాచ్



పాంటింగ్, లారా

సిడ్నీ: ఆస్ట్రేలియాను ఇటీవల కుదిపేసిన కార్చిచ్చు బాధితుల సహాయార్థం నిధుల సేకరణ కోసం తలపెట్టిన ఎగ్జిబిషన్ మ్యాచ్ వేదిక, తేదీ మారాయి. 'బుష్ ఫైర్ బాష్' పేరుతో పలువురు మాజీ క్రికెటర్లు పాల్గొంటున్న ఈ మ్యాచ్ శనివారానికి బదులుగా ఆదివారం నిర్వహిస్తారు. వేదికను కూడా సిడ్నీ నుంచి మెల్‌బోర్న్‌కు మార్చారు. వాతావరణ శాఖ సూచన ప్రకారం శనివారం సిడ్నీలో భారీ వర్షం కురిసే అవకాశం ఉండటమే అందుకు కారణం. మెల్‌బోర్న్‌లోని జంక్షన్ ఓవల్‌లో జరిగే ఈ మ్యాచ్‌లో ఒక్కో జట్టు 10 ఓవర్ల చొప్పున ఆడుతుంది. దీంతో పాటు మహిళల జట్లు ఆడుతున్న రెండు అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లు, బిగ్‌బాష్ లీగ్ ఫైనల్ కూడా నిధుల సేకరణలో భాగంగా ఉన్నాయి. ఈ నాలుగు మ్యాచ్‌ల ద్వారా వచ్చిన లాభాలను రెడ్ క్రాస్‌కు అందజేస్తారు. 'బుష్ ఫైర్ బాష్'లో రెండు జట్లలో ఒకదానికి సచిన్ కోచ్‌గా వ్యవహరిస్తుండటం విశేషం. మరో టీమ్‌కు ఆసీస్ ప్రస్తుత టెస్టు కెప్టెన్ టిమ్ పైన్ కోచ్‌గా పని చేస్తాడు.

**జట్ల వివరాలు:** **పాంటింగ్ ఎలెవన్:** హేడెన్, లాంగర్, పాంటింగ్, విలాని, లారా, లిచ్‌ఫీల్డ్, హాడిన్, బ్రెట్ లీ, వసీం అక్రమ్, క్రిస్టియాన్, ల్యూక్ హాడ్జ్, సచిన్ (కోచ్). **గిల్‌క్రిస్ట్ ఎలెవన్:** గిల్‌క్రిస్ట్, వాట్సన్, బ్రాడ్ హాడ్జ్, యువరాజ్ సింగ్, బ్లాక్‌వెల్, సైమండ్స్, కోట్నీ వాల్ష్, సిడిల్, రీవోల్ట్.

## ప్రసాద్‌కు పతకం ఖాయం



బుడాపెస్ట్ (హంగేరి): బోక్స్‌కాయ్ అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ బాక్సర్ పీఎల్ ప్రసాద్ పురుషుల 52 కేజీల విభాగంలో సెమీఫైనల్ చేరాడు. తద్వారా కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. ప్రసాద్‌తో పాటు సచిన్ సివాచ్ (57 కేజీలు), గౌరవ్ చౌహాన్ (91 కేజీలు) కూడా సెమీఫైనల్లోకి అడుగు పెట్టారు.

# షెడ్యూల్ ప్రకారమే టోక్యో ఒలింపిక్స్

## 'కరోనా' ప్రకంపనలు లేవన్న నిర్వాహకులు




టోక్యో: ప్రాణాంతక కరోనా వైరస్ ప్రపంచాన్ని కలవరపెడుతున్నప్పటికీ నిర్ణీత షెడ్యూల్ ప్రకారమే ఈ ఏడాది టోక్యో ఒలింపిక్స్ క్రీడలు జరుగుతాయని నిర్వాహకులు స్పష్టం చేశారు. టోక్యోలో ఇప్పటికే వైరస్ వ్యాపించకుండా టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశామని, ముందనుకున్నట్లుగా మెగా ఈవెంట్ పోటీలు నిర్వహిస్తామని ఒలింపిక్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తొషిరో ముటో తెలిపారు. పారాలింపిక్స్ సమీక్ష సమావేశం తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ 'కరోనా వైరస్ వ్యాప్తి ఇక్కడ సాధారణ స్థితిలోనే ఉంది. నియంత్రణకు అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. దీనిపై అనవసరంగా ప్రజల్లో భయాందోళనలు పెంచొద్దు. ఈ భయాందోళనలు వైరస్ కంటే వేగంగా వ్యాపిస్తాయి. అయితే ఇక్కడ మాత్రం ఈ వైరస్‌తో ఒలింపిక్స్‌కు వచ్చిన ముప్పేమీ లేదు' అని అన్నారు. జపాన్‌లో ఇప్పటివరకు కరోనాతో ఒక్కరు కూడా మృతి చెందలేదు. 45 మంది మాత్రం వైరస్ బారినపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 28 వేల మందికి ఈ వైరస్ సోకగా ఇప్పటివరకు 560 మంది మరణించారు. అయితే ఇందులో 90 శాతం మరణాలు, వైరస్ బారిన పడినవారంతా చైనాలోనే ఉన్నారు. ఇతర దేశాల్లో కేవలం 191 కేసులే నమోదయ్యాయి.

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 163 ▲ | 49 ▲ |
| 41,306 | 12,138 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు రాత్రి 11.30కి)

| సూచీ | విలువ | | మార్పు |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 9,564 | ▲ | 54 |
| డోజోన్స్ | 29,383 | ▲ | 92 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,505 | ▲ | 22 |
| డాక్స్ | 13,575 | ▲ | 96 |
| షాంఘై | 2,867 | ▲ | 48 |
| నిక్కాయ్ | 23,873 | ▲ | 554 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | కరెన్సీ | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 70.50 | 72.14 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 90.98 | 94.21 |
| € | యూరో | ఎస్‌బీఐ | 76.98 | 79.90 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 63.73 | 66.12 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.13 | 49.27 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 50.61 | 52.37 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.19 | 19.80 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.92 | 19.92 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.59 | 11.00 |



# మారని రేట్లు.. వృద్ధికి చర్యలు

**రియల్టీ, ఆటో, బ్యాంకింగ్ రంగాలకు ప్రోత్సాహకాలు**

- రెపో, రివర్స్ రెపో రేట్లలో యథాతథ స్థితికి మొగ్గు
- కొనసాగిన ద్రవ్యోల్బణ ఆందోళనలు
- సర్దుబాటు విధానం కొనసాగింపు
- అవసరమైతే రేట్ల కోత ఉంటుందన్న సంకేతాలు

**ముంబై:** వడ్డీరేట్లను ప్రభావితం చేసే కీలకమైన రెపో రేటు, రివర్స్ రెపో రేట్లను ఎలాంటి మార్పులూ చేయకుండా యథాతథంగా ఉంచుతున్నట్లు రిజర్వ్ బ్యాంకు ప్రకటించింది. అయితే 11 ఏళ్ల కనిష్టానికి చేరిన ఆర్థిక వృద్ధికి మద్దతుగా బ్యాంకింగ్, రియల్టీ, ఎంఎస్ఎంఈ, ఆటో రంగాలకు ప్రోత్సాహక చర్యలతో ముందుకు వచ్చింది. అయితే, తన సర్దుబాటు విధానాన్ని మార్చుకోకపోవటం ద్వారా అవసరమైతే మున్ముందు రేట్ల కోతకు అవకాశం ఉంటుందని ఆర్‌బీఐ సంకేతమిచ్చింది. రుణ రేట్లను తగ్గించేందుకు వీలుగా బ్యాంకులకు రూ.లక్ష కోట్లను సమకూర్చనున్నట్టు ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ ప్రకటించారు.

**రుణాలకు మంచి రోజులు**

- సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలకు (ఎంఎస్ఎంఈ), ఆటోమొబైల్, గృహ రుణ వితరణ పెంపునకు వీలుగా నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్) నిబంధనలను ఆర్‌బీఐ సడలించింది. దీంతో ఈ రంగాలకు అదనంగా ఇచ్చే రుణాల విషయంలో బ్యాంకులు 4 శాతాన్ని సీఆర్ఆర్ రూపంలో పక్కన పెట్టాల్సిన అవసరం ఉండదు. ఇది ఈ ఏడాది జూలై వరకు అమల్లో ఉంటుంది. ఇది బ్యాంకులకు సానుకూలం. ఎందుకంటే ఇలా మిగిలిన నిధులను రుణాలివ్వటానికి వినియోగించవచ్చు.
- దేశాభివృద్ధిలో ముఖ్య పాత్ర పోషిస్తున్న ఎంఎస్ఎంఈ రంగానికి మద్దతుగా.. డిఫాల్టయిన రుణాలను 2021 మార్చి 31 వరకు పునరుద్ధరిస్తున్నట్టు ఆర్‌బీఐ తెలిపింది. జీఎస్టీ నమోదిత ఎంఎస్ఎం ఈలకే ఇది వర్తిస్తుంది. జీడీపీలో ఎంఎస్ఎంఈ రంగం వాటా 28%. ఎగుమతుల్లో వాటా 40 శాతం. అంతేకాదు 11 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్న రంగం కూడా.
- వాణిజ్య రియల్ ఎస్టేట్ రంగానికి పెద్ద ఉపశమనం కల్పించింది. ప్రమోటర్ల చేతుల్లో లేని అంశాలతో వాణిజ్య రియల్టీ ప్రాజెక్టుల కార్యకలాపాల ఆరంభం ఆలస్యమైతే, వాటి రుణ గడువును ఏడాది పాటు పొడిగించేందుకు అనుమతించింది. అంటే ప్రాజెక్టులు ఆలస్యమైనా ఆయా రుణాలను డౌన్‌గ్రేడ్ చేయరు. ఇన్‌ఫ్రాయేతర రంగాల రుణాల్లాగే వీటినీ పరిగణిస్తారు. రియల్టీ కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యలకు ఇది అదనపు మద్దతునిస్తుందని ఆర్‌బీఐ పేర్కొంది.

### మా వద్ద ఎన్నో అస్త్రాలు

''సెంట్రల్ బ్యాంకు వద్ద ఎన్నో సాధనాలున్నాయని గుర్తుంచుకోవాలి. వృద్ధి మందగమనం రూపంలో భారత ఆర్థిక రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించేందుకు అవసరమైతే వాటిని సంధిస్తాం'' అని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ స్పష్టం చేశారు. తద్వారా 2008 ఆర్థిక మాంద్యం తర్వాత అమెరికాలో మాదిరే అసాధారణ అస్త్రాలను వినియోగించేందుకు ఆర్‌బీఐ వెనుకాడదన్న సంకేతం ఇచ్చారు. రేట్లలో మార్పులు చేయకపోవడం అంచనాలకు అనుగుణంగానే ఉందన్నారు. కరోనా వైరస్ కారణంగా ప్రపంచ వృద్ధి తగ్గే రిస్క్ పెరిగిందని... అయితే, పూర్తి ప్రభావంపై అనిశ్చితి ఉందని చెప్పారు.

**ద్రవ్యోల్బణం భయాలు**

రిటైల్ ద్రవ్యోల్బణం జనవరి-మార్చి క్వార్టర్‌లో 6.5 శాతంగా ఉండొచ్చని ఆర్‌బీఐ ఎంపీసీ అంచనా వేసింది. జనవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం ఐదేళ్ల గరిష్ట స్థాయిలో 7.35 శాతంగా నమోదు కావటం తెలిసిందే. వచ్చే ఏప్రిల్ నుంచి సెప్టెంబర్‌కు ద్రవ్యోల్బణం 3.8-4 శాతం మధ్య ఉంటుందని గతంలో చేసిన అంచనాలను సవరిస్తూ 5-5.4%కి పెంచింది. ప్రధానంగా కూరగాయలు, పప్పు ధాన్యాల ధరలు పెరగొచ్చని అభిప్రాయపడింది.

**వృద్ధి రేటు 5%:** 2019-20లో వృద్ధి రేటు 5%గా ఉంటుందని ఆర్‌బీఐ తెలిపింది. 2020-21లో 6%గా ఉంటుందని అంచనా వేసింది. 2020-21 తొలి ఆరు నెలల్లో 5.9-6.3% మధ్య ఉంటుందన్న లోగడ అంచనాలను.. 5.5-6%కి తగ్గించింది.

**ఇతర ముఖ్యాంశాలు**

- రేట్ల యథాతథ స్థితికి ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ ఆధ్వర్యంలోని ఎంపీసీ కమిటీ ఏకగ్రీవంగా (ఆరుగురు సభ్యులు) ఓటు వేసింది. గత భేటీలోనూ (2019 డిసెంబర్) రేట్లలో ఎటువంటి మార్పులు చేయలేదు.
- దీంతో ఆర్‌బీఐ రెపో రేటు 5.15 శాతం, రివర్స్ రెపో రేటు 4.9 శాతంగానే కొనసాగనున్నాయి.
- ద్రవ్యలోటును జీడీపీలో 3.3 శాతానికి పరిమితం చేయాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వం బడ్జెట్లో 3.8 శాతానికి సవరించగా, దీనివల్ల మార్కెట్ నుంచి ప్రభుత్వ రుణ సమీకరణ పెరగదని ఆర్‌బీఐ పేర్కొంది.
- చిన్న పొదుపు పథకాలపై వడ్డీ రేట్లను సర్దుబాటు చేయాల్సిన అవసరం ఉందని ఎంపీసీ అభిప్రాయపడింది. దీంతో రానున్న త్రైమాసికంలో (ఏప్రిల్ నుంచి ఆరంభమయ్యే) వడ్డీ రేట్లను కేంద్రం తగ్గించే అవకాశాలున్నాయి.
- హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీల (హెచ్ఎఫ్‌సీ) నియంత్రణకు సంబంధించి సవరించిన మార్గదర్శకాలను త్వరలోనే విడుదల చేస్తారు. అప్పటి వరకు నేషనల్ హౌసింగ్ బ్యాంకు ఆదేశాలు, మార్గదర్శకాలే కొనసాగుతాయి. హెచ్ఎఫ్‌సీల నియంత్రణ గతేడాది ఆగస్ట్ 9 నుంచి ఆర్‌బీఐకి బదిలీ కావటం తెలిసిందే.
- బ్యాంకుల్లో డిపాజిట్ బీమాను ఒక డిపాజిట్‌దారునికి రూ.లక్ష నుంచి రూ.5 లక్షలకు పెంచడం బ్యాంకు బ్యాలన్స్ షీట్లపై పెద్దగా ప్రభావం చూపదని పేర్కొంది.
- బడ్జెట్లో ప్రభుత్వం వ్యక్తిగత ఆదాయపన్ను రేట్లలో చేసిన మార్పులు డిమాండ్‌కు మద్దతునిస్తాయని అంచనా వేసింది.
- తదుపరి ఆర్‌బీఐ విధాన ప్రకటన ఏప్రిల్ 3న ఉంటుంది.

### బ్యాంకుల్లోకి రూ.లక్ష కోట్లు



**లాం**గ్‌టర్మ్ రీపర్చేజ్ అగ్రిమెంట్స్ (రెపోస్/రుణాలు) ఏడాది, మూడేళ్ల కాల వ్యవధిపై రూ.లక్ష కోట్ల మేర రెపో రేటుకు జారీ చేయనున్నట్టు ఆర్‌బీఐ ప్రకటించింది. రెపోస్ అంటే.. బ్యాంకులు ప్రభుత్వ సెక్యూరిటీలను ఆర్‌బీఐకి విక్రయించి నిధులు పొందడం. గడువు తీరిన తర్వాత తిరిగి అవి మళ్లీ కొనుగోలు చేస్తాయి. ఇప్పటి వరకు ఆర్‌బీఐ గరిష్టంగా 56 రోజులకే రెపోస్‌ను ఇష్యూ చేసింది. అందులోనూ ఒక రోజు నుంచి 15 రోజుల కాలానికే ఎక్కువగా ఉండేవి. మొదటిసారి ఏడాది, మూడేళ్ల రెపోస్‌ను ఆర్‌బీఐ ప్రకటించింది. బ్యాంకుల నిధుల వ్యయాలను తగ్గించడమే ఇందులోని ఉద్దేశం. ''మానిటరీ పాలసీ బదిలీ మరింత మెరుగ్గా ఉండేందుకు తీసుకున్న చర్య ఇది. ఎందుకంటే రెపో రేటుకు నిధులను ఇస్తున్నాం. బ్యాంకింగ్ వ్యవస్థలోకి రూ.లక్ష కోట్లను విడుదల చేయాలనుకుంటున్నాం. దాంతో బ్యాంకులు రుణ రేట్లను తగ్గించేందుకు వీలు పడుతుంది'' అని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ తెలిపారు.

### ఎవరేమన్నారంటే...



ఏడాది, మూడేళ్ల లాంగ్‌టర్మ్ రెపోస్ బ్యాంకుల నిధుల వ్యయాలను తగ్గిస్తాయి. దీంతో ఈ ప్రభావాన్ని మరింత మెరుగ్గా రుణగ్రహీతలకు బదిలీ చేయడం వీలు పడుతుంది. రెపో రేట్లను మార్పు చేయకపోవడం ఊహించినదే. అయితే, అభివృద్ధి, నియంత్రణపరమైన చర్యలు ఆర్థిక రంగానికి సానుకూలం.

– రజనీష్ కుమార్, ఎస్‌బీఐ చైర్మన్



ప్రాజెక్టు రుణాలకు అదనంగా ఏడాది గడువు ఇవ్వడం రియల్ ఎస్టేట్ రంగానికి భారీ ఉపశమనం.

– అనుజ్‌పురి, అన్‌రాక్ ప్రాపర్టీ కన్సల్టెంట్స్ చైర్మన్



ఆటో, హౌసింగ్, ఎంఎస్ఎంఈ రంగాలకు ఇచ్చే ఇంక్రిమెంటల్ రుణాలకు సీఆర్ఆర్ నుంచి బ్యాంకులకు మినహాయింపునివ్వడం.. ఈ రంగాలకు రుణ వితరణను పెంచి, మందగమనానికి మందులా పనిచేస్తుంది.

– కృష్ణన్ సీతారామన్, క్రిసిల్

## ఐటీ శాఖ నుంచి ఆదాయ పన్ను కాలిక్యులేటర్



**న్యూఢిల్లీ:** మినహాయింపులుండని కొత్త ట్యాక్స్ విధానంలోకి మారదల్చుకునే వారు ఎంత మేర ఆదాయ పన్ను చెల్లించాల్సి ఉంటుందో తెలుసుకోవడానికి వీలు కల్పిస్తూ ఇన్‌కం ట్యాక్స్ శాఖ ప్రత్యేకంగా ఈ-కాలిక్యులేటర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇందులో పాత, కొత్త విధానాలను పోల్చి చూసుకుని, ఏది ప్రయోజనకరంగా ఉంటుందో ఒక అంచనాకు రావచ్చు. తమ ఆదాయాలు, మినహాయింపులు, డిడక్షన్స్ మొదలైన వివరాలన్నీ ఇందులో పొందుపరిస్తే.. పాత, కొత్త విధానాల్లో పన్ను భారాలను తెలుసుకోవచ్చు. కొన్ని మినహాయింపులను వదులుకున్న పక్షంలో తక్కువ పన్ను భారం వర్తించేలా 2020-21 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో కేంద్రం కొత్త శ్లాబులు ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ప్రస్తుత విధానంలో ఆదాయాన్ని బట్టి 5, 10, 30 శాతాల్లో పన్నులు ఉంటున్నాయి. రూ. 50,000 స్టాండర్డ్ డిడక్షన్, పొదుపు పథకాల్లో రూ. 1.5 లక్ష దాకా పెట్టుబడులకు మినహాయింపులు లభిస్తున్నాయి. ఐటీ రిటర్నులను దాఖలు చేసేందుకు ఉద్దేశించిన www.incometaxindiaefiling.gov.inలో ఈ కాలిక్యులేటర్ అందుబాటులో ఉంటుంది.

## నిర్మా గ్రూప్ చేతికి ఇమామి సిమెంట్



**డీల్ విలువ రూ.5,500 కోట్లు**

**కోల్‌కతా:** ఇమామి గ్రూప్‌నకు చెందిన ఇమామి సిమెంట్‌ను నిర్మా గ్రూప్ కొనుగోలు చేస్తోంది. నిర్మా గ్రూప్‌నకు చెందిన న్యూవొకొ విస్టాస్ కార్పొరేషన్ లిమిటెడ్ (గతంలో నిర్మా సిమెంట్) రూ.5,500 కోట్లకు ఇమామి సిమెంట్‌ను కొనుగోలు చేయనుంది. ఈ మేరకు ఒక నిశ్చయాత్మక ఒప్పందాన్ని కుదుర్చుకున్నామని ఇమామి గ్రూప్ తెలిపింది. గ్రూప్ రుణ భారాన్ని తగ్గించుకోవడానికి ఇమామి సిమెంట్‌లో వంద శాతం వాటా విక్రయించాలని ఇమామి నిర్ణయించుకుంది. 8 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం గల ఈ సిమెంట్ కంపెనీని కొనుగోలు చేయడానికి ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందిన అల్ట్రాటెక్ సిమెంట్, న్యూవొకొ విస్టాస్ కార్పొరేషన్ లిమిటెడ్, లఫార్జ్ హోల్సిమ్ కంపెనీకి చెందిన కంపెనీ, స్టార్ సిమెంట్‌లు పోటీ పడ్డాయి. చివరకు నిర్మా గ్రూప్‌నకు దక్కింది.

## ఆధార్ ఉంటే చాలు.. నిమిషాల్లోనే పాన్ కార్డ్!

**రెవెన్యూ కార్యదర్శి అజయ్ భూషణ్ పాండే వెల్లడి**



**న్యూఢిల్లీ:** పాన్ కార్డ్ పొందడం అత్యంత సులభతరం కానుంది. ఇక నుంచి ఎటువంటి ఇబ్బంది లేకుండా, కేవలం ఆధార్ నంబర్ ఆధారంగా సత్వరమే పాన్ కార్డును అందుకోవచ్చని రెవెన్యూ శాఖ కార్యదర్శి అజయ్ భూషణ్ పాండే వెల్లడించారు. ఆదాయ పన్ను శాఖ వెబ్‌సైట్‌లో ఆధార్ నెంబర్‌ను ఎంటర్ చేయగానే నమోదిత మొబైల్‌కు వన్ టైం పాస్ వార్డ్ (ఓటీపీ) వస్తుందని, దీనిని ఎంట్రీ చేసి వెంటనే ఈ-పాన్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వివరించారు. ఈ నెలాఖరు నాటికే నూతన సేవలను అందించాలని భావిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

## 'పాలసీ' లాభాలు

**ఆర్‌**బీఐ కీలక రేట్లను పెంచకపోవడంతో పాటు వృద్ధి జోరును పెంచడానికి సర్దుబాటు విధానాన్ని(అవసరమైనప్పుడు రేట్లను సవరించే) అనుసరించనున్నామని వెల్లడించడంతో గురువారం స్టాక్ మార్కెట్ లాభాల్లో ముగిసింది. సెన్సెక్స్ 163 పాయింట్ల లాభంతో 41,306 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 49 పాయింట్లు పెరిగి 12,138 పాయింట్ల వద్ద ముగిశాయి. వరుసగా నాలుగు రోజులు సెన్సెక్స్, నిఫ్టీలు లాభపడ్డాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి 5 శాతంగానే ఉండొచ్చని, వచ్చే ఆర్థిక సంవత్సరంలో మాత్రం 6 శాతానికి పెరగగలదన్న ఆర్‌బీఐ అంచనాలు, కొన్ని అమెరికా



దిగుమతులపై సుంకాలను చైనా తగ్గించడం సానుకూల ప్రభావం చూపాయి. రుణ వృద్ధి జోరు పెంచడానికి వాహన, గృహ, చిన్న వ్యాపార సంస్థలకు ఇచ్చే రుణాల విషయమై క్యాష్ రిజర్వ్ రేషియో (సీఆర్ఆర్)నిబంధనలను సరళీకరించడం కలసివచ్చింది. ఆసియా మార్కెట్లు 2 శాతం మేర లాభపడగా, యూరప్ మార్కెట్లు లాభపడ్డాయి.

**292 పాయింట్ల రేంజ్‌లో సెన్సెక్స్....**

ఒక దశలో 30 పాయింట్లు పతనమైన సెన్సెక్స్ మరో దశలో 262 పాయింట్లు ఎగసింది. రోజంతా 292 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. ఆర్‌బీఐ పాలసీ సానుకూలతతో ఆర్‌బీఎల్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, పీఎన్‌బీ, యస్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ 3-4 శాతం రేంజ్‌లో పెరిగాయి. కమర్షియల్ రియల్టీ ప్రాజెక్ట్ రుణాల గడువుకు ఆర్‌బీఐ అనుమతించడంతో హౌసింగ్ ఫైనాన్స్ షేర్లు 15 శాతం వరకూ లాభపడ్డాయి.

## త్వరలో దేశవ్యాప్తంగా సీటీఎస్



**ముంబై:** చెక్కుల క్లియరెన్స్ ప్రక్రియను మరింత వేగవంతం చేసే దిశగా సెప్టెంబర్ నాటికి దేశవ్యాప్తంగా చెక్ ట్రంకేషన్ సిస్టమ్‌ను (సీటీఎస్) అమల్లోకి తేనున్నట్లు రిజర్వ్ బ్యాంక్ వెల్లడించింది. 2010లో ప్రవేశపెట్టిన ఈ విధానం ప్రస్తుతం కొన్ని ప్రధాన నగరాల్లోనే అమలవుతోంది. ఇంకా డిజిటల్ చెల్లింపులు పెరుగుతున్న నేపథ్యంలో త్వరలో డిజిటల్ పేమెంట్స్ ఇండెక్స్‌ను (డీపీఐ) ప్రవేశపెట్టనున్నట్లు ఆర్‌బీఐ తెలియజేసింది. డిజిటల్ చెల్లింపుల తీరుతెన్నులను మరింత సమర్థంగా ప్రతిబింబించేందుకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొంది.

### అక్టోబర్-డిసెంబర్ క్వార్టర్ ఫలితాలు

(రూ. కోట్లలో)

| కంపెనీ | నికర లాభం 2019-20 | నికర లాభం 2018-19 | వృ./క్షీ.(%) | మొత్తం ఆదాయం 2019-20 | మొత్తం ఆదాయం 2018-19 | వృ./క్షీ.(%) |
|---|---|---|---|---|---|---|
| యునైటెడ్ బ్యాంక్ | 114 | (1,139) | -- | 2,971 | 2,846 | 4 |
| అదానీ పవర్ | (702) | (1,181) | -- | 6,685 | 6,667 | -- |
| ఐషర్ మోటార్స్ | 499 | 533 | -6 | 2,371 | 2,341 | 1 |
| లుపిన్ | (835) | (152) | -- | 3,716 | 3,821 | -3 |
| బాటా ఇండియా | 118 | 103 | 15 | 831 | 780 | 6 |
| డీఎల్ఎఫ్ | 414 | 335 | 24 | 1,533 | 2,406 | -36 |
| ★హీరో మోటోకార్ప్ | 905 | 773 | 17 | 7,075 | 7,937 | -10 |
| ★★సన్ ఫార్మా | 914 | 1,242 | -26 | 8,039 | 7,657 | 5 |

★ ఒక్కో షేర్‌కు రూ.65 డివిడెండ్ ★★ ఒక్కో షేర్‌కు రూ.2 మధ్యంతర డివిడెండ్ (నష్టం)

## అరబిందో లాభం రూ.705 కోట్లు

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఔషధ తయారీ సంస్థ అరబిందో ఫార్మా డిసెంబరు త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 1 శాతం తగ్గి రూ.705 కోట్లు నమోదు చేసింది. టర్నోవరు రూ.5,270 కోట్ల నుంచి రూ.5,895 కోట్లకు ఎగసింది. యూఎస్ ఫార్ములేషన్స్ ఆదాయం 22 శాతం పెరిగి రూ.2,969 కోట్లకు చేరింది. యూరప్ ఫార్ములేషన్స్ 14.2 శాతం వృద్ధితో రూ.1,476 కోట్ల ఆదాయం సాధించింది. ఎబిటా 20.5 శాతంగా ఉంది. రూ.1 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రెండవ మధ్యంతర డివిడెండు రూ.1.75 చెల్లించాలన్న ప్రతిపాదనకు బోర్డు సమ్మతించింది.

## 11 శాతం తగ్గిన ఎన్ఎండీసీ లాభం

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** మైనింగ్ రంగ దిగ్గజం ఎన్ఎండీసీ డిసెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 11.2 శాతం తగ్గి రూ.1,394 కోట్లు నమోదు చేసింది. టర్నోవరు రూ.3,786 కోట్ల నుంచి రూ.3,136 కోట్లకు వచ్చి చేరింది. రూ.1 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రూ.5.29 మధ్యంతర డివిడెండు చెల్లించాలని కంపెనీ నిర్ణయించింది.

### నేటి బోర్డ్ మీటింగ్స్...

ఎన్‌టీపీసీ, బ్రిటానియా ఇండస్ట్రీస్, కార్పొరేషన్ బ్యాంక్, ఇమామి, ఏసీసీ, అశోక బిల్డ్‌కాన్, ఎన్‌సీసీ, ఏడీఎఫ్ ఫుడ్స్

### బులియన్ రూ.లలో

| | | | |
|---|---|---|---|
| **ముంబై** | | | |
| బంగారం (99.9, 10గ్రా) | 41,320 | ▼ | 100 |
| బంగారం (99.5, 10గ్రా) | 39,350 | ▼ | 100 |
| వెండి (కిలో) | 49,800 | ▲ | 400 |
| **హైదరాబాద్/చెన్నై** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 40,550 | ▼ | 260 |
| బంగారం (22 క్యారెట్లు) | 38,620 | ▼ | 250 |
| వెండి (కిలో) | 49,800 | ▲ | 400 |
| **ప్రొద్దుటూరు** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 40,550 | ▼ | 150 |
| బంగారం (22 క్యారెట్లు) | 37,600 | ▲ | 50 |
| వెండి (కిలో) | 47,300 | | 0 |
| **విశాఖపట్నం** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 41,260 | ▼ | 110 |
| బంగారం (22 క్యారెట్లు) | 38,380 | ▼ | 100 |
| వెండి (కిలో) | 47,500 | | 0 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 41,270 | ▲ | 210 |
| బంగారం (22 క్యారెట్లు) | 38,620 | ▲ | 250 |
| వెండి (కిలో) | 47,400 | ▲ | 400 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

### కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 7-2-2020

| | |
|---|---|
| విశాఖ | 375-00 |
| చిత్తూరు | 373-00 |
| వరంగల్ | 318-00 |
| విజయవాడ | 325-00 |
| గోదావరి | 325-00 |
| **6-2-2020 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 315-00 |

## ఆటోకు ఆర్థిక శాఖ తోడ్పాటు..

**కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి**

**గ్రేటర్ నోయిడా:** కొంగొత్త టెక్నాలజీలపై పరిశోధన, అభివృద్ధి కోసం ఆటోమొబైల్ పరిశ్రమకు తగు తోడ్పాటు అందించాలని ఆర్థిక శాఖను కోరినట్లు కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. విద్యుత్ వాహనాల తయారీకి, ఎగుమతులకు భారత్ గ్లోబల్ హబ్‌గా ఎదగగలదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆటో ఎక్స్‌పో ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మంత్రి ఈ విషయాలు తెలిపారు. 'కొన్నాళ్ల క్రితం రెండు ఎలక్ట్రిక్ వాహనాల ఆవిష్కరణ కార్యక్రమంలో నేను పాల్గొన్నాను. వాటి నాణ్యత చూశాక, రాబోయే రోజుల్లో ద్విచక్ర వాహనాలైనా.. కార్లయినా.. బస్సులైనా.. విద్యుత్ వాహనాల తయారీ, ఎగుమతుల్లో మనం కచ్చితంగా నంబర్ వన్ కాగలమని నాకు అనిపించింది' అని ఆయన చెప్పారు. వాహనాల తుక్కు పాలసీ తుది దశల్లో ఉందని, ఆటోమొబైల్ పరిశ్రమకు ఇది గణనీయంగా మేలు చేయగలదని గడ్కరీ తెలిపారు. మరోవైపు వాహనాలపై జీఎస్‌టీ తగ్గించాలన్న పరిశ్రమ డిమాండ్‌పై స్పందిస్తూ.. ఇప్పటికే ఎలక్ట్రిక్ వాహనాలపై జీఎస్‌టీని గణనీయంగా తగ్గించినట్లు చెప్పారు. భారత దిగుమతుల భారాన్ని, కాలుష్యాన్ని తగ్గించేందుకు విద్యుత్ వాహనాల్లాంటి ప్రత్యామ్నాయ టెక్నాలజీలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని గడ్కరీ చెప్పారు.




### 'శాంత్రోవాలా'.. షారుఖ్..

2020 AUTO EXPO THE MOTOR SHOW

దక్షిణ కొరియా ఆటోమొబైల్ దిగ్గజం హ్యుందాయ్ ఇప్పటిదాకా అనేక కొత్త కార్లు ప్రవేశపెట్టినా.. ఇప్పటికీ తనకు శాంత్రో కారన్నా, శాంత్రో వాలా ప్రకటన అన్నా తనకు చాలా ఇష్టమని బాలీవుడ్ నటుడు షారుఖ్ ఖాన్ చెప్పారు. ఆటో ఎక్స్‌పోలో కొత్త క్రెటా ఎస్‌యూవీని ఆవిష్కరించిన సందర్భంగా ఆయన ఈ విషయాలు తెలిపారు. 22 సంవత్సరాలుగా హ్యుందాయ్‌కి షారుఖ్ బ్రాండ్ అంబాసిడర్‌గా కొనసాగుతున్నారు.



ఆటో ఎక్స్‌పోలో సుజుకీ హాయబుసా బైక్‌తో మోడల్



గ్రేట్ వాల్ మోటర్స్ ఉత్పత్తి హవల్ ఎఫ్5 ఎస్‌యూవీతో మోడల్స్



ఫోక్స్‌వ్యాగన్ ఎలక్ట్రిక్ కారు 'ఐడీ క్రాజ్'తో సంస్థ ప్రతినిధులు



జేకే మోటర్ స్పోర్ట్స్ పెవిలియన్‌లో రేసింగ్ కారుతో మోడల్స్

# నిరసనలతో అరాచకం

**సీఏఏ, ఎన్‌పీఆర్ ప్రమాదకరమైనవి కావు**
- విపక్షాలే లేనిపోని భయాలు సృష్టిస్తున్నాయి
- ఉభయ సభల్లో విపక్షాలపై మోదీ విమర్శలు


లోక్‌సభలో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ:** పార్లమెంటు నిర్ణయాలను వ్యతిరేకిస్తూ వీధుల్లో నిరసనలు, గృహదహనాలకు దిగితే చివరికి అది అరాచకత్వానికి దారి తీస్తుందని ప్రధాని మోదీ ఘాటుగా హెచ్చరించారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ జనాభా పట్టిక (ఎన్‌పీఆర్) వ్యతిరేక నిరసనల్ని విపక్షాలే రెచ్చగొడుతూ లేనిపోని భయాందోళనలను సృష్టిస్తున్నాయన్నారు. సీఏఏపై విపక్షాల వైఖరిని పాకిస్తాన్‌తో పోల్చారు. కొన్ని దశాబ్దాలుగా భారత్‌లో ముస్లింలపై పాక్ ఇదే విధంగా బురద జల్లిందన్నారు. బడ్జెట్ సమావేశాల తొలిరోజు పార్లమెంటు ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై గురువారం ఉభయ సభల్లోనూ జరిగిన చర్చకు మోదీ బదులిచ్చారు. లోక్‌సభలో గంటా 40 నిమిషాల సేపు మాట్లాడిన మోదీ సీఏఏ దేశ పౌరులపైనా, మైనార్టీల ప్రయోజనాలపైనా ఎలాంటి వ్యతిరేక ప్రభావాన్ని చూపించదని పునరుద్ఘాటించారు. రాజ్యసభలో ఎన్‌పీఆర్‌పై ఎక్కువగా మాట్లాడారు. ప్రధాని ప్రసంగం అనంతరం ఉభయ సభలు ధన్యవాద తీర్మానాన్ని ఆమోదించాయి. ఎన్‌పీఆర్‌కి సవరణలు చేపడితేనే నిజమైన నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. జనగణన, జనాభా పట్టిక సర్వసాధారణంగా జరిగే పరిపాలనాపరమైన ప్రక్రియ అని, ఇప్పుడే దీనిపై ఎందుకు రాద్ధాంతం చేస్తున్నారని ప్రశ్నించారు. బీజేపీ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తోందన్న విపక్షాల దాడిని మోదీ తిప్పి కొట్టారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీలను ముస్లింలుగా చూస్తే, తాము వారిని భారతీయులుగా చూస్తున్నామని చెప్పారు.

**చారిత్రక నిర్ణయాలు తీసుకున్నాం**

దేశ ప్రజలు తమ అయిదేళ్ల పని తీరు చూశాక బీజేపీపై నమ్మకం ఉంచి అధికారాన్ని తిరిగి అప్పగించారన్నారు. అందుకే పాలనలో వేగవంతం, విస్తృతి పెంచడం , సమస్యల్ని పరిష్కరించడం, నిబద్ధతతో నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తున్నామని మోదీ చెప్పారు. పాత విధానాలతో ముందుకు వెళితే ఆర్టికల్ 370 రద్దు అయ్యేది కాదని, ముస్లిం మహిళలు ట్రిపుల్ తలాక్‌తో బాధల్లోనే ఉండేవారని అన్నారు. ఇంకా పాత ఆలోచనలే చేస్తే రామజన్మభూమి వివాదమూ పరిష్కారమయ్యేది కాదు, కర్తార్‌పూర్ సాహిబ్ కారిడార్ సాకారమయ్యేది కాదు, భారత్, బంగ్లాదేశ్ మధ్య భూ ఒప్పందం కుదిరేది కాదని ప్రధాని చెప్పుకొచ్చారు.

**ఆర్థిక లోటును నియంత్రిస్తున్నాం**

ఆర్థిక లోటును నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, ధరల పెరుగుదలను నియంత్రిస్తున్నామని మోదీ చెప్పారు. స్థూల ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉందని తెలిపారు. మేకిన్ ఇండియాపై విదేశాలకు నమ్మకం కుదిరి ఎఫ్‌డీఐలు బాగా పెరిగాయన్నారు. ఎన్డీయే హయాంలో వ్యవసాయ బడ్జెట్‌ను అయిదు రెట్లు ఎక్కువ చేశామని రూ. 27 వేల కోట్లు ఉన్నదానిని ప్రస్తుతం రూ.1.5 లక్షల కోట్లు చేశామన్నారు.

**ఈశాన్యంలో అభివృద్ధి**

నిత్యం రక్తపాతం, హింసతో సతమతమయ్యే ఈశాన్య రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో అభివృద్ధికి బాటలు వేశామన్నారు. బోడో ఒప్పందాన్ని కుదుర్చుకోవడం ద్వారా శాంతి స్థాపన జరుగుతోందని, పెట్టుబడులకు మార్గం సుగమం అయిందన్నారు.

**గాంధీ మాకు జీవితం**

ప్రధాని మోదీ లోక్‌సభ ఆవరణలోకి రాగానే బీజేపీ సభ్యులు జై శ్రీరామ్.. అంటూ నినాదాలు చేస్తే, దానికి కౌంటర్‌గా కాంగ్రెస్ సభ్యులు మహాత్మా గాంధీ జిందాబాద్ అంటూ నినదించారు. సభలో మోదీ ప్రసంగం మొదలు కాగానే కాంగ్రెస్ సభ్యులు మహాత్ముడిని కీర్తిస్తూ నినాదాలు చేశారు. కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌదరి ఇది ట్రయలర్ మాత్రమే అంటూ వ్యంగ్యబాణాలు విసిరారు. దీంతో మోదీ ఆయనకి చురకలంటించారు. 'మీకు మహాత్మాగాంధీ ట్రయలర్ కావొచ్చు.. మాకు గాంధీయే జీవితం' అంటూ బదులిచ్చారు.

**రాహుల్ ట్యూబ్‌లైట్**

తన ప్రసంగానికి విపక్షాలు అడ్డు తగిలినప్పుడల్లా మోదీ వారిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రసంగం మధ్యలో రాహుల్ లేచి ఉద్యోగాల గురించి ప్రస్తావించగానే, తాను మాట్లాడటం మొదలు పెట్టిన 40 నిమిషాల తర్వాత స్పందించడంతో రాహుల్‌ని ట్యూబ్‌లైట్ అంటూ ఎదురు దాడికి దిగారు. ఆరు నెలల్లో యువత మోదీ వీపుని కర్రలతో వాయిస్తారంటూ రాహుల్ వ్యాఖ్యానించారని వచ్చిన వార్తల్ని ప్రధాని ప్రస్తావించారు. రాహుల్ పేరు చెప్పకుండా.. 'ప్రతిపక్ష ఎంపీ ఒకరు యువత నా వీపుని విమానం మోత మోగిస్తామని అన్నారట. అందుకే మరింత సమయం సూర్యనమస్కారాలకు సమయం కేటాయిస్తా. అప్పుడు ఎలాంటి దూషణలనైనా ఎదుర్కొనే సామర్థ్యం వస్తుంది' అని ప్రధాని నరేంద్ర మోదీ సెటైర్లు వేశారు.

## గీత గీసింది నెహ్రూయే

సీఏఏని సమర్థించుకునే క్రమంలో తొలి ప్రధాని నెహ్రూ మాటల్ని ఉదహరించారు. దేశ విభజన తర్వాత సరిహద్దుల నుంచి మన దేశంలోకి వచ్చిన వారిని హిందూ శరణార్థులు, ముస్లిం వలసదారులుగా నెహ్రూయే విభజించి చూశారని మోదీ తెలిపారు. నాటి అస్సాం సీఎం గోపీనాథ్ బర్దోలియాకి నెహ్రూ రాసిన లేఖలో అంశాలను మోదీ ప్రస్తావించారు. పాక్ నుంచి భారత్‌కొచ్చిన వారిలో హిందూ శరణార్థులకు, ముస్లిం వలసదారులకు మధ్య తేడా చూపాలని, పశ్చిమ పాకిస్తాన్, తూర్పు పాకిస్తాన్ (ఇప్పుడు బంగ్లాదేశ్) నుంచి వచ్చే మైనార్టీలను భారత్ కాపాడాలని లేఖలో ఉందన్నారు. అవసరమైతే హిందూ శరణార్థులకు పౌరసత్వం కల్పించేలా చట్టానికి సవరణలు చేద్దామని నెహ్రూ ఆ లేఖలో పేర్కొన్నారని మోదీ చెప్పారు. మరి అలా మాట్లాడిన నెహ్రూ మతవాదా? ఆయన హిందూ రాజ్యాన్ని ఏర్పాటు చేయాలనుకున్నారా అని కాంగ్రెస్‌ను ప్రశ్నించారు 'నెహ్రూ నాటి పాక్ ప్రధాని లియాఖత్ అలీఖాన్ మధ్య కుదిరిన ఒప్పందంలో పౌరులందరినీ చేర్చకుండా, మైనార్టీల ప్రయోజనాలను ఇరుదేశాల్లో కాపాడాలని ఎందుకు అంగీకారానికి వచ్చారని నిలదీశారు.

## ఏపీ విభజనను ప్రజలు మర్చిపోరు

పౌరసత్వ చట్టం సవరణలపైగానీ ఆర్టికల్ 370 రద్దు సమయంలో గానీ తమతో ఎలాంటి చర్చ జరపకుండానే ప్రభుత్వం ముందుకెళ్లిందంటూ ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలకు ప్రధాని స్పందిస్తూ.. 'ఇది ఎంత మాత్రం నిజం కాదు. వీటిపై సవివరమైన చర్చ జరిగిన విషయం యావత్తు జాతికి తెలుసు. ప్రభుత్వ నిర్ణయాలకు అనుకూలంగా సభ్యులు ఓటు వేశారు' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన 2014లో యూపీఏ హయాంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ విభజనను ప్రస్తావించారు. 'ప్రజలు అంత తేలిగ్గా ఏదీ మర్చిపోరు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటనకు దారి తీసిన పరిస్థితులను ఈ సందర్భంగా ప్రతిపక్ష నేతకు గుర్తు చేస్తున్నా. ఆ సమయంలో సభను దిగ్బంధంలో ఉంచారు. టీవీల్లో సభా కార్యకలాపాల ప్రసారాలు నిలిపివేసి ఆంధ్రప్రదేశ్ విభజనను హడావుడిగా ప్రకటించారు' అని తెలిపారు.

## నిరుద్యోగంపై మాట్లాడరా?: రాహుల్

దేశం ఎదుర్కొంటున్న అతి ప్రధానమైన నిరుద్యోగ సమస్య ప్రధాని మోదీకి కనిపించలేదా అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. నెహ్రూ, పాకిస్తాన్, బంగ్లాదేశ్ అంశాలను లేవనెత్తి మోదీయే ప్రజల్ని గందరగోళానికి గురి చేస్తున్నారని ఆరోపించారు. యువతకు రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు కానీ అయిదున్నరేళ్లు గడిచిపోతున్నా ఆ హామీ నెరవేర్చలేదని అన్నారు. వంద నిమిషాల సేపు మాట్లాడిన ప్రధానికి గత ఏడాది కోటి మంది యువత ఉద్యోగాలు కోల్పోతే దానిపై మాట్లాడడానికి సమయం దొరకలేదా అని రాహుల్ ప్రశ్నించారు.

## కశ్మీర్ నేతలపై 'పీఎస్‌ఏ' కేసు


మెహబూబా ముఫ్తీ ఒమర్ అబ్దుల్లా

**శ్రీనగర్:** జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రులు ఒమర్ అబ్దుల్లా(నేషనల్ కాన్ఫరెన్స్), మెహబూబా ముఫ్తీ(పీడీపీ)లపై కఠినమైన ప్రజా భద్రత చట్టం(పబ్లిక్ సేఫ్టీ యాక్ట్–పీఎస్ఏ) కింద గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. వారిద్దరి ఆరు నెలల ముందస్తు నిర్బంధం ముగియడానికి కొన్ని గంటల ముందు వారిపై ఈ కేసు పెట్టడం గమనార్హం. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని కేంద్రం రద్దు చేసిన 2019, ఆగస్ట్ 5వ తేదీ నుంచి ఆ ఇద్దరు నేతలు గృహ నిర్బంధంలో ఉన్న విషయం తెలిసిందే. పోలీసులతో పాటు వచ్చిన మెజిస్ట్రేట్ సంబంధిత నోటీసులను వారి నివాసాల్లో ఆ ఇద్దరు నేతలకు అందించారు. ఆ ఇద్దరితో పాటు శ్రీనగర్‌లో మంచి పట్టున్న నేషనల్ కాన్ఫరెన్స్ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి అలీ మొహమ్మద్ సగర్‌పై, పీడీపీ కీలక నేత సర్తాజ్ మదానీపై కూడా పీఎస్‌ఏ కింద నోటీసులు జారీ చేశారు. మదానీ మెహబూబా ముఫ్తీకి మామ అవుతారు. పీఎస్‌ఏలోని 'పబ్లిక్ ఆర్డర్' సెక్షన్ ప్రకారం విచారణ లేకుండా ఆరు నెలలు, 'రాజ్య భద్రతకు ప్రమాదం' అనే సెక్షన్ ప్రకారం విచారణ లేకుండా రెండు సంవత్సరాల వరకు అనుమానితులను నిర్బంధంలో ఉంచవచ్చు. ఈ చట్టం ఒమర్ అబ్దుల్లా తాత షేక్ అబ్దుల్లా హయాంలో 1978లో రూపొందింది. ముఖ్యంగా కలప స్మగ్లింగ్‌ను అరికట్టేందుకు ఈ చట్టాన్ని రూపొందించారు.

# యెడ్డీ కేబినెట్‌లో మరో 10 మంది

**కేబినెట్‌ను విస్తరించిన కర్ణాటక సీఎం**

**సాక్షి, బెంగళూరు:** కర్ణాటక ముఖ్యమంత్రి యడియూరప్ప గురువారం తన మంత్రివర్గాన్ని విస్తరించారు. కుమారస్వామి ప్రభుత్వం కూలిపోయి, బీజేపీ అధికారంలోకి రావడానికి సహకరించిన 10 మంది ఫిరాయింపు నేతలు తాజా విస్తరణలో కేబినెట్ మంత్రులుగా చోటు దక్కించుకున్నారు. ఆ 10 మంది నేతలు గత డిసెంబర్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ టికెట్‌పై గెలిచారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ వజూభాయ్‌వాలా గురువారం ఉదయం వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. కొత్తవారికి ఈనెల 8వ తేదీన శాఖలు కేటాయించనున్నట్లు సీఎం యడియూరప్ప తెలిపారు. గతేడాది జూలైలో కాంగ్రెస్ – జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసి 17 మంది ఎమ్మెల్యేలు అనర్హతకు గురైన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో.. వారిలో డిసెంబర్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ టికెట్‌పై పోటీ చేసి గెలిచిన 10 మంది ఇప్పుడు మంత్రివర్గంలో చేరారు. బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించిన 17 మందికి న్యాయం చేస్తానని గతంలో యడియూరప్ప హామీ కూడా ఇచ్చారు.


కొత్త మంత్రులతో కర్ణాటక గవర్నర్, సీఎం

**బీజేపీ వారికి నో!:** తాజా విస్తరణతో కర్ణాటకలో మంత్రివర్గ సభ్యుల సంఖ్య 28కి చేరింది. తదుపరి విస్తరణలో మరో ఆరుగురికి స్థానం కల్పించే అవకాశముంది. ఈ మంత్రివర్గ విస్తరణలో బీజేపీ ఎమ్మెల్యేలకు అవకాశం కల్పించలేదు. ఉమేశ్ కట్టి, అరవింద్ లింబావలి, సీపీ యోగేశ్వర్ అనే ముగ్గురు బీజేపీ నేతలకు అవకాశం కల్పిస్తామని సీఎం ప్రకటించారు. కానీ పార్టీ కేంద్ర నాయకత్వం ఆదేశాల మేరకు వారికి మంత్రివర్గంలో స్థానం కల్పించే విషయాన్ని ప్రస్తుతానికి వాయిదా వేశామని వివరణ ఇచ్చారు. మంత్రివర్గంలో స్థానం కోసం పలువురు ఆశావహుల నుంచి భారీగా ఒత్తిడి వచ్చిన నేపథ్యంలోనే సొంత పార్టీ వారికి ప్రస్తుతానికి అవకాశం కల్పించలేదని తెలుస్తోంది. అవకాశం కల్పించకపోతే పార్టీని వీడుతామనే హెచ్చరికలు కూడా వారి నుంచి వచ్చాయని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం బీజేపీకి అసెంబ్లీలో 117 మంది సభ్యులున్నారు.

**మంత్రివర్గంలో చోటు దక్కింది వీరికే**

ఎస్‌టీ సోమశేఖర్, రమేశ్ జార్కిహోళి, ఆనందసింగ్, కె.సుధాకర్, భైరతి బసవరాజు, శివరామ్ హెబ్బార్, బీసీ పాటిల్, కె.గోపాలయ్య, కేసీ నారాయణగౌడ, శ్రీమంత పాటిల్.

## ముగిసిన 'ఢిల్లీ' ప్రచారం




**న్యూఢిల్లీ:** వాడివేడిగా జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం గురువారం సాయంత్రంతో ముగిసింది. ఎన్నికలు ఈ నెల 8వ తేదీన జరగనున్నాయి. ఫలితాలు 11వ తేదీన వెలువడుతాయి. పౌరసత్వ సవరణ చట్ట వ్యతిరేక నిరసనలకు కేంద్రంగా మారిన షహీన్‌బాఘ్ అంశాన్ని బీజేపీ, తమ హయాంలో జరిగిన అభివృద్ధిని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రధాన ప్రచారాంశాలుగా చేపట్టాయి. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా పార్టీలోని మహామహులను బీజేపీ ప్రచారరంగంలోకి దింపింది. ఆమ్ ఆద్మీ పార్టీ ప్రచారం అంతా ఆ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కేంద్రంగానే సాగింది. బీజేపీ, ఆప్‌ల స్థాయిలో కాంగ్రెస్ ప్రచారం సాగలేదు.

**మనోజ్ తివారీ డ్యాన్స్ నాకిష్టం**

బీజేపీ ఢిల్లీ శాఖ అధ్యక్షుడు మనోజ్ తివారీని తాను ఎగతాళి చేశానన్న వార్తలను ఆప్ చీఫ్ కేజ్రీవాల్ ఖండించారు. తనకు నిజంగానే తివారీ పాటలన్నా, డాన్స్‌లన్నా ఇష్టమన్నారు. తివారీ భోజ్‌పురి నటుడన్న విషయం తెలిసిందే. ఎక్కడికి వెళ్లినా తాను మనోజ్ తివారీ పాటలను, డ్యాన్స్‌లను చూడాలని ప్రజలను కోరుతానని కేజ్రీవాల్ గురువారం పీటీఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. తివారీని ఎగతాళి చేసి పూర్వాంచల్ వాసులను తాను అవమానించానన్న విమర్శలను కేజ్రీవాల్ కొట్టిపారేశారు. తూర్పు ఉత్తరప్రదేశ్, బిహార్‌లకు చెందిన పూర్వాంచల్ వాసులు ఢిల్లీలో ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే స్థాయిలో ఉన్నారు. 2015 ఎన్నికల్లో మొత్తం 70 స్థానాలకు గానూ 67 సీట్లను ఆప్ గెలుచుకుంది. మూడింటిలో బీజేపీ విజయం సాధించింది.

# ఇంటర్నెట్ ప్రాథమిక హక్కు కాదు

**రాజ్యసభలో కేంద్ర మంత్రి రవిశంకర్**

**న్యూఢిల్లీ:** ఇంటర్నెట్ సౌకర్యం ప్రాథమిక హక్కు అనే అపోహను తొలగించాల్సిన అవసరం ఉందని కేంద్రం తెలిపింది. ఇంటర్నెట్ హక్కుతోపాటు దేశ భద్రతా చాలా ముఖ్యమైన విషయమేనని గుర్తించాలంది. కమ్యూనికేషన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, న్యాయశాఖల మంత్రి రవి శంకర్ గురువారం రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడుతూ.. 'ఇంటర్నెట్ ద్వారా భావాలు, అభిప్రాయాలను తెలుసుకోవడం భావవ్యక్తీకరణ హక్కులో ఒక భాగం. ఇదే అంశాన్ని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీనిపై ఉన్న అపోహలను తొలగించాల్సిన అవసరం ఉంది' అని అన్నారు. కశ్మీర్‌లో హింస, ఉగ్రవాద భావజాలాన్ని వ్యాప్తి చేసేందుకు పాక్ ఇంటర్నెట్‌ను దుర్వినియోగం చేస్తోందంటూ ఆయన.. ఇంటర్నెట్‌తోపాటు దేశ భద్రత ముఖ్యమైందేనని అందరూ గుర్తించాలన్నారు. దీనిపై రాజ్యసభలో ప్రతిపక్ష పార్టీ నేత గులామ్ నబీ ఆజాద్ అనుబంధ ప్రశ్నకు సమాధానంగా మంత్రి..'కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి అయిన మీరు ఉగ్రవాదుల హిట్ లిస్టులో ఉన్నారు. రాష్ట్రంలో ఇంటర్నెట్ దుర్వినియోగం అవుతోందని మీకూ తెలుసు' అని వ్యాఖ్యానించారు. ఇంటర్నెట్‌పై విధించిన ఆంక్షలను సమీక్షించి సడలించేందుకు రాష్ట్ర, కేంద్ర స్థాయిలో కమిటీలు పని చేస్తున్నాయని వివరించారు. కశ్మీర్‌లో, లడాఖ్‌ల్లో ప్రభుత్వం, బ్యాంకింగ్, పర్యాటకం, ఈ కామర్స్, రవాణా, విద్య తదితర రంగాలకు సంబంధించిన 783 వెబ్‌సైట్లపై ఎటువంటి నియంత్రణలు లేవన్నారు.



**'నెట్'దుర్వినియోగానికి ఆయా సంస్థలదే బాధ్యత**

ఇతరుల గౌరవమర్యాదలకు భంగం కలిగించేలా అశ్లీల వీడియోలు, చిత్రాలను ఉంచడం, పుకార్లు వ్యాపింప జేయడం, హింసను ప్రేరేపించడం వంటి వాటికి యూట్యూబ్, గూగుల్, వాట్సాప్ తదితర సామాజిక వేదికలను వాడుకోవడం ఆందోళన కలిగిస్తోందని రవిశంకర్ అన్నారు. ఇందుకు గాను ఆయా సంస్థలే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా వాట్సాప్‌కు సంబంధించి.. అందులోని సమాచారం మూలాలను తెలుసుకోవడం పెద్ద సమస్యగా మారిందన్నారు. యూట్యూబ్‌లో ఇతరులపై కక్ష తీర్చుకునేందుకు ఉద్దేశపూర్వకంగా ఉంచే అశ్లీల చిత్రాలు, వీడియోలకు సంబంధించి ఆ సంస్థ సీఈవో సుందర్ పిచాయ్ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు.

## న్యాయాధికారుల వేతనం మూడు రెట్లు

**నేషనల్ జ్యుడీషియల్ కమిషన్ సిఫారసు**



**న్యూఢిల్లీ:** దిగువ కోర్టుల న్యాయాధికారుల వేతనాన్ని మూడురెట్ల వరకు పెంచాలని రెండో నేషనల్ జ్యుడీషియల్ కమిషన్ సిఫారసు చేసింది. పింఛను, అలవెన్సుల మొత్తాన్ని 2016 ఏడాదినుంచి అమలయ్యేలా పెంచాలని సూచించింది. సుప్రీంకోర్టు ఆమోదిస్తే ఇవి అమలుల్లోకి రావచ్చు. 2017లో ఏర్పాటైన ఈ కమిషన్ తన నివేదికను జనవరి 29న సుప్రీంకోర్టు రిజిస్ట్రీకి సమర్పించినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ పి.వెంకటరామారెడ్డి నేతృత్వంలోని ఈ కమిషన్ దిగువ కోర్టుల్లో జడ్జీల వ్యవస్థ, పని విధానాలను పరిశీలించింది. తుది నివేదిక ప్రకారం.. జూనియర్ సివిల్ జడ్జి/ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ వేతనాన్ని రూ.27,700 నుంచి రూ.77,840కు పెంచాలి. ఆపై సీనియర్ సివిల్ జడ్జి వేతనం రూ.1,11,000 లేదా, అంతకంటే ఎక్కువ.. జిల్లా జడ్జీల ప్రారంభ వేతనం రూ.1,44,840 ఉండాలి. జిల్లా జడ్జీల వేతనం గరిష్టంగా రూ.2,24,100 ఉండాలి. చివరి వేతనంలో 50 శాతం పింఛనుగా ఇవ్వాలి.

## కబళిస్తోన్న కరోనా వైరస్..

- 563కి చేరిన మరణాల సంఖ్య
- 'కరోనా' వైద్యుడి మృతి

**బీజింగ్:** చైనాలో కరోనా వైరస్ మరణాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. కరోనా వైరస్ బారినపడి ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య ఇప్పటివరకూ మొత్తంగా 563కు చేరుకుంది. కాగా, బుధవారం ఒక్కరోజే 73 మంది చనిపోయారు. ఈ వ్యాధి సోకినట్లుగా నిర్ధారణ అయిన వారి సంఖ్య 28,018కు చేరుకుందని చైనా ఆరోగ్యశాఖ అధికారులు గురువారం తెలిపారు. దేశంలోని దాదాపు 31 ప్రావిన్సుల పరిధికి వ్యాధి విస్తరించిందని, బుధవారం మరణించిన 73 మందిలో ముగ్గురు మినహా మిగిలిన వారందరూ హుబే ప్రాంతం వారని జాతీయ ఆరోగ్య కమిషన్ ప్రకటించింది. 10రోజుల్లో ఆసుపత్రిని కట్టిన చైనా వుహాన్‌లో మరో ఆసుపత్రినికి కట్టింది. 1500 పడకలున్న ఈ ఆసుపత్రిలో త్వరలో వైద్యసేవలు ప్రారంభంకానున్నాయి. వుహాన్ సిటీ నుంచి ఢిల్లీకి చేరుకున్న 645 మందిలో ఏ ఒక్కరికీ వైరస్ సోకలేదని కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది.

**వదంతులను సృష్టించారని కక్ష**

వైరస్ వ్యాప్తిపై చైనా దేశ ప్రజలను అప్రమత్తం చేసిన ఎనిమిదిమంది వైద్యుల్లో ఒకరైన లీ వెన్‌లియాంగ్(34) చివరికి అదే వ్యాధితో కన్నుమూశారు. గత డిసెంబర్‌లో వుహాన్‌లోని వైద్య కళాశాలకు వచ్చిన రోగుల్లో ఈ వ్యాధి లక్షణాలను గుర్తించిన ఈయన తన సన్నిహితులను అప్రమత్తం చేయడానికి వుయ్‌చాట్ ఆప్‌లో ఆ వివరాలను ఉంచారు. చివరికి ఆ మెసేజ్ ద్వారా అందరికీ ఈ విషయం తెలిసిపోయింది. దీంతో ప్రభుత్వం వదంతులను వ్యాపింపజేస్తున్నారంటూ లీపై కక్షకట్టింది. చివరికి డాక్టర్ లీకి కూడా ప్రాణాంతక వైరస్ సోకి పరిస్థితి విషమించడంతో వుహాన్‌లో కన్నుమూశారు.

# ఏప్రిల్‌లో మందిర నిర్మాణం!

**'అయోధ్య' ట్రస్ట్ సభ్యుడు దేవగిరి మహారాజ్ వెల్లడి**

**పుణే/న్యూఢిల్లీ/అయోధ్య:** అయోధ్యలో రామ మందిర నిర్మాణం శ్రీరామ నవమి(ఏప్రిల్ 2) రోజు కానీ, అక్షయ తృతీయ(ఏప్రిల్ 26)రోజు కానీ ప్రారంభమవుతుందని శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర సభ్యుడు స్వామి గోవింద దేవగిరి మహరాజ్ చెప్పారు. అయోధ్యలో రామాలయ నిర్మాణం కోసం 15 మంది సభ్యులతో కేంద్రం శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర పేరుతో ఒక ట్రస్ట్‌ను బుధవారం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. రామమందిర నిర్మాణాన్ని కచ్చితంగా ఏ రోజున ప్రారంభిస్తామనేది త్వరలో జరగనున్న ట్రస్ట్ తొలి భేటీలో నిర్ణయిస్తామని దేవగిరి తెలిపారు. రెండేళ్లలో మందిరాన్ని పూర్తి చేస్తామన్నారు.

**తొలి విరాళం రూపాయి**

అయోధ్యలో రామ మందిర నిర్మాణం కోసం తొలి విరాళంగా కేంద్ర ప్రభుత్వం ఒక రూపాయిని లాంఛనంగా ట్రస్ట్‌కు అందజేసింది. కేంద్రం తరపున హోంశాఖలో అండర్ సెక్రటరీగా పని చేస్తున్న డీ ముర్ము బుధవారం ఈ మొత్తాన్ని నగదు రూపంలో ట్రస్ట్‌కు అందించారు. నగదు రూపంలో కానీ, స్థిరచరాస్తుల రూపంలో కానీ ట్రస్ట్‌కు విరాళాలు అందజేయవచ్చని అధికారులు తెలిపారు. ట్రస్ట్ కార్యాలయాన్ని తాత్కాలికంగా గ్రేటర్ కైలాశ్ ప్రాంతంలోని సీనియర్ న్యాయవాది, ట్రస్ట్ సభ్యుడు పరాశరన్ ఇంట్లో ఏర్పాటు చేశామని, త్వరలో శాశ్వత కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

**మసీదుకు ఇచ్చిన స్థలం చాలా దూరంగా ఉంది**

మసీదు నిర్మాణం కోసం సున్నీ వక్ఫ్ బోర్డ్‌కు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కేటాయించిన స్థలం అయోధ్యకు 25 కి.మీ.ల దూరంలో రోడ్డు కూడా సరిగాలేని ఓ గ్రామంలో ఉందని 'అయోధ్య' వివాదంలోని ముస్లిం పిటిషన్‌దారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. 'అయోధ్యలోని ప్రముఖ ప్రాంతంలో స్థలాన్ని కేటాయించాలని సుప్రీంకోర్టు తీర్పులో స్పష్టంగా ఉంది. ఇప్పుడు కేటాయించిన ప్రదేశంచాలా దూరంలో ఉంది' అని అసంతృప్తి వ్యక్తం చేశారు. వివాదాస్పద స్థలం ఉన్న 67 ఎకరాల్లోనే మందిరం, మసీదు ఉండాలని 1994లో ఇస్మాయిల్ ఫరుఖీ కేసులో సుప్రీం తీర్పునిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.

# డొనాల్డ్ ట్రంప్‌కి ఊరట

- వీగిపోయిన అమెరికా అధ్యక్షుడిపై అభిశంసన తీర్మానం
- రాజకీయ లబ్ధి కోసమే డెమొక్రాట్ల ప్రయత్నమన్న రిపబ్లికన్లు

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ప్రవేశపెట్టిన అభిశంసన తీర్మానం సెనేట్‌లో వీగిపోయింది. తద్వారా అధ్యక్ష ఎన్నికలకు ముందు ట్రంప్‌కు రాజకీయ విజయం లభించినట్లయింది. ట్రంప్‌పై డెమొక్రాట్లు పెట్టిన అభిశంసన తీర్మానం రిపబ్లికన్ల ఆధిక్యంలోని సెనేట్‌లో వీగిపోవడంతో ట్రంప్‌కి ఊరట లభించింది. అయితే, అభిశంసనకు గురైన అధ్యక్షులెవరూ తర్వాతి ఎన్నికల్లో పోటీ చేసిన దాఖలాలు లేవు. అభిశంసనను ఎదుర్కొన్నా, తిరిగి అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తోన్న తొలి అమెరికా అధ్యక్షుడు ట్రంపే అవుతారు. అధికార దుర్వినియోగం, కాంగ్రెస్ అధికారాన్ని అడ్డుకున్నారన్న ఆరోపణలతో ట్రంప్‌పై గత డిసెంబర్‌లో డెమొక్రటిక్ పార్టీ అమెరికన్ కాంగ్రెస్‌లో అభిశంసనను ప్రవేశపెట్టింది. కాంగ్రెస్ ఆమోదం పొందిన అభిశంసన తీర్మానాన్ని తాజాగా సెనేట్‌లో ప్రవేశపెట్టారు. ఇందులో ట్రంప్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్న అభియోగం 52–48 ఓట్ల తేడాతో, కాంగ్రెస్ విధులకు ఆటంకం కలిగించారనే అభియోగం 53–47 ఓట్ల తేడాతో వీగిపోయాయి. అభిశంసనను తిప్పికొట్టేందుకు 100 మంది సభ్యుల సభలో మూడింట రెండొంతుల ఓట్లు అవసరం. సెనేట్‌లో అధికార రిపబ్లికన్ పార్టీకి 53 సీట్లు, డెమొక్రటిక్ పార్టీకి 47 సీట్లు ఉన్నాయి.

**ట్రంప్‌పై వెల్లువెత్తిన ఆరోపణలు..**

రాబోయే ఎన్నికల్లో అధ్యక్ష పదవికి పోటీ ఇచ్చే డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి జో బిడెన్‌ను నైతికంగా దెబ్బతీసేందుకు ట్రంప్ ఉక్రెయిన్ సాయం తీసుకున్నారనీ, బదులుగా ఉక్రెయిన్‌కు ఆర్థిక సాయం చేస్తానని హామీ ఇచ్చినట్టు విమర్శలొచ్చాయి. ఈ ఒప్పందంలో భాగంగా డెమొక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి బిడెన్‌పైనా, ఆయన కొడుకు హంటర్‌పై ఉన్న అవినీతి ఆరోపణలపై దర్యాప్తును వేగవంతం చేయాలని ఉక్రెయిన్‌పై ట్రంప్ ఒత్తిడితెచ్చారన్న విమర్శలొచ్చాయి. ఈ విషయంలో ఉక్రెయిన్ అధ్యక్షుడితో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడారనీ డెమొక్రటిక్ పార్టీ ఆరోపిస్తోంది. అందుకే ట్రంప్‌పై అభిశంసన తీర్మానం తీసుకువచ్చింది.

**ఖండించిన ట్రంప్..:** తనపై అభిశంసనకు డెమొక్రటిక్ పార్టీ చేసిన యత్నం సిగ్గుచేటని అధ్యక్షుడు ట్రంప్ మండిపడ్డారు. 2020లోనూ, ఆ తరువాత కూడా అమెరికా ప్రజల పక్షాన నిలుస్తానని ట్రంప్ వ్యాఖ్యానించినట్టు అధ్యక్షభవనం ప్రకటించింది. తొలి నుంచీ తనపై ఆరోపణలు అవాస్తవమని చెబుతున్న ట్రంప్.. అభిశంసనపై దేశం విజయం సాధించిందనీ, అధ్యక్ష భవనం నుంచి ప్రకటన చేస్తానని ట్విట్టర్‌లో వెల్లడించారు. అయితే, అమెరికా ప్రజల ఆకాంక్షలనూ, రాజ్యాంగ బాధ్యతలను సెనేటర్లు విస్మరిస్తున్నారనీ, వాస్తవాలను గుర్తించడంలో వారు విఫలమవుతున్నారని డెమొక్రటిక్ పార్టీ విమర్శించింది.



అభిశంసన నుంచి బయటపడినట్లు పత్రికలో వార్తను చూపుతున్న ట్రంప్

తెలంగాణ ప్రభుత్వం
ప్రజారోగ్యం మరియు మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
NIT No.41/TUFIDC/Unit-II/ZHB/Street/Lighting/2019-20 తేది:06-02-2020
పని పేరు: జహీరాబాద్ మున్సిపాలిటీ–TUFIDC లోన్ సహాయం క్రింద జహీరాబాద్ మున్సిపాలిటీలో కొత్తగా ఏర్పడిన గ్రామపంచాయతీలకు స్ట్రీట్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయుట. అంచనా కాంట్రాక్ట్ విలువ: రూ. 62,07,647.00. బిడ్ దాఖలుకు ముగింపు తేది: 14-02-2020 సా.4:30 గం. సెల్ నం.9701385146. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ @ www.tender.telangana.gov.in లో చూడవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్(PH), TUFIDC, UNIT-II(FAC)
DIPR Ro.No.2365-DP/CL/Advt/1/2019-20, Dt: 06-02-2020

తెలంగాణ ప్రభుత్వం
సాగు నీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
పర్యవేక్షక ఇంజినీరు వారి కార్యాలయం, నీటి పారుదల శాఖ సర్కిల్, వరంగల్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీస్ సంఖ్య: 54 నుండి 61/2019-20, తేది: 30.01.2020 మరియు 62/2019-20, తేది: 03.02.2020. (9 చెక్ డ్యాంల పనులు). మహబూబాద్ మరియు జనగాం జిల్లాల్లో 9 చెక్ డ్యాంల నిర్మాణ పనుల కొరకు తేది: 06.02.2020 నుండి 13.02.2020 వరకు బిడ్లను ఆహ్వానించడమైనది. మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ http://tender.telangana.gov.in వెబ్‌సైట్ లో చూడగలరు.
ఫోన్ నం.0870-2577221. సం/- పర్యవేక్షక ఇంజినీర్, ఐ అండ్ సి.ఎ.డి.డి., నీటిపారుదల శాఖ సర్కిల్, వరంగల్
DIPR RO. No.02/02-PP/ADVT/1/2019-20, Dt: 06.02.2020

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
CTN No. 8/2019-20 తేది: 03-02-2020
పనిపేరు: నిర్మల్ జిల్లాలో (a) సతాన్‌పల్లి- పెంబి రోడ్ కిమీ 0/0 నుండి 20/0 వరకు AM (b) బాసర - లగ్నేట్టిపేట రోడ్ కి.మీ. 98/7 నుండి 132/0 వరకు మరియు ఉట్నూరు - ఇందన్‌పల్లి రోడ్డు పైన CD పనులకు వైట్ వాషింగ్ (c) బాసర - లగ్నేట్టిపేట రోడ్, సతాన్‌పల్లి - పెంబిరోడ్ మరియు ఉట్నూరు - ఇందన్‌పల్లి రోడ్ పైన దెబ్బతిన్న బ్రిడ్జి రెయిలింగ్ పునర్నిర్మాణం, బాసర - లగ్నేట్టిపేట రోడ్డు కి.మీ. 0/0 నుండి 26/3 పైన, నిర్మల్-అప్పారావుపేట రోడ్ పైన ట్రాఫిక్ Calming చర్యలకు AM మరియు ఇతర పనులకోసం దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ECV సుమారుగా: రూ. 13.00 లక్షలు పైన తెలిపిన పనికోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరుదారు టెండరు షెడ్యూలును ఇమార్కెట్‌ప్లేస్ www.eprocurement.gov.in నుండి 07-02-2020 నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. టెండర్ల స్వీకరణకు ఆఖరు తేది & సమయం : 11-02-2020న మ॥ 3.30 గం. వరకు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారంపైన చూడవచ్చును.
DIPR Ro.No. 2373-DP/CL/ADVT/1/2019-20,Dt 06/02/2020 సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (R&B) డివిజన్, నిర్మల్

ANDHRA PRADESH SOLAR POWER CORPORATION PVT LTD
(A JOINT VENTURE COMPANY OF GOVERNMENT OF A.P AND GOVERNMENT OF INDIA)
DPR Enquiry Notice
APSPCL invites quotations for Preparation of Detailed Project Reports for establishment of Solar Projects at 1) Urichintala Village of Ananthapuram Dist, 2) Pendimarri Village of YSR Dist, 3) M.Kambaladinne Village of YSR Dist. Last date for receipt of quotations is 17.02.2020 at 04.00 P.M. For further details, please go through our website : www.apspcl.ap.gov.in

JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY KAKINADA
KAKINADA-533003, Andhra Pradesh, India
VIII CONVOCATION
The VIII Convocation of Jawaharlal Nehru Technological University Kakinada, Kakinada is tentatively scheduled to be held in the month of April'2020 for the students who have completed degree programmes in the academic year 2018-19. The date and venue of Convocation, Gold Medalist details, fee and other details can be viewed from www.jntuk.edu.in. The application can be submitted ONLINE from 06-02-2020 through the web link www.jntuk.edu.in. The last date for the submission of online application is 29.02.2020.
Sd/- Registrar

## నకిలీ ఇన్వాయిస్‌లతో ఐటీసీకి శఠగోపం

**రూ. 69 కోట్ల విలువైనవిగా గుర్తించిన జీఎస్టీ ఇంటెలిజెన్స్**

**సాక్షి, హైదరాబాద్:** నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించి, చేయని వ్యాపారం చేసినట్టుగా చూపించి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) స్వాహా చేయాలనుకునే కంపెనీలకు సాయపడుతున్న ఓ చార్టర్డ్ అకౌంటెంట్ గుట్టు రట్టయింది. ఒక ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న ఆ చార్టర్డ్ అకౌంటెంట్ రూ. 69 కోట్ల విలువైన నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించినట్టు జీఎస్టీ ఇంటెలిజెన్స్ విభాగం గుర్తించింది. ఈ విభాగం తమకు అందిన సమాచారంతో గత నెల 22, ఈ నెల 5వ తేదీన 12 చోట్ల సోదాలు చేయగా.. ఆ చార్టర్డ్ అకౌంటెంట్ నకిలీ ఇన్వాయిస్‌ల బాగోతం వెలుగులోకి వచ్చింది. దీంతో ఆయనను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా, ఈ నెల 19 వరకు కోర్టు రిమాండ్ విధించింది. ఆయనకు చెందిన మూడు బ్యాంకు అకౌంట్లను సీజ్ చేశారు. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్‌లలో ఆయన నడిపించిన వ్యాపార లావాదేవీలపై కూడా దర్యాప్తు చేస్తున్నారు. ఎల్‌ఈడీ ఎలక్ట్రికల్ సామాన్ల తయారీకి సంబంధించిన నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించి రూ. 12 కోట్లకు పైగా ఐటీసీని స్వాహా చేసేందుకు పలు కంపెనీలకు ఆ ఇన్వాయిస్‌లు సరఫరా చేసినట్లు అధికారుల విచారణలో తేలింది.

## కొంగరకలాన్‌లో జాతీయ న్యాయ శిక్షణ సంస్థ

**స్థలాన్ని పరిశీలించిన హైకోర్టు చీఫ్ జస్టిస్ చౌహాన్**

**ఇబ్రహీంపట్నం రూరల్:** రంగారెడ్డి జిల్లాలో జాతీయ స్థాయి న్యాయ శిక్షణ సంస్థ ఏర్పాటు కాబోతుంది. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్‌లో ఈ సంస్థ ఉంది. అదే తరహాలో ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్‌లో ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం యోచిస్తోంది. కొంగరకలాన్‌లోని జిల్లా కలెక్టరేట్ సమీపంలో భూములను గురువారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌తో కలసి పరిశీలించారు. కొంగరకలాన్ సర్వే నంబర్ 300లో ఇప్పటికే 40 ఎకరాల్లో రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ నిర్మించారు.



అదే సర్వే నంబర్‌లో జాతీయ న్యాయ శిక్షణ సంస్థ ఏర్పాటు కోసం అధికారులు స్థలాన్ని పరిశీలించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్, టీఎస్‌ఐఐసీ ఎండీ నర్సింహారెడ్డిలు దగ్గరుండి భూములు చూపించారు. ఈ భూమిపై పూర్తి స్థాయిలో నివేదిక సమర్పించాలని సీఎస్ సోమేశ్‌కుమార్‌కు చీఫ్ జస్టిస్ సూచించారు. సుప్రీంకోర్టుకు, కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపిన తర్వాత దీనిపై స్పష్టత రానుందని అధికార వర్గాలు తెలిపాయి. జాతీయ న్యాయ అకాడమీలో న్యాయమూర్తులకు న్యాయ వ్యవస్థలో మార్పులు, చట్టాల అమలుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై శిక్షణ ఇస్తారు.

## సహకార ఎన్నికల్లో 2,308 నామినేషన్లు

**సాక్షి, హైదరాబాద్:** సహకార ఎన్నికల్లో నామినేషన్ల పర్వం గురువారం ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికలు జరుగుతున్న 32 జిల్లాల పరిధిలోని 905 పీఏసీఎస్‌లలో మొదటిరోజు 2,308 నామినేషన్లు దాఖలయ్యాయి. నిజామాబాద్‌లో అత్యధికంగా 237 నామినేషన్లు దాఖలయ్యాయి. కామారెడ్డిలో 156, కరీంనగర్‌లో 144, జగిత్యాలలో 137, నల్లగొండలో 132, పెద్దపల్లిలో 120, వరంగల్ రూరల్ జిల్లాలో 107, ఖమ్మంలో 106, రాజన్న సిరిసిల్లలో 103 నామినేషన్లు దాఖలయ్యాయి. మిగతా జిల్లాల్లో వందలోపు నామినేషన్లు దాఖలయ్యాయి. అభ్యర్థులు నామినేషన్లు వేయడానికి మరో రెండు రోజుల గడువు ఉంది. 10న స్క్రూటినీ చేసి, పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తారు. ఈ నెల 15న సహకార ఎన్నికల పోలింగ్ ఉన్న విషయం విదితమే.

## డా. ఎన్.గోపికి జీవన సాఫల్య పురస్కారం

**సాక్షి, హైదరాబాద్:** కలకత్తాకు చెందిన ప్రతిష్టాత్మక భారతీయ భాషా పరిషత్ సంస్థ ప్రముఖ తెలుగు కవి డా.ఎన్.గోపికి 'జీవన సాఫల్య పురస్కారం–2019'(కృతిత్వ సమగ్ర సమ్మాన్) ప్రకటించింది. మార్చి 21న కల్‌కత్తాలోని పరిషత్ సభాఘర్‌లో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్టు భారతీయ భాషా పరిషత్ అధ్యక్షురాలు డా.కుసుమ్ ఖేమాని తెలిపారు. ఈ అవార్డు కింద రూ. లక్ష నగదు, సన్మానపత్రం, అంగవస్త్రం ప్రదానం చేయనున్నారు. ఈ పురస్కారానికి ఎంపిక చేసిన విషయాన్ని ఎన్.గోపీకి ఈ సంస్థ తెలియజేసింది.



వర్తమాన భారతీయ భాషల సాహిత్య వికాసానికి 1975లో పశ్చిమ బెంగాల్‌లో ఈ సంస్థను ఏర్పాటు చేశారు. దేశ బహుళవాద సంస్కృతి, అఖండత, సృజనాత్మకతలను ప్రోత్సహిస్తున్న క్రియాశీలక సంస్థగా భాషా పరిషత్ పేరు గడించింది. ఎన్.గోపి రచించిన కాలాన్ని నిద్రపోనివ్వను, జలగీతం, నానీలు, వృద్ధోపనిషత్ తదితర గ్రంథాలు హిందీతోపాటు వివిధ భాషల్లోకి అనువాదమయ్యాయి.

## సాహిత్య అకాడమీ వెబ్‌సైట్ ప్రారంభం

**హైదరాబాద్:** ప్రపంచానికి తెలంగాణ సాహిత్యాన్ని చేరువ చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిద్ధారెడ్డి అన్నారు. అందులో భాగంగా తెలంగాణ సాహిత్యం, కవులు, రచయితలకు సంబంధించిన సమాచారాన్ని, కథలను పొందుపరుస్తూ రూపొందించిన tra.teanfana.gov.in వెబ్‌సైట్‌ను ఆయన గురువారం రవీంద్ర భారతిలోని అకాడమీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాహిత్య అకాడమీ ముద్రించిన పుస్తకాలు, సాహిత్యం, సాహిత్యకారులు, ప్రపంచ తెలుగు మహాసభలపై రూపొందించిన దృశ్య మాలికలను, చరిత్రను ప్రపంచంలో ఎక్కడున్నా తెలుసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సాహిత్య అకాడమీ కార్యదర్శి ఏనుగు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాశిం రిమాండ్ చట్టబద్ధతను సవాల్ చేస్తాం

**పిటిషనర్ వినతికి హైకోర్టు అనుమతి**

**సాక్షి, హైదరాబాద్:** ఉస్మానియా వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ కాశిం రిమాండ్ తరలింపులో చట్టబద్ధతను సవాల్ చేసేందుకు హైకోర్టు అనుమతిచ్చింది. పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌లోని అంశాల్ని సవరించేందుకు అనుమతించాలని ఆయన తరపు న్యాయవాది రఘునాథ్ కోరారు. ఈ మేరకు అనుమతిస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిల ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ 4 వారాలకు వాయిదా పడింది.

## ఆది మానవులు చెక్కిన శిల్పం!



**సాక్షి, హైదరాబాద్:** చేతులు చాచినట్టుగా మానవ రూపంలో కనిపిస్తున్న ఈ రాతి శిల్పం వయసు దాదాపు 3 వేల ఏళ్లకు పైనే. ఈ రాతి శిల్పాన్ని ఆదిమానవులు పాతిందేనంటున్నారు ఔత్సాహిక పరిశోధకుడు రత్నాకర్‌రెడ్డి. ఆదిమానవుల కాలంలోనూ ఆరాధనా విధానం ఉండేది. అందుకే నాటి సమాధుల వద్ద నిలువు రాళ్లు పాతి కనిపిస్తుంటాయి. చనిపోయిన వారిలో ప్రముఖులకు గుర్తుగా ఆ రాళ్లను పాతుతుంటారు. ఈ చిత్రంలో కనిపిస్తున్న రాయి కూడా అలాంటిదేనని రత్నాకర్‌రెడ్డి అంటున్నారు. జనగామ జిల్లా కొడకండ్ల గ్రామ శివారులో బయ్యన్నవాగు ఒడ్డున ఈ రాతి శిల్పం ఉంది. ఇలాంటి శిల్పాలు కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా కుమతి గ్రామ శివారులో పక్కపక్కనే ఉన్నాయని, వాటితో ఇది పోలి ఉందని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో ఇలాంటి రాళ్లకే భైరవుడి విగ్రహాలు చెక్కారు. ఈ విగ్రహం చుట్టూ నాలుగువైపులా మరో నాలుగు చెక్కిన నిలువు రాళ్లున్నాయి. దాన్ని మందిరంగా భావించే క్రమంలో వాటిని ఏర్పాటు చేశారు. అవి తర్వాతి కాలంలో ఏర్పాటు చేసినవి.

## ఐపీఎస్‌లకు పదోన్నతులు

- ముగ్గురికి ఐజీ, ఆరుగురికి డీఐజీలుగా ప్రమోషన్
- బదిలీలపై కొనసాగుతున్న ఉత్కంఠ
- డబుల్ ప్రమోషన్ దక్కినా.. కానరాని పోస్టింగ్

**సాక్షి, హైదరాబాద్ :** రాష్ట్రంలో పలువురు ఐపీఎస్ అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.మొత్తం 9 మందికి ప్రమోషన్లు రాగా, వీరిలో 2002 బ్యాచ్‌కు చెందిన ముగ్గురికి ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజీ)గా, 2006 బ్యాచ్‌కి చెందిన మరో ఆరుగురికి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీఐజీ)గా పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ గురువారం ఆదేశాలు ఇచ్చారు. 2002 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన రాజేశ్‌కుమార్, ఎన్. శివశంకర్‌రెడ్డి, వి.రవీందర్‌లకు ఐజీలుగా ప్రమోట్ చేసింది. ప్రస్తుతం సీనియర్ ఎస్పీలుగా ఉన్న 2006 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన కార్తికేయ, కె. రమేశ్‌నాయుడు, వి.సత్యనారాయణ, బి.సుమతి, ఎం.శ్రీనివాసులు, ఎ.వెంకటేశ్వర్‌రావుకు డీఐజీలుగా పదోన్నతి కల్పించింది.

**40మందికిపైగానే స్థానచలనం..!**

ఈసారి బదిలీలు భారీ ఎత్తున ఉంటాయని, దాదాపు 40 మందికి పైగా స్థానచలనం ఉంటుందని ప్రచారం సాగుతున్న వేళ.. డీజీపీ కార్యాలయం నుంచి జిల్లా స్థాయిలో విధులు నిర్వహించే పలువురు ఐపీఎస్ అధికారులు బదిలీలపై వాకబు చేస్తున్నారు. ఈ జాబితాకు ఇంకా సీఎం ఆమోదం తెలపాల్సి ఉంది.

**డబుల్ ప్రమోషన్లు దక్కినా.. పాత కుర్చీలోనే విధులు..**

గతేడాది ఏప్రిల్‌లో రాష్ట్ర ప్రభుత్వం 23 మంది ఐపీఎస్ అధికారులకు పదోన్నతి కల్పించింది. వీరిలో సీనియర్ ఎస్పీ, డీఐజీ, ఐజీ, ఏడీజీ వరకు ర్యాంకులు ఉన్నాయి. ఈ పదోన్నతి కల్పించి దాదాపు 10 నెలలు కావస్తోంది. అయినా, వీరికి కొత్త పోస్టింగు గానీ, బదిలీగానీ కల్పించలేదు. అదే సమయంలో గతేడాది ఏప్రిల్‌లో ఎస్పీ ర్యాంకునుంచి సీనియర్ ఎస్పీలుగా పదోన్నతి పొందిన 2006 ఐపీఎస్ బ్యాచ్‌కుచెందిన కార్తికేయ, కె. రమేశ్‌నాయుడు, వి.సత్యనారాయణ, బి.సుమతి, ఎం.శ్రీనివాసులు, ఎ.వెంకటేశ్వర్‌రావు ప్రస్తుతం పదోన్నతి జాబితాలోనూ చోటు దక్కించుకున్నారు. పదినెలల కాలంలో రెండోసారి పదోన్నతి సాధించిన వీరికి తాజాగా ప్రభుత్వం డీఐజీ హోదా కల్పించింది. అయినా, వీరి విషయంలోనూ ప్రభుత్వం పోస్టింగ్, బదిలీపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం. ఈ విషయంలో చాలమంది ఐపీఎస్ ఆఫీసర్లు ప్రభుత్వ తీరుపై అసంతృప్తితో ఉన్నారు. ప్రమోషన్ వచ్చిందని సంతోషించాలా? లేక కిందిస్థాయి పోస్టులోనే కొనసాగాల్సి వస్తోందని బాధపడాలో తెలియని పరిస్థితిలో ఉన్నామని అంటున్నారు.

## విభజనపై మోదీ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం

**మంత్రి శ్రీనివాస్ గౌడ్ మండిపాటు**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర విభజనపై ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంతో కూడుకున్నవని ఎక్సైజ్ శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. పదవులు మనషులకు సంస్కారం నేర్పాలని, బాధ్యతను గుర్తు చేయాలని పేర్కొన్నారు. పదవులు, అధికారం శాశ్వతం కాదని, ఈ విషయం ప్రధాని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. చట్ట సభల్లో తానో బాధ్యత కలిగిన స్థానంలో ఉన్నాననే విషయాన్ని మోదీ గుర్తుంచుకుని మాట్లాడితే మంచిదని సూచించారు. తెలంగాణ ఉద్యమం గురించి, ఇక్కడి ప్రజల ఆకాంక్ష గురించి ఏ మాత్రం తెలిసినా ఇలాంటి మాటలు మాట్లాడేవారు కాదని మండిపడ్డారు. అర్ధరాత్రి రాష్ట్రాన్ని విడగొట్టారని, తలుపులు మూసి తీర్మానం చేశారని మోదీ మాట్లాడటం దురదృష్టకరమని పేర్కొన్నారు. తెలంగాణది 4 దశాబ్దాల ఉద్యమ పోరాటమని తెలిపారు. వందలాది అమరుల త్యాగఫలమని, కేసీఆర్ పోరాట పటిమ కారణంగా తెలంగాణ ఇవ్వక తప్పని పరిస్థితి ఏర్పడిందని, అందుకే బీజేపీ మద్దతు తెలిపిందని గుర్తు చేశారు.

## కొత్తపేటలో బస్ టవర్స్

- పండ్ల మార్కెట్‌లో ఇంటర్ స్టేట్ బస్ టెర్మినల్!
- 21.78 ఎకరాల్లో మూడు టవర్లు.. సకల సౌకర్యాలు
- రాకపోకలతో పాటు రెస్టారెంట్లు, షాపింగ్ ఒకేచోట
- దిల్‌సుఖ్‌నగర్ డిపోలో సిటీ బస్ టెర్మినల్ నిర్మాణం
- హెచ్ఎండీఏ అధ్యయనం.. ప్రభుత్వానికి నివేదిక



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర రాజధానిలో ట్రాఫిక్ ఒత్తిడి తగ్గించేందుకు హెచ్ఎండీఏ మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్టు హబ్‌లపై దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా విజయవాడ జాతీయ రహదారిని అనుకొని 21.78 ఎకరాల్లో ఉన్న కొత్తపేట పండ్ల మార్కెట్.. ఇంటర్ స్టేట్ బస్ టెర్మినల్ (ఐఎస్‌బీటీ) నిర్మాణానికి అనువైనదంటూ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంతో రూ.150 కోట్ల వ్యయంతో 21.78 ఎకరాల్లో 11 అంతస్తులతో మూడు టవర్లు నిర్మించడం ద్వారా ప్రయాణికులకు సకల సౌకర్యాలను ఒకేచోట అందుబాటులోకి తేవచ్చని తేల్చింది. ఇక్కడున్న పండ్ల మార్కెట్‌ను కోహెడకు తరలిస్తారు.

**3 టవర్లలో ఈట్, ఫన్, షాప్..**

ప్రస్తుతం మార్కెటింగ్ విభాగం ఆధ్వర్యంలో ఉన్న పండ్ల మార్కెట్ స్థలంలో బస్సు ట్రాన్సిట్, పార్కింగ్, కమర్షియల్, రిటైల్ డెవలప్‌మెంట్, పోడియమ్, హోటల్‌లు, మల్టీప్లెక్స్‌లను టవర్ స్ట్రక్చర్‌లో ఏర్పాటు చేస్తారు. బస్సుల రాకపోకలు, టెర్మినల్స్, ప్యాసింజర్ సౌకర్యాలు, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, రిటైల్ షాపింగ్, ఇన్‌ఫార్మల్ షాపింగ్.. ఇలా అన్నీ ఒకేచోట ఉంటాయి.

- 1,29,275.96 చదరపు మీటర్ల ప్రాంతంలో 11 అంతస్తులతో కూడిన మొదటి టవర్‌లో బస్సుల హోల్డింగ్, పార్కింగ్ సౌకర్యాలు
- 81,688.53 చ.మీ. ప్రాంతంలో రెండో టవర్‌లో షాపింగ్ కాంప్లెక్స్, మల్టీప్లెక్స్‌లు
- 77,652.3 చదరపు మీటర్ల స్థలంలోని మూడో టవర్‌లో హోటల్ అండ్ రెస్టారెంట్లు

**ఐఎస్‌బీటీ ఎందుకంటే..**

ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి నగరానికి వందలాది ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. సిటీ బస్సులూ వేలల్లో తిరుగుతున్నాయి. దీంతో నగరంలో ట్రాఫిక్ సమస్య పెరిగిపోతోంది. ఇక్కడ ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గిస్తూ, ప్రత్యామ్నాయంగా సౌకర్యాలు కల్పిస్తూ ఐఎస్‌బీటీ నిర్మాణానికి హెచ్ఎండీఏ అధికారులు ప్రణాళిక రచించారు. విజయవాడ హైవేకు దగ్గరగా ఉండటంతో పాటు ఏ ప్రాంతం నుంచైనా బస్సులు సులువుగా వచ్చి వెళ్లే వీలుండటంతో కొత్తపేట పండ్ల మార్కెట్‌ను ఇందుకు ఎంపిక చేశారు.

**దిల్‌సుఖ్‌నగర్ బస్ డిపోలో ఐసీబీటీ**

ప్రతిపాదిత ఐఎస్‌బీటీకి కూతవేటు దూరంలో దిల్‌సుఖ్‌నగర్ బస్ డిపో విస్తరించి ఉన్న 7.83 ఎకరాల ప్రాంతం ఇంటర్ సిటీ బస్ టెర్మినల్ (ఐసీబీటీ) నిర్మాణానికి అనువైనదని హెచ్ఎండీఏ అధికారులు తేల్చారు. బస్సులు నిలిపేందుకు సువిశాల విస్తీర్ణం, స్టాఫ్ క్యాంటీన్, రెస్ట్ రూమ్‌లు, ఐదంతస్తుల మల్టీలెవల్ పార్కింగ్, స్టార్ హోటల్ తదితరాలను 2,46,317.75 చదరపు మీటర్లలో నిర్మించవచ్చని లెక్కలు వేశారు. ఇది దిల్‌సుఖ్‌నగర్ మెట్రోస్టేషన్‌కు సమీపంలోనే ఉండటంతో.. ఐఎస్‌బీటీలో దిగిన ప్రయాణికులు సులువుగా ఐసీబీటీకి చేరుకొని నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లొచ్చని, తద్వారా నగరంపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గుతుందని భావిస్తున్నారు.

## ఏప్రిల్ 2 నుంచి టీఎస్‌-బీపాస్

- 21 రోజుల్లో భవన నిర్మాణ అనుమతులు ఇవ్వాల్సిందే..
- జాప్యం చేసిన అధికారులపై జరిమానాకు యోచన
- పురపాలనలో అవినీతి నిర్మూలనే ప్రభుత్వ ప్రాధాన్యత అంశం
- అయినా అవినీతికి పాల్పడితే ఉద్యోగం నుంచి తొలగింపే..
- మున్సిపల్ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశంలో కేటీఆర్



**సాక్షి, హైదరాబాద్:** పురపాలక శాఖలో ప్రవేశపెట్టబోతున్న 'టీఎస్–బీపాస్' విధానం కింద 21 రోజుల్లో భవన నిర్మాణ అనుమతులు జారీ చేయాల్సిందేనని, ఈ విషయంలో రాజీపడబోమని పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టంచేశారు. ఏప్రిల్ 2 నుంచి పూర్తి స్థాయిలో రాష్ట్రంలోని 141 మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలతో పాటు 6 పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలో టీఎస్–బీపాస్‌ను అమలు చేస్తామన్నారు. టీఎస్–ఐపాస్ ద్వారా పరిశ్రమలకు 35 రకాల అనుమతులను వేగంగా జారీ చేస్తున్నామన్నారు. అదే రీతిలో భవన నిర్మాణాలకు అగ్నిమాపక, విద్యుత్, ట్రాఫిక్, టౌన్ ప్లానింగ్ శాఖల అనుమతులను టీఎస్–బీపాస్ ద్వారా సింగిల్ విండోలో జారీ చేస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ సిబ్బందితో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో గురువారం కేటీఆర్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పారిశ్రామిక విధానం టీఎస్–ఐపాస్ తరహాలోనే టీఎస్–బీపాస్‌ను ప్రభుత్వం తెస్తోందని, దీనికి అమలుకు సమాయత్తం కావాలని కేటీఆర్ సూచించారు.

**హైదరాబాద్ నుంచి పర్యవేక్షిస్తాం**

పురపాలనలో అవినీతి అరికట్టేలా కఠినమైన చట్టాలు, విధానాలు రూపకల్పన చేస్తున్నామని, వీటి అమలులో కూడా అంతే కఠినంగా వ్యవహరిస్తామని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వం తన ప్రాధాన్యతలను ఇంత స్పష్టంగా చెప్పిన తర్వాత కూడా, ఎవరైనా అధికారి అవినీతికి పాల్పడినట్లు రుజువైతే సస్పెన్షన్ వంటి నామమాత్రపు చర్యలు కాకుండా విధుల నుంచి పూర్తిస్థాయిలో తొలగించే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. భవన నిర్మాణ అనుమతులను హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా పర్యవేక్షిస్తామన్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో సిబ్బంది కొరతను అధిగమించేందుకు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నియామకాలకు అనుమతిస్తామన్నారు. టీఎస్‌పీఎస్సీ ద్వారా రెగ్యులర్ నియామకాలు జరిగే వరకు ఈ వెసులుబాటు కల్పిస్తామన్నారు.

**పౌరులే కేంద్రంగా పాలన**

పౌరులే కేంద్రంగా పురపాలన జరగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. కొత్త మున్సిపల్ చట్టాన్ని మున్సిపల్ కమిషనర్లు జాబ్‌చార్ట్‌గా పరిగణించాలని సూచించారు. ప్రజలు అధికారుల నుంచి అద్భుతాలేమీ ఆశించడం లేదని, ప్రాథమిక అవసరాలు, పౌర సేవలు కోరుకుంటున్నారని, ప్రజల ఆకాంక్షలకు తగ్గట్టు పని చేయాలన్నారు. అధికార వికేంద్రీకరణ స్ఫూర్తిగా రాష్ట్రం ఏర్పడిందని, అదే స్ఫూర్తితో ప్రజలకు మరిన్ని పాలన ఫలాలు అందించాలన్న లక్ష్యంతో గ్రామ పంచాయతీలు, మండలాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లాలను, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కొత్తగా ఏర్పాటు చేశామన్నారు. వికేంద్రీకరణ ఫలాలు ప్రజలకు అందాలంటే స్థానిక కమిషనర్లు తమతో పాటు పనిచేసే సిబ్బందితో, స్థానిక ప్రజలతో కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

**పారిశుద్ధ్యమే ప్రాథమిక విధి..**

కొత్త మున్సిపల్ చట్టంలోని పారిశుద్ధ్యం, పచ్చదనం, పౌర సేవలు, పురపాలనలో ఆన్‌లైన్ సేవలు, సాంకేతిక వినియోగం, ఫిర్యాదుల పరిష్కారం, అవినీతి నిర్మూలనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని గుర్తించుకోవాలని కేటీఆర్ చెప్పారు. పారిశుద్ధ్యం ప్రాథమిక విధి అని, తెల్లవారు జాము 4:30 గంటలకే కమిషనర్లు రోడ్ల మీదకు వచ్చిన పారిశుధ్య పనులను పర్యవేక్షించాలన్నారు. పట్టణాలు, నగరాల్లో అవసరమైన రీతిలో పబ్లిక్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలన్నారు. మహిళలకు ప్రత్యేకంగా 'షీ టాయిలెట్ల'ను ఏర్పాటు చేయాలన్నారు. కొత్త మున్సిపల్ చట్టం ప్రకారం మున్సిపల్ బడ్జెట్‌లో కనీసం 10 శాతం నిధులను హరిత ప్రణాళిక అమలుకు ఖర్చు చేయాలన్నారు. ప్రతి పట్టణానికి పారిశుద్ధ్య, హరిత ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు అవసరమైన ఆరోగ్య ప్రణాళిక సిద్ధంగా చేసి ఉంచాలన్నారు. పశు వైద్యులు, ఎంటమాలజిస్టుల సహకారం తీసుకోవాలన్నారు. ప్రజలకు నాణ్యమైన సేవలందించి తమదైన చెరగని ముద్ర వేసేందుకు కృషి చేయాలని కమిషనర్లకు సూచించారు. సమావేశంలో జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్, సీడీఎంఏ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## లోతైన విచారణ జరుగుతోంది

- అవకతవకతలు జరిగి ఉంటే బాధ్యులపై కఠిన చర్యలు
- 'సాక్షి'కథనంపై టీఎస్ఎస్పీడీసీఎల్ వివరణ
- ఒకే కాంట్రాక్టర్‌కు 4,769 పనులు అప్పగింతపై మౌనం

సాక్షి ఎఫెక్ట్..

**సాక్షి, హైదరాబాద్:** 'ఒకే కాంట్రాక్టర్‌కు 4769 పనులు' శీర్షికతో గురువారం 'సాక్షి'ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనంపై దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్) యాజమాన్యం స్పందించింది. ఈ కథనంలో పేర్కొన్న విషయాలపై ప్రత్యేకాధికారులతో లోతైన విచారణ జరుగుతుందని, అవకతవకతలు జరిగినట్లు తేలితే బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. సంస్థ ఆపరేషన్స్ అండ్ మెయింటనెన్స్ విభాగం చీఫ్ జనరల్ మేనేజర్ పేరుతో యాజమాన్యం ప్రకటనను జారీ చేసింది. లక్ష రూపాయల వ్యయం కలిగిన పనులను కాంట్రాక్టర్లకు (నామినేషన్ల) విధానంలో కేటాయించడానికి డివిజన్ ఇంజనీర్లకు అధికారం ఉందని స్పష్టం చేసింది.

**సీఎంవో ఆదేశించినా జరగని విచారణ..**

విద్యుత్ ఉన్నతాధికారులు, ఉద్యోగుల మధ్య ఈ విషయం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ విషయంపై టీఎస్ఎస్పీడీసీఎల్ యాజమాన్యం ఎలాంటి వివరణ ఇవ్వలేదు. ప్రామాణిక ధరల పట్టిక (ఎస్ఎస్ఆర్) రేట్లతో సంబంధం లేకుండా ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు కోసం 4 వేర్వేరు డివిజన్ల పరిధిలో 100 నుంచి 700 శాతం వరకు అధిక రేట్లతో కాంట్రాక్టర్‌కు నామినేషన్ల మీద అప్పగించిన పనులపై సైతం ఎలాంటి వివరణ ఇవ్వకపోవడం గమనార్హం. వాస్తవానికి ఈ విషయాలపై సంస్థ ఏడీఈ కోటేశ్వరరావు నేరుగా సీఎం కేసీఆర్‌కు ఏడాది కిందటే ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదుపై విచారణ జరపాలని ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశించి నెలలు గడుస్తున్నా, కనీసం విచారణ కూడా ప్రారంభించలేదని కోటేశ్వర్‌రావు 'సాక్షి'కి తెలిపారు.

## గాంధీలో నకిలీ వైద్యుడు

**ఆరునెలలుగా సంచరిస్తున్నా గుర్తించని వైనం**

**హైదరాబాద్:** మెడలో వైద్యుడిగా గుర్తింపు కార్డు, చేతిలో స్టెతస్కోప్, యాప్రాన్ వేసుకుని రోగుల కోసం గాంధీ ఆస్పత్రిలో సంచరించేవాడు. కానీ, ఇతడు డాక్టరు కాని డాక్టరు. వైద్యం కోసం వచ్చే రోగులను లక్ష్యంగా చేసుకుని వారిని తన మాయమాటలు చెప్పి క్లినిక్‌కు తరలించి వారికి వచ్చీరాని వైద్యం చేసేవాడు. 6 నెలలుగా ఇలాగే ఆస్పత్రిలో తిరుగుతున్నా ఆస్పత్రి పాలనా యంత్రాంగం అతడిని గుర్తించలేకపోయింది. చివరకు వైద్య విద్యార్థులు అతడిని అనుమానించి ఆరా తీయగా అసలు విషయం బయటపడింది.

**ఈజీమనీ లక్ష్యంతో..**

ఒడిశాకు చెందిన సుబ్రజిత్ పండా (26) నారాయణగూడలోని ఓ ప్రైవేటు కాలేజీలో ఎంఎస్సీ మైక్రోబయాలజీ చదువుతున్నాడు. సులభంగా డబ్బులు సంపాదించాలనుకుని వైద్యుడిగా అవతారం ఎత్తాడు. ఇంజక్షన్లు వేయడం, బీపీ, సుగర్ చెక్ చేయడం, జలుబు, దగ్గు, జ్వరం వంటి సాధారణ రోగాలకు ఏ మందులు ఇవ్వాలో ప్రైవేటుగా నేర్చుకున్నాడు. ఉప్పల్, హనుమాన్‌సాయినగర్‌లో తాను అద్దెకు ఉంటున్న ఇంట్లోనే ఆరు నెలల క్రితం కమ్యూనిటీ కార్డియాలజీ పేరిట క్లినిక్ ప్రారంభించాడు. విదేశాల్లో డాక్టర్ కోర్సులు చదివినట్లు నకిలీ ధ్రువపత్రాలు సృష్టించుకున్నాడు. క్లినిక్‌కు అనుకున్నంతగా రోగులు రాకపోవడంతో రూటు మార్చి.. గాంధీ ఆస్పత్రిని అడ్డాగా చేసుకున్నాడు. నకిలీ గుర్తింపు కార్డుతో గాంధీలోని వివిధ విభాగాల్లో వైద్యుడిగా తిరిగేవాడు. గురువారం ఉదయం క్యాంటిన్‌లో ఉండగా జనరల్ మెడిసిన్ పీజీలు అక్కడకు వచ్చి మీది ఏ డిపార్ట్‌మెంట్ అని పండాను అడిగారు. తామంతా జనరల్ మెడిసిన్ పీజీలమని, ఆ విభాగంలో నిన్ను ఎప్పుడూ చూడలేదని గ్రహించి, అనుమానంతో సెక్యూరిటీకి సమాచారం ఇచ్చారు. దీంతో పండాను అదుపులోకి తీసుకుని నేరుగా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రవణ్‌కుమార్ వద్దకు తీసుకువెళ్లారు. ఆరా తీయగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

## నేటి నుంచి జేఈఈ మెయిన్ దరఖాస్తులు

**సాక్షి, హైదరాబాద్:** ఏప్రిల్‌లో జరిగే జేఈఈ మెయిన్ రెండో విడత పరీక్షలకు శుక్రవారం (7వ తేదీ) నుంచి వచ్చే నెల 7 వరకు దరఖాస్తులు స్వీకరించేందుకు ఎన్‌టీఏ చర్యలు చేపట్టింది. ఈ మేరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో (https://jeemain.nta.nic.in/webinfo/public/home. aspx) దరఖాస్తు చేసుకునేలా ఏర్పాట్లు చేసింది.







Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.